9వ తరగతి పాఠ్యాంశంగా 'ఎమర్జెన్సీ'.. 2




# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - శుక్రవారం 26 జూన్ 2026 | సంపుటి: 10 | సంచిక: 171 | పేజీలు:12 | వెల రూ.5


పాస్‌పోర్టు పౌరసత్వానికి ప్రూఫ్ కాదు 2




HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

# వెనెజువెలాలో భారీ భూకంపం



## 168కు పెరిగిన భూకంప మృతులు

- 10 అంతస్తుల హోటల్.. శిథిలాల దిబ్బగా :
- ప్రధాని మోడీ దిగ్భ్రాంతి
- తక్షణసాయం : ట్రంప్



**కారకస్/ఢిల్లీ/వాషింగ్టన్, జూన్ 25:** వెనెజువెలాలో సంభవించిన వరుస భూకంపాలతో భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు 168 మంది ప్రాణాలు కోల్పోగా.. 700 మంది వరకు గాయపడ్డారని తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ వెల్లడించారు. రాజధాని నగరం కరాకస్, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో భూకంప తీవ్రత ధాటికి భవనాలు కూలిపోవడంతో.. శిథిలాల కింద అనేక మంది చిక్కుకున్నారు. దాంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు.వెనెజువెలాలో వరుస భూకంపాలు సృష్టించిన విలయం అంతా ఇంతా కాదు. ఈ విపత్తు ధాటికి ఆ దేశం అతలాకుతలమైంది. ప్రాణనష్టం కూడా భారీగానే ఉంది. ముఖ్యంగా తీర నగరమైన 'లా గువైరా' అయితే ఇప్పుడు మరుభూమిని తలపిస్తోంది. అక్కడ ఎటు చూసినా ధ్వంసమైన భవనాల వరుసలే కన్పిస్తున్నాయి. ఇక, ఈ నగరంలోని ప్రముఖ హోటల్ ఒకటి శిథిలాల దిబ్బలా మారింది. లా గువైరాలోని మకుటో ప్రాంతంలో ఉంటే 'హోటల్ ఎడ్వర్డ్' పర్యటకులకు చాలా ఫేమస్. ఎయిర్పోర్టుకు సమీపంలో ఉండే ...మిగతా 2లో

## 'అంత్యోదయ'లో మార్పులు..

### ఇకపై వ్యక్తికి 7 కేజీల రేషన్

**ఢిల్లీ, జూన్ 25:** అంత్యోదయ అన్న యోజనలో కేంద్ర ప్రభుత్వం కీలక మార్పులు తీసుకురానుంది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఈ పథకం లబ్ధిదారులకు ఒక్కొక్కరికీ 7 కిలోల ఆహారధాన్యాలు ...మిగతా 2లో



## పాస్‌పోర్ట్ ఫీజుల పెంపు

### జులై 1 నుంచి అమలులోకి

**ఢిల్లీ, జూన్ 25:** పాస్‌పోర్ట్ ఫీజులను కేంద్ర ప్రభుత్వం సవరించింది. 36 పేజీలతో కూడిన పాస్‌పోర్ట్ రుసుమును రూ.1500 నుంచి రూ.2,500 పెంచింది. తత్కాల్ ఫీజును రూ.3,500 నుంచి రూ.5 వేలకు పెంచింది. 60 పేజీల పాస్‌పోర్ట్‌కు ప్రస్తుతం రూ.2వేలు వసూలు చేస్తుండగా ఇక నుంచి రూ.3500 వసూలు చేయనున్నారు. అదే తత్కాల్ ఫీజును రూ.6వేలుగా నిర్ణయించారు. 18ఏళ్ల కన్నా తక్కువ వయసున్న దరఖాస్తుదారులకు కొత్త పాస్‌పోర్ట్ రుసుము ప్రస్తుతం రూ.1000 ఉండగా.. దీనిని రూ.1750కి పెంచారు. సవరించిన ఫీజులు జులై 1 నుంచి అమలులోకి రానున్నట్లు విదేశాంగశాఖ వెల్లడించింది.

**పాస్‌పోర్ట్ కూడా గుర్తింపు పత్రమే - ఈసీ**

పాస్‌పోర్ట్ అనేది పౌరసత్వాన్ని నిర్ధరించే పత్రం కాదని కేంద్ర ప్రభుత్వం పేర్కొనడం తీవ్ర చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ఈ పరిణామాల నేపథ్యంలో ఎన్నికల సంఘం అధికారులు స్పందించారు. దేశంలో జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో చెల్లుబాటయ్యే 12 గుర్తింపు పత్రాల్లో పాస్‌పోర్ట్ కూడా ఒకటని స్పష్టం చేశారు. ఇటీవల బీహార్, అస్సాం రాష్ట్రాల్లో చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియలోనూ పాస్‌పోర్ట్ ఓ గుర్తింపు పత్రంగా ఉందని, అందులో ఎటువంటి మార్పు లేదన్నారు.

# 3తరాల సమస్యలకు 33గేట్ల పునరుద్ధరణ

- అంతర్రాష్ట్ర జల వివాదాలకు పరిష్కారం
- తుంగభద్ర ప్రాజెక్టు 20వ గేటును
- ప్రారంభించిన సీఎం రేవంత్
- ముగ్గురు సీఎంల కలయిక శుభపరిణామం
- ఇది..చరిత్రలో నిలిచిపోతుంది
- సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్,జూన్ 25(మనం,ప్రత్యేక ప్రతినిధి): తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ ముహూర్తం చరిత్రలో నిలిచిపోతుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కర్ణాటకలోని హోస్పేటలో తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్లను గురువారం మూడు రాష్ట్రాల సీఎంలు డీకే శివకుమార్, రేవంత్ రెడ్డి, చంద్రబాబు, కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ కలిసి ప్రారంభించారు. ఈక్రమంలో తుంగభద్ర ప్రాజెక్టు 20వ గేటును సీఎం రేవంత్ రెడ్డి, 18వ గేటును కర్ణాటక సీఎం డీకే శివకుమార్, 19వ గేటును ఏపీ సీఎం చంద్రబాబు, 17వ గేటును కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ ప్రారంభించారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ 3 తరాల సమస్యలను 33 గేట్ల పునరుద్ధరణ పరిష్కరించబోతోందని స్పష్టం చేశారు. బళ్లారి, కర్నూలు, అనంతపురం, పాలమూరు సమస్యలను తుంగభద్ర తీరుస్తుందన్నారు. తక్కువ మాట్లాడి ఎక్కువ పనులు చేయడం సీఆర్ పాటిల్ ప్రత్యేకతన్నారు. కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ఉన్న నీటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. నీటి సమస్యలు పరిష్కరించుకోకపోతే అవి నేరుగా వల్ల సముద్రంలో కలుస్తాయని సీఎం రేవంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. తుంగభద్ర జలాల సమస్యకు పరిష్కారం చూపాలనే ముగ్గురు సీఎంలు ఇక్కడ కలుసుకోవడం జరిగిందన్నారు. ప్రస్తుతం చర్చలు కొలిక్కి వచ్చాయని, కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ పరిష్కారం చూపుతారని విశ్వసిస్తున్నట్లు పేర్కొన్నారు. రాజోలి బండ డైవర్షన్ స్కీం ద్వారా రావాల్సిన 15.9 టీఎంసీల్లో ఐదారు టీఎంసీలే వస్తున్నాయన్న ఆయన దాదాపు పది టీఎంసీల నీళ్లు తెలంగాణకు రావట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు.



తుంగభద్రలో మట్టి పేరుకుపోవడం, నీటి తరలింపు వంటి సమస్యలకు పరిష్కారం చూపాలని సీఎం రేవంత్ రెడ్డి కేంద్రాన్ని కోరారు. కర్ణాటక సీఎం డీకే శివకుమార్ సూచనతో సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా పనిచేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ రోజును చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబోతున్నారని, తుంగభద్ర ఒడ్డున చర్చలు చరిత్రలో గొప్ప నిర్ణయంగా మారబోతున్నాయన్నారు. ఈ నిర్ణయం అంతర్రాష్ట్ర జల వివాదాలకు పరిష్కారం చూపుతుందని విశ్వసిస్తున్నామని చెప్పారు.3 రాష్ట్రాల ప్రతినిధులం ఏది ఏమైనా సరే ఈ సమస్యకు పరిష్కారం చూపించాలని ...మిగతా 2లో


## విద్యార్థుల హక్కుల కోసం పోరాటం

- **టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్**

హైదరాబాద్,జూన్ 25(మనం,ప్రత్యేక ప్రతినిధి): నీట్ అక్రమాలపై రాజస్థాన్ కోటాలో రాహుల్ గాంధీ చేపట్టిన ఉద్యమానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని టీపీసీసీ చీఫ్‌మహేష్ కుమార్ గౌడ్ పిలుపు ఇచ్చారు. ఆర్ఎస్ఎస్ మూలాలున్న వ్యక్తులే నీట్ పేపర్ లీక్‌కు కారణమని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం నీట్ పరీక్ష పేపర్‌ను లీక్ చేశారని ఆయన ఆరోపించారు. గురువారం నారాయణగూడలో ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఛాత్రోన్ కి గూంజ్ పేరిట విద్యార్థి ప్రజెంటేషన్ కార్యక్రమం జరిగింది.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పీసీసీ చీఫ్ మాట్లాడుతూ నీట్ ...మిగతా 2లో

## ప్రపంచంలో ఒకేరోజు వేర్వేరు చోట్ల భూకంపాలు..

శాస్త్రవేత్తలు ఏమన్నారంటే..? 9



# అవును నేను గుంపు మేస్త్రీనే

## మంత్రుల, ప్రజల గుంపంతా నాదే

- సార్.. కంటే.. అన్నా అంటేనే ఆనందం
- ప్రభుత్వ ఉద్యోగులకు బీమా ధీమా
- ఔట్ సోర్సింగ్, పెన్షనర్లకు వర్తింపు
- 16 బ్యాంకులతో ఒప్పందం
- దేశంలోనే తొలిసారి విమాన ప్రమాద భీమా
- అభివృద్ధికి అడ్డుపడితే చింతబరిగె ఇరుగుతది
- ప్రతిపక్షాలకు సీఎం హెచ్చరికలు




**హైదరాబాద్,జూన్ 25(మనం,ప్రత్యేక ప్రతినిధి):** తనను సార్ అని పిలవడం కంటే అన్నా అని పిలిస్తేనే ఎనలేని సంతోషమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరంలోని రవీంద్రభారతిలో గురువారం ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల ప్రమాద బీమా పథకానికి శ్రీకారం చుట్టారు. రెగ్యులర్ ఉద్యోగులు సహా.. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ఇతర తాత్కాలిక ఉద్యోగులకు ఉచిత బీమా కల్పించేలా సీఎం రేవంత్ రెడ్డి 16 బ్యాంకులతో ఒప్పందం కుదుర్చుకుని ఆయా ఎంఓయూలపై సీఎం సంతకాలు చేశారు. అనంతరం సీఎం మాట్లాడుతూ ప్రభుత్వం కోసం కష్టపడేవారికి అండగా ఉండాల్సిన బాధ్యత యజమానిదేనన్నారు. దీనిని ఉద్యోగులు అడగకపోయినా ప్రభుత్వమే ఒకడుగు ముందుకు వేసిందన్నారు. ఉద్యోగులందరికీ ఇన్సూరెన్స్ ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పదవీ విరమణ తర్వాత కూడా ఉద్యోగులు ఇన్సూరెన్స్ ప్రయోజనాలు పొందేలా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రమాద బీమా ద్వారా ఉద్యోగులకు రూ.కోటి నుంచి రూ.1.5 కోట్ల వరకూ కవరేజి ఉంటుందని, విమాన ప్రమాద బీమాకు బ్యాంకులు రూ.2కోట్లు, రూ.3 కోట్లు బీమాను అందిస్తున్నాయని, ఇది దేశంలోనే తొలిసారని వివరించారు. రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్న ఉద్యోగులందరికీ సీఎం ధన్యవాదాలు తెలిపారు.

**అవును గుంపు మేస్త్రీనే :** అవును.. నేను గుంపు మేస్త్రినే అంటూ సీఎం రేవంత్‌రెడ్డి గర్వంగా ప్రకటించారు. నన్ను చాలా మంది గుంపు మేస్త్రి అంటూ అవహేళన చేస్తారని, తాను గుంపు మేస్త్రినేనని ఎందుకంటే... నా ఉద్యోగులు, నా ప్రజలే నా గుంపు అని వివరించారు. మంత్రివర్గానికీ తానే మేస్త్రీ అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎవరు అవహేళన చేసినా పట్టించుకోనని, రేవంతన్నగా పిలిపించుకోవడమే తనకు ఇష్టమని చెప్పారు. పదవులు, హోదాలు మారొచ్చుగానీ ప్రజలతో తన అనుబంధం ఎప్పటికీ మారదని స్పష్టం చేశారు. పేద ప్రజల కష్టాలను తీర్చే నిజమైన వారధులు మీరే కదా? కొంతమంది దొరలమని గొప్పలు చెప్పుకుంటారని తనకు అలాంటి గొప్పలు అవసరం లేదన్నారు.తాను దొరను కాదని, ప్రజల మధ్య నుంచి ఎదిగిన వ్యక్తినని అన్నారు. అలాగే గత పాలనలో ఉద్యోగులకు ప్రతి నెల 10వ తేదీ వరకు కూడా జీతాలు అందని పరిస్థితి ఉండేదని విమర్శించారు. తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే సమయానికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 జనవరి 1 నుంచి ప్రతి నెల ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామని తెలిపారు. పదవుల కంటే ప్రజల ప్రేమే ముఖ్యమని, నాటి జడ్పీటీసీ ప్రస్థానం నుండి నేటి సీఎం కుర్చీ వరకు తన ప్రవర్తనలో ఎలాంటి మార్పు లేదన్నారు. ఒకప్పుడు తాను జడ్పీటీసీని, ఆ తర్వాత ఎంపీని.. ఇప్పుడు సీఎంని. కానీ, నేను సీఎం కాకముందు ఎలా ఉన్నానో... ఇప్పుడు కూడా అలాగే ఉన్నా. పదవులు ఎప్పుడూ శాశ్వతం కాదు... ప్రజల గుండెల్లో ఉండే స్థానమే శాశ్వతమన్నారు.

ప్రభుత్వం చేపడుతున్న ప్రతీ అభివృద్ధి పనికి ప్రతిపక్షాలు అడ్డు పడుతూ బురద జల్లుతున్నాయని, వారికి చింత బరిగె ఇరుతుందని సీఎం హెచ్చరించారు. రాష్ట్రంలో తాము చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని, ముఖ్యంగా మూసీ నది పునరుజ్జీవనం చేద్దామంటే నా కాళ్లలో కట్టెలు పెడుతున్నారన్నారు. రీజనల్ రింగ్ రోడ్డు చేపడితే తప్పా? మెట్రో విస్తరణ చేద్దామన్నా, ఆర్ఆర్ఆర్ తెస్తామన్నా వద్దే వద్దని అడ్డుపడుతున్నారన్నారు. తమకు ఓట్లు వేయని ప్రజలు ఉంటే ఏంది, పోతే ఏంది అనే రీతిలో బీఆర్ఎస్ నేతలు బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగరం విస్తరించినపుడు మెట్రోకూడా విస్తరించాలని ప్రయత్నిస్తోంటే.. ఇప్పుడు వద్దని అడ్డం పడుతున్నారని దుయ్యబట్టారు. ఐదేళ్లకోసారి ప్రభుత్వాలు మారినా.. ఉద్యోగులు మాత్రం శాశ్వతంగా ఉంటారన్నారు. ప్రభుత్వానికి ఉద్యోగులే వారదులు, సారథులుగా ఉంటారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ...మిగతా 2లో

## ఎక్సైజ్ శాఖలో భారీ బదిలీలు

**హైదరాబాద్,జూన్ 25(మనం,ప్రత్యేక ప్రతినిధి) :** రాష్ట్రంలోని ఎక్సైజ్ శాఖలో పని చేస్తున్న 68 మంది అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు, సూపరిండెంట్లుగా పనిచేస్తున్న అధికారులను బదిలీ చేస్తూ, మరికొందరికి కొత్తగా పోస్టింగులు ఇస్తూ ప్రభుత్వ కార్యదర్శి రఘునందన్ రావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మెదక్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న జే.హరికిషన్‌ను సైబరాబాద్ డీసీగా, నల్గొండ డిప్యూటీ కమిషనర్ ఏ.శ్రీనివాస్ రెడ్డిని గ్రేటర్ హైదరాబాద్ డీసీగా, రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ పీ.ధశరథను టీజీబీసీఎల్ డీసీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఖమ్మం డిప్యూటీ కమిషనర్ జీ.జనార్ధన్ రెడ్డిని ఆదిలాబాద్‌కు బదిలీ చేసింది.అలాగే హెచ్.దత్తురాజ్ గౌడ్‌ను టీజీబీసీఎల్ ఆర్ఆర్-1




నుంచి బదిలీ చేసి వరంగల్ డిప్యూటీ కమిషనర్గా ప్రభుత్వం నియమించింది. నిజామాబాద్ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న వీ.సోమిరెడ్డిని ఖమ్మం డిప్యూటీ కమిషనర్‌గా , టీజీబీసీఎల్ కరీంనగర్ మేనేజర్ జే.రవికుమార్‌ను కరీంనగర్ డిప్యూటీ కమిషనర్‌గా నియమించింది. లేబుల్ అసిస్టెంట్ కమిషనర్ పీ.శ్రీధర్‌ను నిజామాబాద్ డిప్యూటీ కమిషనర్‌గా హెడ్‌క్వార్టర్స్ డిప్యూటీ కమిషనర్‌గా పని చేస్తున్న కే.రఘురామును రంగారెడ్డి డీసీగా ప్రభుత్వం నియమించింది.అలాగే హైదరాబాద్ అసిస్టెంట్ కమిషనర్ ఏ.అనిల్ కుమార్ రెడ్డిని ఈస్ట్ జాయింట్ డెరెక్టర్‌గా , ఎస్టీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ పీ.ప్రణవీని మల్కాజిగిరి డిప్యూటీ కమిషనర్‌గా ముహబూబ్‌నగర్ అసిస్టెంట్ కమిషనర్ ఏ.విజయ్భాస్కర్ రెడ్డిని అదే జిల్లాకు డిప్యూటీ కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బ్రేవరీస్ అసిస్టెంట్ కమిషనర్ ఏ.చంద్రయ్యను మెదక్ డిప్యూటీ కమిషనర్.ఈస్ట్ జాయింట్ డైరెక్టర్ సీవీ శశిధర్ రెడ్డిని నల్గొండ డిప్యూటీ కమిషనర్‌గా నియమిస్తూ.. ప్రభుత్వ కార్యదర్శి రఘునందన్ రావు ఉత్తర్వులు జారీ చేశారు. వీరితో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ కేడర్ అధికారులు 19 మందిని, సూపరిండెంట్ కేడర్‌లో విధులు నిర్వర్తిస్తున్న 35 మంది ఆఫీసర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## తొమ్మిదో తరగతి పాఠ్యాంశంగా 'ఎమర్జెన్సీ'..

### స్వాగతించిన బీజేపీ

**ఢిల్లీ, జూన్ 25:** దేశంలో 1975లో విధించిన ఎమర్జెన్సీ పరిస్థితులను.. తొమ్మిదో తరగతి సాంఘిక శాస్త్రంలో పాఠంగా చేరుస్తూ ఎన్‌సీఈఆర్‌టీ తీసుకున్న నిర్ణయాన్ని భారతీయ జనతా పార్టీ స్వాగతించింది. భారత రాజ్యాంగంలో అదొక చీకటి అధ్యాయమని.. ఆ సమయంలో ప్రాథమిక హక్కులకు తీవ్ర ఆటంకం



కలిగిందని పేర్కొంది. దాని గురించి నేటి తరం విద్యార్థులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది.

ఎన్‌సీఈఆర్‌టీ కొత్తగా రూపొందించిన 9వ తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్య పుస్తకంలో జాతీయ ఎమర్జెన్సీని చేర్చారు. ఆ సమయంలో దేశం ఎదుర్కొన్న సవాళ్లను ప్రస్తావించారు. దీనిపై ప్రతిపక్ష పార్టీల నుంచి విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలోనే తాజాగా బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా స్పందిస్తూ.. కాంగ్రెస్ పార్టీపై మండిపడ్డారు. 1975 జూన్ 25 చీకటి రోజు అని.. అధికారాన్ని వినియోగించుకుని అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ ఎమర్జెన్సీకి తెరలేపారని విమర్శించారు. ఆ సమయంలో అన్ని రాజ్యాంగ సంస్థలు, మీడియాపై ఆంక్షలు విధించారని మండిపడ్డారు. ఆల్ ఇండియా రేడియో నుంచి కిశోర్ కుమార్ పాటలు కూడా తొలగించారని తెలిపారు. ఈ అధ్యాయాన్ని పాఠ్యాంశంగా చేర్చడం వల్ల అప్పట్లో జరిగిన విషయాలు విద్యార్థులు తెలుసుకుని.. భవిష్యత్తులో అలాంటివి పునరావృతం కాకుండా జాగ్రత్త పడతారని అన్నారు. ఇప్పటికీ కాంగ్రెస్ పార్టీ అదే 'ఎమర్జెన్సీ మైండ్సెట్'తో ఉందని ఎద్దేవా చేశారు.

## పాస్‌పోర్టు పౌరసత్వానికి ప్రూఫ్ కాదు

### కేంద్ర విదేశాంగ శాఖ ప్రకటన

**ఢిల్లీ, జూన్ 25:** పాస్‌పోర్ట్ అనేది పౌరసత్వాన్ని నిర్ధరించే పత్రం కాదని కేంద్ర విదేశాంగశాఖ చేసిన ప్రకటన తీవ్ర చర్చనీయాంశమైంది. దీనిపై ప్రతిపక్షాల



నుంచి విమర్శలు రావడంతో తాజాగా ఆ మంత్రిత్వ శాఖ స్పందిస్తూ వివరణ ఇచ్చింది. పాస్‌పోర్ట్‌ను ఎప్పుడూ పౌరసత్వానికి ప్రూఫ్‌గా చూడలేదని వివరణ ఇచ్చింది. గత 12 ఏళ్లలో అటువంటి నిర్ణయం ఏదీ తీసుకోలేదని వెల్లడించింది. పౌరులు కాని వారికి కూడా పాస్‌పోర్ట్‌ను జారీ చేసే వెసులుబాటు చట్టంలో ఉందని తెలిపింది. అది ఉందంటే పౌరసత్వాన్ని నిర్ధరించినట్టు కాదని 2013లో బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును గుర్తుచేసింది.

పాస్‌పోర్ట్ అనేది పౌరసత్వాన్ని నిర్ధరించే పత్రం కాదని 14వ 'పాస్‌పోర్ట్ సేవా దివస్' సందర్భంగా భారత విదేశీ వ్యవహారాల శాఖ వెల్లడించిన సంగతి తెలిసిందే. పాస్‌పోర్ట్‌లు ప్రధానంగా అంతర్జాతీయ ప్రయాణాలను సులభతరం చేయడానికి ప్రభుత్వం జారీ చేసే ప్రయాణ పత్రాలు మాత్రమే అని పేర్కొంది. భారతీయ పాస్‌పోర్ట్‌పై ఒక సూచన కూడా ఉంటుంది. దాని ప్రకారం, అవి భారత ప్రభుత్వ ఆస్తిగా పరిగణించబడతాయి. ప్రభుత్వం కోరినప్పుడు వాటిని తప్పనిసరిగా తిరిగి అప్పగించాల్సి ఉంటుంది.

## 'అంత్యోదయ'లో మార్పులు..

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చేలా పథకంలో మార్పు చేయబోతోంది. 35 కిలోల గరిష్ఠ పరిమితిని మాత్రం యథాతథంగా కొనసాగించాలనుకుంటోంది. ఈ మేరకు జాతీయ ఆహార భద్రత చట్టం, 2013ను సవరించాలని భావిస్తోంది. దీనిపై జులై 13 వరకు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనుంది.

ప్రస్తుతం అంత్యోదయ అన్న యోజన కింద పేదరికంలో ఉన్న కుటుంబాలకు కుటుంబసభ్యుల సంఖ్యతో సంబంధం లేకుండా 35 కిలోల చొప్పున ఆహార ధాన్యాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. అదే సాధారణ రేషన్‌కార్డుదారులకు నెలకు ఒక్కో వ్యక్తికి 5 కిలోల చొప్పున ఆహార ధాన్యాలు అందిస్తున్నారు. అయితే, కొత్త విధానంలో అంత్యోదయ కార్డు దారులు ఒకవేళ కుటుంబంలో ఇద్దరే ఉంటే వారికి 14 కిలోలు మాత్రమే లభిస్తాయి. ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది ఉన్నా 35 కిలోల వరకు ఆహారధాన్యాలు లభిస్తాయి. ప్రతి వ్యక్తికి జాతీయ ఆహార భద్రత చట్టం ప్రకారం తగిన పరిమాణంలో ఆహార ధాన్యాలు అందించడమే ఈ సవరణ ఉద్దేశమని కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

## శ్రీనివాసమంగాపురం ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

- భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాల కల్పనకు చర్యలు
- ఏఎస్ఐ అనుమతులతో అభివృద్ధి పనులు చేపడతాం
- టీటీడీ జేఈవో డాక్టర్ ఏ. శరత్

**చంద్రగిరి, జూన్ 25 మనం న్యూస్:** పంరాణ ప్రసిద్ధి గాంచిన శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు టీటీడీ ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఈ మేరకు టీటీడీ జేఈవో డాక్టర్ ఏ. శరత్ గురువారం ఆలయాన్ని సందర్శించి భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) అధికారులతో కలిసి ఆలయ పరిసరాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ, భారత పురావస్తు శాఖ ఆధీనంలోని ఈ ప్రాచీన ఆలయంలో చేపట్టే ప్రతి అభివృద్ధి పనికి ఏఎస్ఐ అనుమతి తప్పనిసరి అని తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా చేపట్టగల అభివృద్ధి కార్యక్రమాలను గుర్తించి, పురావస్తు శాఖ సూచనల మేరకు ప్రతిపాదనలు సమర్పించి అనుమతులు పొందనున్నట్లు వెల్లడించారు.

**భక్తుల సౌకర్యాలే లక్ష్యం**

తాగునీటి సౌకర్యాల మెరుగుదల, క్యూ లైన్ల అభివృద్ధి, మెట్ల మరమ్మతులు, యాగశాల నిర్మాణం అనంతరం పోటు నిర్మాణం వంటి పలు అభివృద్ధి పనులను గుర్తించినట్లు తెలిపారు. భక్తుల రాకపోకలకు మరింత సౌలభ్యం కల్పించేలా క్యూ లైన్లను సమతలీకరించి ఒకే విధమైన ఆకృతిలో తీర్చిదిద్దేందుకు ఏఎస్ఐ అధికారులు సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.

అదేవిధంగా కళ్యాణమండపం, ఆలయ ప్రాంగణంలోని ఇతర సౌకర్యాల అభివృద్ధికి సంబంధించి సమగ్ర నివేదిక సిద్ధం చేసి పురావస్తు శాఖతో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు.

అనుమతులు రాగానే వేగంగా పనులుఅభివృద్ధి పనులకు అవసరమైన అనుమతులు లభించిన వెంటనే వాటిని వేగంగా పూర్తి చేసి భక్తులకు మరింత మెరుగైన సేవలు అందిస్తామని జేఈవో తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్.ఈ. మనోహరం, సీపీఆర్వో డా. పి. రవి, అడిషనల్ హెల్త్ ఆఫీసర్ డా. సునీల్, ఏఈవో గోపినాథ్, ఇతర అధికారులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వెనెజువెలాలో భారీ భూకంపం


(మొదటి పేజీ తరువాయి)

ఈ 10 అంతస్తుల భవనం.. బీచ్‌వ్యూతో ఆహ్లాదకరంగా ఉండేది. ఇక్కడ పార్టీలు, సమావేశాలు ఎక్కువగా జరుగుతుంటాయి. తాజాగా సంభవించిన భూకంపం ధాటికి ఈ భవనం పేకమేడలా కూలిపోయింది. కేవలం హోటల్ బేస్మెంట్ మాత్రమే మిగిలి గుర్తుపట్టలేని విధంగా ధ్వంసమైంది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్గా మారింది. అయితే, భూకంపం సమయంలో ఈ హోటల్లో ఎంతమంది ఉన్నారు.. వారి పరిస్థితి ఏంటన్నది తెలియరాలేదు. వెనెజువెలా బేస్బాస్ స్టార్ ఆటగాళ్లకు చెందిన కుటుంబసభ్యులు ఈ హోటల్ శిథిలాల కింద చిక్కుకున్నట్లు సమాచారం.

డిజాస్టర్ జోన్‌గా..

కేవలం క్షణాల వ్యవధిలో సంభవించిన భారీ భూకంపాల ప్రభావంతో వెనెజువెలా రాజధాని కరాకస్తో పాటు పలు నగరాలు చిన్నాభిన్నమయ్యాయి. ఇందులో అత్యధికంగా ప్రభావితమైంది 'లా గువైరా'నే అని తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ వెల్లడించారు. దీన్ని 'డిజాస్టర్ జోన్'గా ప్రకటించారు. ఇక్కడ పరిస్థితి అత్యంత విషాదకరం అని ఆమె విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఇప్పటివరకు 30 సార్లు భూప్రకంపనలు సంభవించాయి.

164 మంది మృతి..



మరోవైపు, ఈ విపత్తు కారణంగా మరణించిన వారి సంఖ్య 164కు పెరిగింది. 971 మంది గాయపడినట్లు రోడ్రిగ్జ్ వెల్లడించారు. ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని, శిథిలాల కింద చిక్కుకున్నవారిని గుర్తించి ఆసుపత్రులకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక, విపత్తు వేళ వెనెజువెలాకు సాయం అందించేందుకు పలు దేశాలు ముందుకొస్తున్నాయి. జర్మనీ సైనిక రవాణా విమానాలను పంపిస్తామని చెప్పింది. ఎమర్జెన్సీ సాయం చేస్తామని స్పెయిన్ తెలిపింది. వెనెజువెలాలో సంభవించిన వరుస భూకంపాలతో భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు 168 మంది ప్రాణాలు కోల్పోగా.. 700 మంది వరకు గాయపడ్డారని తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ వెల్లడించారు. రాజధాని నగరం కరాకస్, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో భూకంప తీవ్రత ధాటికి భవనాలు కూలిపోవడంతో.. శిథిలాల కింద అనేక మంది చిక్కుకున్నారు. దాంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు.

వెనెజువెలా ప్రకృతి విలయంపై ప్రధాని నరేంద్ర మోడీ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో ఆ దేశానికి అండగా ఉంటామని ఎక్స్ వేదికగా వెల్లడించారు.

వెనెజువెలా ప్రజలకు సహాయం చేయడానికి అమెరికా సిద్ధంగా ఉందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ట్రూత్లో పోస్టు పెట్టారు. ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేలా సంసిద్ధంగా ఉండాలని అన్ని ఏజెన్సీలను ఆదేశించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వెనెజువెలా ప్రజలను గొప్ప స్నేహితులుగా అభివర్ణించారు. ఇప్పటికే సహాయక బృందాలను మోహరించామని అమెరికా విదేశాంగమంత్రి మార్కో రూబియో వెల్లడించారు.

## వెనెజువెలాలో విలయం.. కారణాలేంటి?



**కారకస్, జూన్ 25:** తీవ్ర భూకంపంతో వెనెజువెలా చిగురుటాకులా వణికిపోయింది. బహుళ అంతస్తుల భవనాలు నేలమట్టమయ్యాయి. మృతుల సంఖ్య 10వేల నుంచి లక్ష వరకు ఉండొచ్చని యూఎస్ జియోలాజికల్ సర్వే అంచనా వేస్తోంది. వెనెజువెలా భూకంపాలకు గురవ్వడం ఇదే తొలిసారి కాదు. గతంలోనూ ఇక్కడ భారీ భూకంపాలు సంభవించాయి. అయితే, ఇంత తీవ్ర స్థాయిలో భూ ప్రకంపనలు చోటుచేసుకోవడం శతాబ్దకాలంలో ఇదే తొలిసారని పరిశోధకులు చెబుతున్నారు. ఇంతకీ ఆ దేశంలో తరచూ భూకంపాలు ఎందుకు చోటుచేసుకుంటున్నాయి?

**ప్రమాదకరం.. భౌగోళిక స్వరూపం**

వెనెజువెలాలో తరచూ సంభవించే భూకంపాలకు కారణాలు తెలియాలంటే.. ముందుగా దాని భౌగోళిక స్వరూపం అర్థం కావాలి. ఈ దేశం దక్షిణ అమెరికా ఖండానికి ఉత్తర తీరంలో ఉంటుంది. ప్రధాన భూభాగమంతా దక్షిణ అమెరికా ప్లేట్ (ఫలకం)పైనే ఉన్నప్పటికీ.. ఉత్తర భాగం మాత్రం కరేబియన్ దీవులకు దగ్గరగా ఉంటుంది. ఈ దీవులన్నీ కరేబియన్ ప్లేట్ (ఫలకం)పై ఉన్నాయి. అవి ప్రస్తుతం చురుగ్గా కదులుతున్నాయి. ఏడాదికి కనీసం 20 మి.మీ మేర దక్షిణ అమెరికా ఫలకం వైపు దూసుకొస్తున్నాయి. ఫలితంగా ఆ రెండు ప్లేట్స్ మధ్య తీవ్ర ఘర్షణ ఏర్పడి భూకంపాలకు దారి తీస్తోంది. అంతేకాకుండా దాదాపు 80 శాతం మంది వెనెజువెలా ప్రజలు భూకంపం సంభావ్యత ఎక్కువగా ఉన్న జోన్లలోనే నివసిస్తున్నారు. దీంతో ప్రాణనష్టం ఎక్కువగా జరుగుతోంది.

**భూకంప కేంద్రమే.. నష్టానికి కారణం**

వెనెజువెలాలో భూ ప్రకంపనల తీవ్రత అధికంగా ఉండటానికి మరో కారణం భూకంప కేంద్రాలు. భూ ఫలకాల కదలిక ప్రక్రియ నిరంతరం జరుగుతూనే ఉంటుంది. ఈ క్రమంలో ఎక్కడో ఒకచోట చిన్నపాటి భూకంపాలు వస్తునే ఉంటాయి. భూకంప కేంద్రం లోతు ఎక్కువగా ఉంటే.. ఉపరితలంపై దాని ప్రభావం తక్కువగా ఉంటుంది. లోతు తగ్గుతున్న కొద్దీ.. తీవ్రత పెరుగుతూ ఉంటుంది. అయితే, వెనెజువెలాలో మాత్రం భూకంప కేంద్రాలు ఎక్కువగా 15 నుంచి 20 కి.మీ లోతులోనే నమోదవుతున్నాయి. దీంతో ప్రకంపనల తీవ్రత అధికంగా ఉండి.. భారీగా నష్టం వాటిల్లుతోంది.

**భూకంపాలకు కారణమేంటి?**

భూకంపాలు సంభవించి.. భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించిన ప్రతిసారీ 'టెక్టోనిక్ ప్లేట్స్' అనే పదం వినిపిస్తుంది. ఇంతకీ ఏంటీ టెక్టోనిక్ ప్లేట్స్ అంటే.. భూ గ్రహం వాస్తవానికి భారీ రాతి ఫలకాలుగా విడిపోయి ఉంది. వాటినే టెక్టోనిక్ ప్లేట్స్ అంటారు. ఇవి చిన్నా పెద్దా కలిసి 15 వరకు ఉన్నాయి. ఇవి.. భూమి అడుగున ఉండే మాంటిల్ అనే ద్రవరూప పొరపై తేలుతూ ఉంటాయి. ఇవి స్థిరంగా ఒక చోట ఉండవు.. నిరంతరం కదులుతూ.. ఒకదాన్నొకటి ఢీ కొట్టుకుంటాయి. అయితే, ఇవి కదులుతున్నాయన్న సంగతిని సాధారణంగా మనం గుర్తించలేం. కానీ, వీటి కదలికలు నెమ్మదిగా సాగినప్పటికీ.. చాలా ప్రభావవంతమైనవి. కొన్ని లక్షల సంవత్సరాలుగా ఈ ప్రకియ సాగుతూనే ఉంది. ఈ క్రమంలోనే కీలక భౌగోళిక మార్పులు చోటు చేసుకున్నాయి. పర్వతాలు ఏర్పడటానికి కూడా ఈ కదలికలే కారణమని శాస్త్రవేత్తలు తేల్చారు.

## 3తరాల సమస్యలకు 33గేట్ల పునరుద్ధరణ



(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయించుకున్నామన్నారు. తుంగభద్ర డ్యామ్ నది ఒడ్డున శాశ్వతంగా సమస్యకు పరిష్కారం చూపించాలన్న ఆలోచన, పట్టుదలతో ఇక్కడికి వచ్చాం. మా చర్చలు ఓ కొలిక్కి వచ్చాయని, కచ్చితంగా కేంద్ర ప్రభుత్వం, సీఆర్ పాటిల్ ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తారని సంపూర్ణంగా విశ్వసిస్తున్నామన్నారు. కృష్ణ, తుంగభద్ర, గోదావరి నది జలాల్లో అంతర్రాష్ట్ర జల వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నామని సీఎం అన్నారు. రాజోలిబండకు కేటాయించిన 15 టీఎంసీల్లో తెలంగాణ నాలుగైదు టీఎంసీలే వాడుకుంటోందని రాజోలిబండ సమస్యను సీఆర్ పాటిల్, చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. మనందరి కష్టాలు, సమస్యలు తెలిసిన నాయకుడు ఏపీ సీఎం చంద్రబాబని, దేశంలో సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన నేత అని కొనియాడారు.

కర్ణాటకలోని హొస్పేటలో తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్ల ప్రారంభ కార్యక్రమంలో సీఎం డీకే శివకుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ నాయకత్వంలో ముగ్గురు సీఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి, తాను చరిత్ర సృష్టించామన్నారు. తాము చరిత్ర చదవమని, చరిత్ర లిఖించము అని కానీ చరిత్ర సృష్టిస్తామని చెప్పారు. దక్షిణ భారతదేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భాగమైనందుకు తనకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. జత కూడటం ఆరంభం అని, కలిసి నిర్ణయం తీసుకోవడం ప్రగతి అని, కలిసి పనిచేస్తే విజయం సాధిస్తామని అన్నారు. ఇప్పుడు మూడు రాష్ట్రాల రైతుల కోసం కలిసి చారిత్రక నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. మా నీళ్లు.. మా హక్కు అనే నినాదాన్ని నిజం చేశామని చెప్పారు. 1860లో తుంగభద్ర నదిపై ప్రాజెక్టును కట్టారని అన్నారు. ఆ రోజు ప్రాజెక్టును కడితే ఈరోజు రక్షించామని అన్నారు. కృష్ణా, కావేరి, గోదావరి విషయంలోనూ మనందరం ఏకమై రైతులను బతికించాలని కోరారు. తుంగభద్ర ప్రాజెక్టు గేట్ల ప్రారంభోత్సవానికి ముందు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడు, కర్ణాటక సీఎం డీకే శివకుమార్ హొస్పేట్‌లోని ఐఆర్‌బీ అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ భేటీలో కేంద్రమంత్రి సీఆర్ పాటిల్, తెలంగాణ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఏపీ మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు.

## అవును నేను గుంపు మేస్త్రీనే



(మొదటి పేజీ తరువాయి)

వచ్చాక 70 వేల ఉద్యోగులు ఇచ్చామని గుర్తుచేశారు. గంగా, కావేరి, కృష్ణ వంటి నదుల పేర్లను ఆడబిడ్డలకు పెడుతున్నారని, మూసీనది పేరు ఎందుకు పెట్టడంలేదో ఎప్పుడైనా ఆలోచించారా? అని సీఎం ప్రశ్నించారు. మూసీ అంటేనే కాలుష్యానికి మారు పేరుగా మారిందని, దానిని ప్రక్షాళన చేసేందుకు కాలికి కట్టె కట్టుకుని తిరుగుతుంటే ప్రతిపక్షాలు అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. ఉద్యోగులకు ప్రమాద బీమాను మొదట సింగరేణిలో ప్రారంభించామని, సింగరేణిలో చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఇప్పటికే రూ.కోటి చొప్పున చెక్కులు అందజేశామని సీఎం గుర్తు చేశారు. పోయిన ప్రాణాన్ని తెచ్చివ్వలేము కానీ ఆర్థికంగా ఆదుకుని బాసటగా నిలవాలని తెలిపారు. సంస్థ లేదా ప్రభుత్వం కోసం కష్టపడిన వారికి అండగా ఉండాల్సిన బాధ్యత యజమానిపై ఉందని స్పష్టం చేశారు. సింగరేణిలాగే రాష్ట్రంలో ప్రతి ఉద్యోగికి రూ.కోటి బీమా సదుపాయం కల్పించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కని కోరానని పేర్కొన్నారు. ఐదేళ్లకోసారి పాలకులు మారినా ప్రభుత్వ ఉద్యోగులు మారరన్నారు. గతంలో పదేళ్లపాటు ఉద్యోగులకు 10 తారీఖులోపు జీతం వచ్చేది కాదని, గత ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలను కూడా వాయిదాలుగా ఇచ్చిందని ఆరోపించారు. ప్రభుత్వం, ప్రజల కోసం కష్టపడేవారికి సకాలంలో జీతాలు ఇవ్వాలని నిర్ణయించుకున్నామని, ఆర్థికంగా ఎన్ని ఒడుదొడుకులు ఉన్నా ఫస్టు తారీఖున జీతాలు ఇస్తున్నామని తెలిపారు. తాము అధికారంలోకి రాగానే నెలకు రూ.వెయ్యి కోట్ల చొప్పున బెనిఫిట్స్ చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని వెల్లడించారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు ఉద్యోగులు నడుం బిగించాలని సీఎం పిలుపునిచ్చారు. ఉద్యోగులంతా రోజుకు ఒక గంట అదనంగా పని చేయాలని ఆయన కోరారు. రాష్ట్రంలో కొందరు పన్నులు కట్టకుండా తప్పించుకుంటున్నారని, అలాంటి వారిని గుర్తించి పట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ట్యాక్స్ బకాయిలను కఠినంగా వసూలు చేయడం ద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని గణనీయంగా పెంపొందించాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు.గత ప్రభుత్వ తీరుపై ముఖ్యమంత్రి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత పాలకులు అత్యధిక వడ్డీలకు అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి, గతంలో 11 శాతంగా ఉన్న వడ్డీ రేట్లను 7.5 శాతానికి తగ్గించగలిగామని వివరించారు. దేశంలోనే మరే రాష్ట్రంలోనూ లేని విధంగా ఈ తరహా బీమాను ప్రవేశపెట్టి ప్రభుత్వం రికార్డు సృష్టించిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గత ప్రభుత్వ తీరుపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. గత సర్కార్ హయాంలో ఉద్యోగులకు సకాలంలో జీతాలు రాక ఎంతగానో ఇబ్బంది పడ్డారన్నారు. గత ప్రభుత్వం అడ్డగోలుగా చేసిన అప్పులను కడుతూనే.. మేము అధికారంలోకి రాగానే ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ప్రతి నెల 1వ తేదీనే ఉద్యోగుల ఖాతాల్లో జీతాలు పడేలా చేశాం అని స్పష్టం చేశారు.ఈ పథకం కేవలం రెగ్యులర్ ఉద్యోగులకే కాదు.. కాంట్రాక్ట్ ఉద్యోగులకు కూడా వర్తిస్తుందని ప్రభుత్వం ప్రకటించడం విశేషం. ప్రతి ఉద్యోగి కుటుంబానికి ఈ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ రాష్ట్రంలో పుట్టడమే ఒక అదృష్టం అనే భావన కలిగేలా మా పాలన సాగుతుందన్నారు.కేవలం ప్రభుత్వ ఉద్యోగులకే కాకుండా.. రాష్ట్రంలోని కోటి 15 లక్షల కుటుంబాలకు ఇందిరమ్మ బీమా' కల్పిస్తున్నామని.. త్వరలోనే ప్రతి కుటుంబానికి డిజిటల్ హెల్త్ కార్డ్ అందించి ఉచిత వైద్య సదుపాయం కల్పిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు.

## విద్యార్థుల హక్కుల కోసం పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

పేపర్ లీక్ వల్ల 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకమైందని, తల్లిదండ్రుల కష్టాన్ని, విద్యార్థుల శ్రమను పేపర్ లీకులు వమ్ము చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థపై విద్యార్థులు, తల్లిదండ్రుల నమ్మకం దెబ్బతింటోందని, విద్యార్థుల హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందన్నారు. యువత భవిష్యత్తుతో చెలగాటమాడే వారిని కఠినంగా శిక్షించాలని, పరీక్షల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం అవసరమని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు కాపాడటం ప్రభుత్వాల ప్రధాన బాధ్యత అని, దేశ యువత ఆకాంక్షలను కేంద్ర ప్రభుత్వం గౌరవించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ఆదివాసీ సెల్ చైర్మన్, విక్రాంత్ భురియా, ప్రభుత్వ విప్ బల్మూర్ వెంకట్ లు పాల్గొన్నారు.

## వైభవంగా ప్రారంభమైన శ్రీ పద్మావతి అమ్మవారి తెప్పోత్సవాలు

- పద్మసరోవరంలో శ్రీ కృష్ణస్వామివారి దివ్య తెప్ప విహారం
- భక్తి పారవశ్యంలో తిలకించిన వేలాది మంది భక్తులు

**తిరుపతి జూన్ 25 మనం న్యూస్:** తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ వార్షిక తెప్పోత్సవాలు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ కృష్ణస్వామివారు పద్మసరోవరంలోని సుందరంగా అలంకరించిన తెప్పపై మూడు ప్రదక్షిణలు చేస్తూ భక్తులకు దివ్య మంగళ దర్శనం ప్రసాదించారు.వేడుకగా శ్రీ కృష్ణస్వామివారికి అభిషేకం



ఉదయం సుప్రభాతంతో ప్రారంభమైన నిత్యకైంకర్యాల అనంతరం మధ్యాహ్నం శ్రీ కృష్ణస్వామివారి ముఖ మండపంలో స్వామివారికి విశేష అభిషేకం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, సుగంధ ద్రవ్యాలతో నిర్వహించిన ఈ పవిత్ర అభిషేకం భక్తులను ఆధ్యాత్మికానందంలో ముంచెత్తింది.పద్మసరోవరంలో దివ్య తెప్ప విహారంసాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ పద్మపుష్కరిణి వద్దకు వేంచేపు చేశారు. అనంతరం సాయంత్రం 6.30 నుండి రాత్రి 7.15 గంటల వరకు జరిగిన తెప్పోత్సవం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. పద్మసరోవరంలో విద్యుద్దీపాల వెలుగుల్లో సాగిన ఈ దివ్య విహారం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.తెప్పోత్సవం అనంతరం శ్రీ కృష్ణస్వామివారు ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగి భక్తులను కరుణాకటాక్షాలతో అనుగ్రహించారు.

**ఆకట్టుకున్న భక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు**

తెప్పోత్సవాలలో భాగంగా ఆలయ నాలుగు మాడవీధుల్లో నిర్వహించిన భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గోవింద నామస్మరణలతో పాటు సాగిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉత్సవాలకు మరింత శోభను చేకూర్చాయి.ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈవో డా. ఎ. శరత్, ఆలయ డిప్యూటీ ఈవో హరింద్రనాథ్, సూపరింటెండెంట్లు సురేష్, రమేష్, టెంపుల్ ఇన్స్పెక్టర్ చలపతి, ఇతర అధికారులు, అర్చకులు, శ్రీవారి సేవకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# డీజీపీని కలిసిన ఏఐసీసీ జాతీయ కోఆర్డినేట్

## ప్రజా భద్రత, డ్రగ్స్ నియంత్రణపై చర్చ




హైదరాబాద్, జూన్ 25(మనం,ప్రత్యేక ప్రతినిధి): ఏఐసీసీ జాతీయ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.వి.రవి శేఖర్ రెడ్డి గురువారం రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.వీరిద్దరి మధ్య జరిగిన భేటీలో రాష్ట్రం లోని శాంతి భద్రతల పరిస్థితులు, ప్రజా భద్రత, మాదక ద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాల నివారణ, ఫ్రెండ్లీ పోలీసింగ్ తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా డీజీపీ ఇకపై నో ఫ్రెండ్లీ పోలీసింగ్ అని, అయితే ప్రజలను గౌరవిస్తామన్నారు. రౌడీలు,గూండాలతో పాటు అసాంఘిక శక్తుల విషయంలో కఠినంగా వ్యవహరించడం సముచిత నిర్ణయమని డీజీపీ నిర్ణయాలను డాక్టర్ రవి శేఖర్ రెడ్డి ప్రశంసించారు.రాష్ట్రం లో డ్రగ్స్ నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖ చేపడుతున్న పారదర్శక చర్యలను ఆయన అభినందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో యువతను మాదక ద్రవ్యాల బారిన బారిన పడకుండా కాపాడేందుకు పోలీసులు ప్రత్యేక దృష్టి సారించడం అభినందనీయమన్నారు.ముఖ్యంగా విద్యా సంస్థలు, పట్టణ ప్రాంతాలలో పాటు గ్రామీణ ప్రాంతాలలో గంజాయిని అరికట్టేందుకు ఈగల్ ఫోర్స్ ద్వారా చేపడుతున్న చర్యలు శుభ పరిణామమన్నారు. మహిళల భద్రత, బాలికల రక్షణ,సైబర్ మోసాల నివారణ, రోడ్డు భద్రత, యువతలో అవగాహన కార్యక్రమాలు నిర్వహణ వంటి అంశాలపై చర్చించారు. రాష్ట్ర అభివృద్ధికి శాంతి భద్రతలు పునాది అని, ప్రజలు,పోలీసుల మధ్య పరస్పర విశ్వాసం మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని డాక్టర్ రవి శేఖర్ రెడ్డి ఆకాంక్షించారు.

# శామీర్‌పేట్ తహశీల్దార్ కేసులో ట్విస్ట్

## మరోసారి ఏసీబీ తనిఖీలు

## రూ. 50 కోట్ల స్థిరచరాస్థులు స్వాధీనం



హైదరాబాద్,జూన్ 25(మనం,ప్రత్యేక ప్రతినిధి): ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో శామీర్‌పేట తహశీల్దార్ సుచరిత నివాసంలో ఏసీబీ అధికారులు గురువారం మరోసారి సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో కళ్లు చెదిరే రీతిలో అక్రమ ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ గుర్తించింది. స్థానిక రైతులకు చెందిన 30 ఎకరాలను వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు సుచరిత రూ.30 లక్షలు డిమాండ్ చేయడంతో బాధితులు ఏసీబీని ఆశ్రయించారు. దీంతో రంగంలోకి దిగిన అవినీతి నిరోధకశాఖ అధికారులు డిమాండ్ చేసిన డబ్బులలో తొలి విడతగా రూ. 2 లక్షల సొమ్మును ప్రైవేట్ డ్రైవర్ ద్వారా తీసుకుంటూ గత నెల 26న పట్టుబడిన విషయం విదితమే. దీంతో కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఏసీబీ అధికారులు తాజాగా ఆమె అక్రమాస్తులపై తనిఖీలు చేపట్టారు.

**భారీగా ఆస్తులు :**

ఆదాయానికి మించి ఆస్తుల కేసులో నిందితురాలు సుచరిత నివాసంలో ఏసీబీ అధికారులు తనికీలు జరిపి భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు గుర్తించారు. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం దామరకుంట గ్రామంలో 2 ఎకరాల 17 గుంటల వ్యవసాయ భూమి, హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాలలో 3 ఫ్లాట్లు. కీసర, ఖానామెట్ గ్రామాలలో 2 ఓపెన్ ప్లాట్లు. రూ. 12 లక్షల నెట్ క్యాష్, బ్యాంకు ఖాతాలలో రూ. 38 లక్షల బ్యాలెన్స్ ఉన్నట్లు గుర్తించారు. అలాగే దాదాపు రూ. 1.20 కోట్ల విలువైన బంగారు, వజ్రాభరణాలు ఒక వోక్స్‌వ్యాగన్ కారు, ఒక హ్యుందాయ్ క్రెటా కారు ఉన్నట్లు గుర్తించారు. వీటికి సంబంధించిన కీలక పత్రాలు సైతం స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ వెల్లడించింది. డాక్యుమెంట్ల ప్రకారం ఏసీబీ అధికారులు గుర్తించిన మొత్తం ఆస్తుల విలువ రూ. 5.5 కోట్లకు పైనే ఉంటుందని మార్కెట్ విలువ ప్రకారం వీటి ధర దాదాపు రూ. 50 కోట్ల మేరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. కాగా నిందితురాలు సుచరిత సంబంధించిన మరికొన్ని ఆస్తుల వెరిఫికేషన్ కొనసాగుతున్నట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు.

# వైభవంగా ప్రారంభమైన శ్రీ పద్మావతి అమ్మవారి తెప్పోత్సవాలు



**తిరుపతి జూన్ 25 మనం న్యూస్:** తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ వార్షిక తెప్పోత్సవాలు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ కృష్ణస్వామివారు పద్మసరోవరంలోని సుందరంగా అలంకరించిన తెప్పపై మూడు ప్రదక్షిణలు చేస్తూ భక్తులకు దివ్య మంగళ దర్శనం ప్రసాదించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, సుగంధ ద్రవ్యాలతో నిర్వహించిన ఈ పవిత్ర అభిషేకం భక్తులను ఆధ్యాత్మికానందం లో ముంచెత్తింది. పద్మసరోవరంలో దివ్య తెప్ప విహారంసాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ పద్మపుష్కరిణి వద్దకు వేంచేపు చేశారు. అనంతరం సాయంత్రం 6.30 నుండి రాత్రి 7.15 గంటల వరకు జరిగిన తెప్పోత్సవం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆకట్టుకున్న భక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు తెప్పోత్సవాలలో భాగంగా ఆలయ నాలుగు మాడవీధుల్లో నిర్వహించిన భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గోవింద నామస్మరణలతో పాటు సాగిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉత్సవాలకు మరింత శోభను చేకూర్చాయి.ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈవో డా. ఎ. శరత్, ఆలయ డిప్యూటీ ఈవో హరింద్రనాథ్, సూపరింటెండెంట్లు సురేష్, రమేష్, టెంపుల్ ఇన్స్పెక్టర్ చలపతి, ఇతర అధికారులు, అర్చకులు, శ్రీవారి సేవకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసు విచారణ

## వచ్చే నెల 22కు విచారణ వాయిదా

హైదరాబాద్,జూన్ 25(మనం,ప్రత్యేక ప్రతినిధి): పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్‌ఎస్‌కు చెందిన 10 మంది ఎమ్మెల్యేల వ్యవహారంపై హైకోర్టులో గురువారం విచారణ జరిగింది. గతంలో ఈ ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ పలువురు ఎమ్మెల్యేలు దాఖలు చేసిన పిటిషన్లను కోర్టు పరిశీలించింది. విచారణ సందర్భంగా అనర్హత పిటిషన్లపై స్పీకర్ ఇచ్చిన తీర్పు కాపీలను కోర్టుకు సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. ఇదవరలో జారీ చేసిన నోటీసులకు సంబంధించి ఇప్పటివరకు కౌంటర్ దాఖలు చేయకపోవడంపై కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది.కాగా బీఆర్‌ఎస్ నుంచి ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ గడ్డం ప్రసాద్ గతంలో తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ.. పలువురు ఎమ్మెల్యేలు పిటిషన్‌లు దాఖలు చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై స్పీకర్ చర్యలు తీసుకోలేదని, తాము సరైన ఆధారాలను సమర్పించినా వారిపై చర్యలు తీసుకోవడంలో స్పీకర్ విఫలమయ్యారని పేర్కొంటూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పిటిషన్‌లు వేశారు. అలాగే ఎమ్మెల్యే దానం నాగేందర్ పై అనర్హత వేటు వేయాలంటూ ఏలేటి మహేశ్వర్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. అన్ని పిటిషన్లపై విచారణ చేసిన సీజే ధర్మాసనం ప్రతివాదులైన దానం నాగేందర్, బండ్ల కృష్ణమోహన్ లు కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను జులై 22కు వాయిదా వేసింది.

**ఇది..జరిగింది :**

2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో భారత్ రాష్ట్ర సమితి గుర్తుపై పోటీ చేసి గెలిచిన కొంతమంది ఎమ్మెల్యేలు తదనంతరం అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. మొత్తం 10 మంది ఎమ్మెల్యేలు ఇలా పార్టీ మారినట్లు ఆరోపించింది. ఈ వివాదంలో గతంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీసుకున్న నిర్ణయమే ఇప్పుడు ప్రధాన న్యాయపోరాటానికి దారితీసింది. స్పీకర్ ట్రైబ్యునల్ పరిధిలో జరిగిన విచారణలో.. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు సాంకేతికంగా పార్టీ మారలేదని, అందుకు సరైన ఆధారాలు లేవని పేర్కొంటూ స్పీకర్ వారిపై దాఖలైన అనర్హత పిటిషన్లను కొట్టివేశారు. స్పీకర్ ఇచ్చిన ఈ 'క్లీన్ చిట్' లేదా నిర్ణయాన్ని సవాల్ చేస్తూనే ఆఖిల మరియు ఇతర నేతలు మళ్లీ హైకోర్టు మెట్లెక్కారు. తాము సమర్పించిన ఆధారాలను స్పీకర్ పరిగణనలోకి తీసుకోలేదని పిటిషనర్లు వాదిస్తున్నారు.

## తండ్రి స్కెచ్.. కొడుకు చోరీ

# ఏటీఎం డబ్బుతో పరారీ కేసులో పురోగతి




హైదరాబాద్,జూన్ 25(మనం,ప్రత్యేక ప్రతినిధి): హైదరాబాద్ నగరంలోని పాతబస్తీలో ఏటీఎం సొమ్ము చోరీ కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ఈ ఘటన ఏటీఎం వ్యాన్ డ్రైవర్, అతని కుమారుడు కలిసి రూ. 17 లక్షల నగదు కాజేసినట్లు కీలక విషయం వెలుగులోకి వచ్చింది.

వ్యాన్ డ్రైవర్ శ్రీనివాస్ పక్కా ప్రణాళిక మేరకు తన కుమారుడితో కలిసి చోరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. గత మూడు రోజుల కిందట ఐఎస్ సదన్ పీఎస్ పరిధిలో ఈ చోరీ జరిగిన విషయం తెలిసిందే. ముందస్తు ప్రణాళికతోనే రూ.17లక్షల నగదు చోరీ చేసి తండ్రీకొడుకులు బైక్‌పై పరారైనట్లు సీసీ ఫుటేజ్ ఆధారాలను పోలీసులు సేకరించారు. చోరీ సొమ్ములో నిందితుడు శ్రీనివాస్ నగరంలోని ఉప్పుగూడలోని మరో కుమారుడికి కొంత నగదు అందించినట్లు గుర్తించారు.

**అప్పులు బాధతో :**

ఈ కేసులో కీలక నిందితుడు శ్రీనివాస్ అప్పుల బాధతో చోరీకి పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది.కొద్దినెలల క్రితమే ఏటీఎంలలో నగదు అమర్చే ఏజెన్సీ సంస్థలో శ్రీనివాస్ డ్రైవర్‌గా చేరాడు. కాగా నిందితుడు శ్రీనివాస్‌ను జగిత్యాల సమీపంలో అత్తగారి ఇంటి వద్ద పోలీసులు అదుపు లోకి తీసుకున్నట్లు సమాచారం. శ్రీనివాస్‌తో పాటు ఇద్దరు కుమారులనూ పోలీసులు అదుపులోకి తీసు కుని నగదు చోరీ, కుట్రపై దర్యాప్తు కొనసాగుతోంది.

**ఇది..జరిగింది :**

నగరంలోని ఐఎస్ సదన్ పరిధిలో డబ్బు అమర్చే ప్రైవేటు ఏజెన్సీ ఉద్యోగి కలీం పర్యవేక్షణలో రూ.30లక్షల నగదున్న బ్యాగులతో 3 ఏటీఎంలలో డబ్బును అమర్చారు. ఈది బజార్ వికాస్ పాఠశాల ఎదురుగా ఏటీఎంలో అమర్చేందుకు ఏజెన్సీ సిబ్బంది ఏటీఎం గదిలోకి వెళ్లారు. వాహనంలో డ్రైవర్ శ్రీనివాస్ మాత్రమే ఉన్నాడు. దీంతో అతడు రూ.17 లక్షలున్న బ్యాగ్ను తీసుకుని బైక్‌పై పరారు కావడంతో కలీం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దీంతో రంగంలోకి దిగిన పోలీసులు నిఘా కెమెరాల్లో దృశ్యాలు, నిందితుడి కాల్ లిస్టు పరిశీలించడంతో పాటు వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో డ్రైవర్ శ్రీనివాస్ తన కుమారుడితో కలిసి బైక్‌పై పరారైనట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నారు.

# 27న భద్రాచలం దేవస్థానం అభివృద్ధి పనులకు శ్రీకారం

- ఆగమశాస్త్ర ప్రకారం ఆలయ అభివృద్ధి పనులు
- యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి
- అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం



హైదరాబాద్, జూన్ 25: తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, దక్షిణ అయోధ్యగా ఖ్యాతి గాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం అభివృద్ధి పనులకు ఈ నెల 27వ తేదీన శ్రీకారం చుడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు.

గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, భద్రాచలం ఆలయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ, భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఆగమశాస్త్ర నియమాలను కచ్చితంగా పాటిస్తూ ఆలయ అభివృద్ధి పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. భద్రాచలం ఆలయ వైభవం, ఆధ్యాత్మికతకు ఎటువంటి భంగం కలగకుండా, సంప్రదాయ శిల్పకళను ప్రతిబింబించేలా రాతి నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. రాబోయే రెండు వందల సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్ తరాలకు కూడా ఆదర్శంగా నిలిచే విధంగా ఆలయాన్ని అభివృద్ధి చేయాలని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు సంకల్పించారని ఈ మేరకు ఈ నెల 27వ తేదీన ఆలయ పునరుద్ధరణ పనులను అధికారికంగా ప్రారంభించాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోనే పనులు పూర్తయ్యేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. ఈ ఆలయ పునరుద్ధరణ పనులకు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు 351 కోట్ల రూపాయలను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. వచ్చే శ్రీరామ నవమి నాటికి నిర్దేశించిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడానికి ముందస్తుగానే పనుల విభజన చేసుకొని సమతరంగా అన్ని పనులు చేపట్టాలని సూచించారు.

# బీసీ గురుకులాల బలోపేతానికి సంస్కరణలు

- బీసీ గురుకులాల ద్వారా ఐఐటీ,ఐఐఐటీ ,ఎన్ఐటీ లకు ఎంపికైన విద్యార్థులకు ల్యాప్టాప్లు
- ఎంజేపీ కి చెందిన వ్యవసాయ కళాశాలలో ఎంజేపి విద్యార్థులకు మాత్రమే అవకాశం
- బీసీ గురుకులాల బలోపేతానికి పలు సంస్కరణలకు ఆమోదం తెలుపుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ఎంజేపీ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సమావేశంలో కీలక తీర్మానాలు



హైదరాబాద్, జూన్ 25: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ గారి అధ్యక్షతన సచివాలయంలో మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సొసైటీ (ఇఖ్ఖీఆఇగిఖఐఖి) 6వ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సమావేశం గురువారం నిర్వహించబడింది. విద్యార్థుల సంక్షేమం, విద్యా ప్రమాణాల మెరుగుదల, మౌలిక వసతుల అభివృద్ధి, పరిపాలనా బలోపేతానికి సంబంధించిన పలు కీలక అంశాలపై సమావేశంలో చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు.

సమావేశంలో పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, ప్రాంతీయ సమన్వయ కార్యాలయాల (ఖఇ) వివిధ విభాగాలకు బడ్జెట్ పరిమితులను బోర్డు ఆమోదించింది. ఎంజేపీ బీసీ గురుకుల విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు మరణించిన సందర్భాల్లో వారి తల్లిదండ్రులకు రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయడానికి బోర్డు ఆమోదం తెలిపింది. ప్రిన్సిపాల్ (పాఠశాల) నియామకాలకు సంబంధించి ప్రస్తుతం అమలులో ఉన్న 70 శాతం పదోన్నతులు, 30 శాతం ప్రత్యక్ష నియామకాల విధానాన్ని యథాతథంగా కొనసాగించాలని నిర్ణయించింది. వ్యవసాయ కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించి కేవలం ఎంజేపీ గురుకుల విద్యాసంస్థల విద్యార్థులకు మాత్రమే అవకాశం కల్పించే ప్రతిపాదనకు బోర్డు ఆమోదం తెలిపింది. విద్యా పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు పదవీ విరమణ చేసిన ప్రిన్సిపాళ్ల సేవలను అకడమిక్ కన్సల్టెంట్లుగా వినియోగించుకునే అంశంపై నియామక నిబంధనలను రూపొందించేందుకు కమిటీ ఏర్పాటు చేసి తదనుగుణంగా చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. ఐఐటీలు, ఐఐఐటీలు, ఎన్ఐటీలు వంటి జాతీయ స్థాయి విద్యాసంస్థల్లో ప్రవేశాలు సాధించిన విద్యార్థులకు ల్యాప్టాప్లు అందించాలని బోర్డు నిర్ణయించింది.

ఇతర విద్యాసంస్థల సంఘాల తరహాలోనే సంస్థ పేరును తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ విద్యాసంస్థల సొసైటీ (ఖీఎిగిఇగిఖ్ఖఖఐఖి) గా మార్చాలని బోర్డు నిర్ణయించింది. ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాలల్లో డెస్క్టాప్ కంప్యూటర్ల కొనుగోలు, జూనియర్ కళాశాలలకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ (ఐఢ్కట) సరఫరాకు ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో 12 సైనిక్ స్కూళ్ల ఏర్పాటుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంలో ప్రస్తుతం ఉన్న ఆమోద స్థితిపై పూర్తి నివేదిక సమర్పిస్తే తదుపరి చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ గారు మాట్లాడుతూ, బీసీ విద్యార్థులకు అత్యుత్తమ విద్యా అవకాశాలు కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. విద్యా ప్రమాణాల పెంపు, పోటీ పరీక్షల్లో విజయాలు, జాతీయ స్థాయి విద్యాసంస్థల్లో అధిక ప్రవేశాలు సాధించేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ నిర్ణయాలు సంస్థను మరింత బలోపేతం చేయనున్నాయని మంత్రి వెల్లడించారు.

ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీమతి బాలమయాదేవి, ఎంజేపీ బీసీ గురుకులాల కార్యదర్శి శ్రీ సైదులు, వివిధ విభాగాల అధికారులు,బోర్డు సభ్యులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా క్యూర్ పరిధిలో పది అంతస్తుల్లో ఇందిరమ్మ ఇండ్లు

- జూన్ 28లోగా లొకేషన్ల ఖరారు
- జూలై మొదటి వారంలో బ్రోచర్ విడుదల
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



హైదరాబాద్, జూన్ 25:పేదల సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆ కల నెరవేర్చే క్రమంలో వారి జీవనోపాధికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు అత్యంత సమీపంలోనే క్యూర్ పరిధిలో పది అంతస్తుల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పేదల ఉపాధి, పిల్లల చదువు, కుటుంబ జీవన వ్యవస్థ దెబ్బతినకుండా నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకొని వారు నివశిస్తున్న ప్రాంతాలలోనే వారికి గౌరవప్రదమైన నివాసం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి గారు స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల శాశ్వత భవనాల నిర్మాణం, భద్రాచలం దేవస్థానం అభివృద్ధి అంశాలపై అధికారులతో మంత్రి గారు సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ, ఈ ఏడాది క్యూర్ పరిధిలో లక్ష ఇండ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నామని, ప్రయోగాత్మకంగా తొలి విడతలో ప్రతి నియోజకవర్గానికి 500 చొప్పున ఇళ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. క్యూర్ పరిధిలోని 26 నియోజకవర్గాల్లో ఇప్పటికే దాదాపు 20 వరకు స్థలాలను గుర్తించామని, మిగిలిన ప్రాంతాల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేసి ఈ నెల 28వ తేదీ లోగా అన్ని లొకేషన్లను ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రతి స్థలానికి సంబంధించిన ప్రణాళికలు, డిజైన్లు, నిర్మాణ నమూనాలను కూడా జూన్ 28లోగా సిద్ధం చేయాలని, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన విధివిధానాలు, అర్హతలు, దరఖాస్తు ప్రక్రియ వివరాలతో కూడిన బ్రోచర్ను జూలై మొదటి వారంలో విడుదల చేస్తామని వెల్లడించారు. క్యూర్ పరిధిలో అత్యంత ముఖ్యమైన ప్రాంతాలల్లో కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూముల్లో ఇండ్ల నిర్మాణాలను చేపడుతున్నామని ఈ స్థలాల్లో అన్ డివైడెడ్ షేర్ క్రింద మహిళలకు వాటా కల్పిస్తూ ఆ భాగాన్ని మహిళల రిజిస్ట్రేషన్ చేస్తామని మరోమారు స్పష్టం చేశారు. రాష్ట్రంలో హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఒకే మోడల్ లో ఆర్.డి.ఓ., తహశీల్దార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలను నిర్మిస్తున్నామని తెలిపారు. ఆయా జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేసుకొని వీలైనంత త్వరితగతిన పనులు ప్రారంభించేలా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అలాగే, ఆర్.డి.ఓ. తహశీల్దార్ కార్యాలయాల భవనాల మరమ్మతులకు సంబంధించి హౌసింగ్ ఏ.ఈ. లు భవనాలను విజిట్ చేసి ప్రతిపధనలు పంపించాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి, డి.ఎస్. లోకేశ్ కుమార్, హౌసింగ్ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# ముగ్గురు అంతర్జిల్లా స్మగ్లర్లు అరెస్ట్



## రూ.2 కోట్ల విలువైన 108 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

## ఢిల్లీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు విస్తరించిన స్మగ్లింగ్ నెట్వర్క్ వెలుగులోకి

**తిరుపతి జూన్ 25 మనం న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శేషాచలం రిజర్వ్ అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్రచందనం అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టే లక్ష్యంతో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం హెడ్ ఎల్. సుబ్బరాయుడు, మార్గదర్శకత్వంలో,ఆర్ఎస్ఏఎస్టీఎఫ్ ఎస్పీ పి. శ్రీనివాస్, అదనపు ఎస్పీ జె. కులశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆపరేషన్లు నిరంతరం నిర్వహించబడు తున్నాయి. ఎర్రచందనం కేసుల్లో నిందితులుగా ఉండి పరారీలో తిరుగుతున్న అంతర్రాష్ట్ర స్మగ్లర్లను గుర్తించి చట్టం ముందు నిలబెట్టేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి విస్తృత చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం టాస్క్ ఫోర్స్ సిబ్బ ంది అటవీ శాఖ అధికారులకు అందిన విశ్వసనీయ సమాచారంతో అనంతపురం జిల్లా నార్పల మండలం బొందలవాడ గ్రామ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ ఆపరేషన్లో అనంతపురం జిల్లాకు చెందిన నల్లాని నందకుమార్ (32), నల్లాని జయరామయ్య, బొట్టు రాఘవేంద్రలను అదుపు లోకి తీసుకు న్నారు.

ఈ క్రమంలో నార్పల మండ లం పరిధిలోని బొందలవాడ నుండి బొమ్మలాటపల్లి గ్రామానికి వెళ్లే మట్టి రహదారి సమీపంలో జయరా మయ్యకు చెందిన పొలంలోని రేకుల షెడ్ పక్కన ఎర్రచందనం దుంగలను డంప్ చేసి దాచిపెట్టినట్లు గుర్తించారు. టాస్క్ ఫోర్స్ బృందం నిర్వహించిన దాడి లో మొత్తం 109 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకోవడంతో పాటు, అక్రమ రవాణాకు వినియో గించిన ఒక కారును కూడా సీజ్ చేసింది. శేషాచలం అడవుల్లో ఎర్రచం దనం అక్రమ నరికివేత, నిల్వ, రవాణా మరియు స్మగ్లింగ్ కార్యకలాపాలపై భవిష్య త్తులో కూడా మరింత కఠిన చర్యలు కొనసాగుతాయని, అక్రమ రవాణాకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు నిర్దాక్షిణ్యంగా అమలు చేయబడతాయని అధికారులు స్పష్టం చేశారు.

# అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరు శాతం పెంచాలి

- **ఎఫ్ఆర్ఎస్ నమోదు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశం**



**పెద్దపల్లి, జూన్ 25 (మనం ప్రతినిధి):** జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరు శాతాన్ని పెంచడంతో పాటు వారికి నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం సీపీడీవోలు, అంగన్వాడీ సూపర్వైజర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరు శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, ఎఫ్ఆర్ఎస్ (ఊఖఖి) ద్వారా హాజరు నమోదును పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.అంగన్వాడీ కేంద్రాలకు హాజరయ్యే ప్రతి చిన్నారికి నాణ్యమైన భోజనం, పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గర్భిణులు, బాలింతలకు పాలు, కోడిగుడ్లు తదితర పోషకాహారాన్ని నిబంధనల ప్రకారం క్రమం తప్పకుండా అందించాలని తెలిపారు. గర్భిణీ మహిళలు అంగన్వాడీ కేంద్రాలకు వచ్చి అక్కడే భోజనం చేసే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, వారికి పాలు, కోడిగుడ్లు తదితర పోషకాహారాన్ని నిబంధనల ప్రకారం క్రమం తప్పకుండా అందించి మాతా, శిశు ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. బాలింతలకు కూడా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం సకాలంలో అందేలా పర్యవేక్షించాలని సూచించారు.అంగన్వాడీ కేంద్రాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ సూచించారు. చిన్నారులకు నాణ్యమైన ప్రాథమిక విద్యతో పాటు ఆటపాటల ద్వారా అభ్యాసం జరిగేలా అంగన్వాడీ టీచర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పిల్లలకు అవసరమైన ఆట వస్తువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రతి సోమవారం అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా అయ్యే ఆహార పదార్థాలను తప్పనిసరిగా తనిఖీ చేసి నాణ్యతను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. చిన్నారులకు బాలామృతంతో పాటు అందించాల్సిన అన్ని పౌష్టికాహార పదార్థాలు సక్రమంగా అందేలా పర్యవేక్షించాలని సూచించారు.జులై 1న అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిదండ్రుల సమక్షంలో సమావేశాలు నిర్వహించి, పిల్లల ఆరోగ్యం, పోషకాహారం, హాజరు, విద్యాభివృద్ధిపై వారి సూచనలు, సలహాలు స్వీకరించాలని కలెక్టర్ ఆదేశించారు. పిల్లల బరువును క్రమం తప్పకుండా నమోదు చేసి ఎదుగుదలను పర్యవేక్షించాలని, పోషకాహార లోపం ఉన్న చిన్నారులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి కాళిందిని , సీపీడీవోలు, అంగన్వాడీ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## గడువులోగా పెండింగ్ పనులు పూర్తి చేయండి



- **అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే**

**కరీంనగర్ జూన్ 25(మనం బ్యూరో):** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లావ్యాప్తంగా మంజూరైన అభివృద్ధి పనులు (సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీవో భవనాలు, ప్రహరీ, కిచెన్ షెడ్లు) వేగవంతం చేసి వెంటనే ఈనెల 30 లోగా పూర్తిచేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే.. అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఈజీఎస్ పెండింగ్ పనులపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈజీఎస్ కింద మంజూరైన పనులు సత్వరం పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు సమన్వయంతో ముందుకు సాగుతూ గడువు తేదీలోగా నిర్దేశించిన లక్ష్యం చేరుకోవాలన్నారు. మంజూరైన పనులు ఆపకుండా తక్షణం గ్రౌండింగ్ చేసి ప్రారంభించాలన్నారు. ఈ సందర్భంగా మండలాల వారీగా జరుగుతున్న పనుల వివరాలు ఏఈలని అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో మస్టర్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ గీత, పంచాయతీరాజ్ ఈఈ జనార్ధన్, అదనపు డీఆర్డీఓలు, జిల్లాలోని ఆరు సబ్ డివిజన్ల పంచాయతీరాజ్ డీఈలు, 15 మండలాల ఏఈలు పాల్గొన్నారు.



## ఓటర్లు ఉన్న ఇంటింటికీ ఎన్యూమరేషన్ ఫారాలు ఇవ్వాలి

- **ఫారాలు నింపడంలో బూత్ లెవెల్ అధికారులు సహకరించాలి**
- **జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**రాజన్న సిరిసిల్ల, జూన్ -25(మనం ప్రతినిధి ):** ఓటర్లు ఉన్న ప్రతి ఇంటింటికీ ఎన్యూమరేషన్ ఫారాలు తప్పనిసరిగా ఇవ్వాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ఎస్ఐఆర్ లో భాగంగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని 71 వ పోలింగ్ కేంద్రం పరిధిలో బూత్ లెవల్ అధికారి ఎన్యూమరేషన్ ఫారాలు గురువారం పంపిణీ చేస్తుండగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఎన్యూమరేషన్ ఫారాలు తీసుకున్న పలువురితో మాట్లాడారు. ఎన్యూమరేషన్ ఫారంలో అన్ని వివరాలు నింపాలని, ప్రస్తుత పాస్ పోర్ట్ సైజ్ ఫొటో బీఎల్ఓలకు ఇవ్వాలని సూచించారు. ఈ నెల 30 వ తేదీ వరకు తమ పరిధిలో ఓటర్ జాబితాలో ఉన్న వారందరికీ ఎన్యూమరేషన్ ఫారాలు అందించాలని ఆదేశించారు. జూలై 24వ తేదీలోగా తీసుకోవాలని సూచించారు. ఓటర్లు ఫారాలు నింపడంలో సహాయం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. పరిశీలనలో ఆర్డీఓ శ్రీధర్ బాబు, తహసీల్దార్ సుజాత తదితరులు ఉన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

### అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి

**కరీంనగర్, జూన్ 25(మనం న్యూస్):** ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అర్హులైన ఏ ఒక్కరి పేరు కూడా ఓటరు జాబితా నుంచి తొలగించబోమని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. గురువారం మానకొండూరు మండలం ముంజంపల్లి గ్రామంలో బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్ ఫారాలను పంపిణీ చేస్తున్న విధానాన్ని ఆయన పరిశీలించారు. ఓటర్లకు ఫారాల పంపిణీ, వివరాల నమోదు, అవగాహన కల్పన తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఓటరు జాబితా ప్రక్షాళన చేయడమే ఎస్ఐఆర్ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. మానకొండూరు నియోజకవర్గంలో 316 పోలింగ్ కేంద్రాలకు 316 మంది బీఎల్వోలు, 32 మంది సూపర్వైజర్లు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో 2,26,250 మంది ఓటర్లు ఉండగా, వారిలో రెండు లక్షల మందికి పైగా ఓటర్ల మ్యాపింగ్ పూర్తయిందన్నారు. సుమారు 24 వేల మంది ఓటర్ల మ్యాపింగ్ ఇంకా జరగాల్సి ఉండగా, 47 వేల మంది ఓటర్ల మ్యాపింగ్లో సవరణలు అవసరమని గుర్తించినట్లు వివరించారు. కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే వారు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మ్యాపింగ్ డేటా ఆధారంగా బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్వహించి, ఓటర్లకు ముద్రిత ప్రతులను అందజేస్తారని చెప్పారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ఓటర్లకు ఫారాలను అందజేయాలని, ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని బీఎల్వోలకు సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల ప్రకారం పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.



## యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- **కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం**



**కరీంనగర్, జూన్ 25(మనం న్యూస్ ):** అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని (జూన్ 26) పురస్కరించుకుని, తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'యాంటీ డ్రగ్ అవేర్నెస్ వీక్' కార్యక్రమాలు కరీంనగర్ జిల్లాలో ఉత్సాహంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం నాల్గవ రోజు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ మరియు ఇతర ప్రభుత్వ విభాగాల సమన్వయంతో నగరంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ప్రారంభమైన ఈ 2 కిలోమీటర్ల ర్యాలీ గీతాభవన్ చౌరస్తా మీదుగా పోలీస్ పరేడ్ గ్రౌండ్ వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో వివిధ విద్యాసంస్థల విద్యార్థులు, నర్సింగ్, మెడికల్ కాలేజీల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని డ్రగ్స్కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గీతాభవన్ చౌరస్తాలో నర్సింగ్ కళాశాల విద్యార్థినులు ప్రదర్శించిన వీధి నాటకం (నాటిక), అవగాహన గీతాలు ప్రజలను, తోటి విద్యార్థులను ఎంతగానో ఆలోచింపజేశాయి. అంధకారంలోకి భవిష్యత్తు - స్కిట్ ద్వారా కళ్ళకు కట్టినట్లు ప్రదర్శన: ర్యాలీ అనంతరం కమిషనరేట్ కేంద్రంలోని 'అస్త్ర కన్వెన్షన్ హాలు' నందు పోలీస్ కమిషనర్ (సీపీ) గౌష్ ఆలం అధ్యక్షతన విద్యార్థులతో భారీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఈగల్ ఫోర్స్ విడుదల చేసిన పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రత్యేక షార్ట్ ఫిల్ముు విద్యార్థులకు ప్రదర్శించారు. అనంతరం చల్మెడ ఆనందరావు మెడికల్ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన స్కిట్ డ్రగ్స్ మహమ్మారి వల్ల యువత జీవితాలు ఎలా అంధకారంలోకి వెళ్తాయి, కుటుంబాలు ఎలా నాశనమవుతాయనే విషయాన్ని కళ్ళకు కట్టింది. నర్సింగ్ విద్యార్థినులు తమ నృత్య ప్రదర్శన ద్వారా డ్రగ్స్ రహిత సమాజంపై చక్కని సందేశాన్ని ఇచ్చారు. ఒత్తిడిని అధిగమించడానికి క్రీడలపై దృష్టి పెట్టండి: సిపి గౌష్ ఆలం సదస్సులో పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ.. సమాజాన్ని పట్టి పీడిస్తున్న అతిపెద్ద మహమ్మారి మాదకద్రవ్యాల దుర్వినియోగం (డ్రగ్ అబ్యూస్) అని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు, యువత ఎలాంటి చెడు వ్యసనాలకు లోనుకాకూడదని హితవు పలికారు. చదువుల వల్ల కలిగే ఒత్తిడిని అధిగమించేందుకు డ్రగ్స్ వైపు కాకుండా, స్పోర్ట్స్, శారీరక వ్యాయామం (ఫిజికల్ యాక్టివిటీ) పై దృష్టి సారించాలని సూచించారు. కరీంనగర్ జిల్లాను డ్రగ్ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా ఇటీవల విద్యాసంస్థల పరిసరాల్లోని (100 మీటర్ల లోపు) 99 పాన్ షాపులపై దాడులు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 52 కేసులు నమోదు చేసినట్లు గుర్తుచేశారు. కమీషనరేట్ పరిధిలోని అన్ని విద్యాసంస్థల్లో 'కాన్షియస్ క్లబ్స్' ఏర్పాటు చేశామని తెలిపారు. ' అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ లేదా గంజాయి సేవించడం, విక్రయించడం 'ఎన్.డి.పి.ఎస్ యాక్ట్ - సెక్షన్ 27' ప్రకారం చట్టరీత్యా తీవ్రమైన నేరమని, దీనివల్ల భవిష్యత్తు సర్వనాశనమవుతుందని హెచ్చరించారు. స్వీయ నియంత్రణే శ్రీరామరక్ష: సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల అక్రమ రవాణాను, దుర్వినియోగాన్ని అరికట్టేందుకు పోలీస్ శాఖతో పాటు అన్ని ప్రభుత్వ విభాగాలు ఎంతో కృషి చేస్తున్నాయని కొనియాడారు. అయితే, అధికారులు ఎన్ని చర్యలు తీసుకున్నప్పటికీ, యువతలో 'స్వీయ నియంత్రణ' ఉన్నప్పుడే డ్రగ్స్ మహమ్మారికి దూరంగా ఉండి, తమ జీవిత లక్ష్యాలను చేరుకోగలరని ఆకాంక్షించారు. విజేతలకు బహుమతుల ప్రదానం - ప్రతిజ్ఞ, సంతకాల సేకరణ: ఈ సందర్భంగా యాంటీ డ్రగ్స్ వీక్ లో భాగంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు సిపి గౌష్ ఆలం చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం అధికారులు, విద్యార్థులందరూ కలిసి డ్రగ్స్ నిర్మూలనకు ప్రతిజ్ఞ చేశారు. హాల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక 'సంతకాల సేకరణ బోర్డు'పై సీపీతో పాటు ఇతర అతిథులు, అధికారులు సంతకాలు చేసి, కరీంనగర్ను డ్రగ్ ఫ్రీ జిల్లాగా తీర్చిదిద్దుతామని సంకల్పించారు. ఈ సదస్సులో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిణి సరస్వతి, డిస్ట్రిక్ చైల్ ప్రొటెక్షన్ ఆఫీసర్ పర్వీన్, ఏసీపీలు వేణుగోపాల్, విజయకుమార్, యాదగిరిస్వామి,ఆంటీ నార్కోటిక్ ఇన్స్పెక్టర్ రఫీక్ ఖాన్ ఇతర పోలీస్, ఎక్సైజ్ అధికారులు మరియు వివిధ విద్యాసంస్థల ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ చుట్టూ మున్సిపల్ నిధులతో ప్రహరీ గోడ నిర్మాణం

**శంకుస్థాపన చేసిన మేయర్ కొలగాని శ్రీనివాస్, కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం**



**కరీంనగర్ జూన్ 25(మనం బ్యూరో):** నగరంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ చుట్టూ నూతన ప్రహరీ గోడ (కాంపౌండ్ వాల్) నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన జరిగింది. మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న ఈ నిర్మాణ పనులకు కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, మరియు పోలీస్ కమిషనర్ (సీపీ) గౌష్ ఆలం స్థానిక కార్పొరేటర్ టింకు, కార్పొరేటర్ రవీందర్ సింగ్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మరియు సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ.. నగరంలో శాంతిభద్రతలతో పాటు ట్రాఫిక్ నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తున్న ట్రాఫిక్ పోలీస్ స్టేషన్కు మౌలిక వసతుల కల్పనలో భాగంగా మున్సిపల్ నిధులతో ఈ ప్రహరీ గోడను నిర్మిస్తున్నట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను మరింత సురక్షితంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు ఈ నిర్మాణం దోహదపడుతుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లోనూ పోలీస్ శాఖకు, మున్సిపల్ కార్పొరేషన్కు మధ్య ఇదే రకమైన సమన్వయం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

**ట్రాఫిక్ సిబ్బందికి చలువ కళ్ళజోళ్ల పంపిణీ**

శంకుస్థాపన కార్యక్రమం అనంతరం, నిరంతరం రోడ్లపై ఉంటూ ఎండ, ధూళిని లెక్కచేయక విధి నిర్వహణలో నిమగ్నమయ్యే ట్రాఫిక్ అధికారులు, సిబ్బంది సంక్షేమం కోసం ఒక మంచి కార్యక్రమాన్ని చేపట్టారు. సిబ్బంది కంటి ఆరోగ్య రక్షణకై సీపీ గౌష్ ఆలం చేతుల మీదుగా ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి చలువ కళ్ళజోళ్లను (కూలింగ్ గ్లాసెస్) అందజేశారు. కఠినమైన వాతావరణ పరిస్థితుల్లో కూడా విధి నిర్వహణకు కట్టుబడి పనిచేస్తున్న సిబ్బందిని ఈ సందర్భంగా సీపీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామి, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్లు సంజీవ్, అంజయ్య, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమర్జెన్సీ నుంచి ఆపరేషన్ కగార్ వరకు పౌరహక్కుల ఉల్లంఘన

- **పౌరహక్కుల సంఘం రౌండ్ టేబుల్ సమావేశం**



**పెద్దపల్లి,జూన్ 25 (మనం ప్రతినిధి):** 1975లో విధించిన ఎమర్జెన్సీకి 50 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని,పౌరహక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెద్దపల్లి ప్రెస్ క్లబ్లో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.ఇందిరా ఎమర్జెన్సీ నుండి మోడీ ఆపరేషన్ కగార్ వరకు-పౌరహక్కుల ఉల్లంఘనలు అనే అంశంపై జరిగిన ఈ సమావేశానికి పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు బొంకూరి లక్ష్మణ్ అధ్యక్షత వహించారు.ఈ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ 1975 నాటి ఎమర్జెన్సీ భారత ప్రజాస్వామ్య చరిత్రలోనే ఒక చీకటి అధ్యాయమని పేర్కొంటూ,అప్పట్లో ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాసి,వేలాది మంది రాజకీయ నాయకులు,కార్యకర్తలను జైలుపాలు చేసిన ఘటనలను గుర్తు చేశారు.ప్రస్తుతం దేశంలో అటువంటి నిర్బంధ ధోరణులే భిన్న రూపాల్లో కొనసాగుతున్నాయని,కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను పరిమితం చేస్తూ,భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసేవారిని దేశద్రోహులుగా,ఉగ్రవాదులుగా ముద్రవేస్తూ అణచివేస్తోందని వారు విమర్శించారు.ముఖ్యంగా ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీ ప్రాంతాల్లో చేపట్టిన సైనిక చర్యలు స్థానిక ప్రజల రాజ్యాంగబద్ధ హక్కులను తీవ్రంగా ఉల్లంఘిస్తున్నాయని వారు మండిపడ్డారు.దేశంలో దళితులు, ఆదివాసీలు,మైనారిటీలు మరియు మహిళలపై పెరుగుతున్న దాడుల పట్ల ఆందోళన వ్యక్తం చేసిన వక్తలు, రాజ్యాంగ విలువలను కాపాడుకోవడానికి ప్రజాస్వామ్య శక్తులు ఏకం కావాలని పిలుపునిచ్చారు.బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ,ప్రజలు,మేధావులు, విద్యార్థి, యువజన మరియు మహిళా సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి గాండ్ల మల్లేశం,రైతు సమస్యల సాధన సమితి రాష్ట్ర కార్యదర్శి ముడిమడుగుల మల్లన్న,పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు బొంకూరి లక్ష్మణ్,సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, టీపీఎఫ్ జిల్లా అధ్యక్షులు గుమ్మడి కొమురయ్య,కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు కల్లేపల్లి అశోక్,జిల్లా కమిటీ సభ్యులు అంజన్న,సీఎల్సీ జిల్లా సహాయ కార్యదర్శి రెడ్డిరాజుల సంపత్,జిల్లా ఉపాధ్యక్షులు నారా వినోద్,బండారి రాజలింగు,టీపీఎఫ్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు జైపాల్ సింగ్,సామాజిక ఉద్యమకారులు ఎరుకల రాజన్న,ప్రజా సంఘాల నాయకులు రామిల్ల బాపు, యాదన్న, సమ్మన్న,దస్తగిరి,శంకరయ్య, పొలాస సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్లో మెగా జాబ్ మేళా నిర్వహణ

**జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్**



**పెద్దపల్లి, జూన్ 25 (మనం ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించే లక్ష్యంతో, భారత ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక మంత్రిత్వ శాఖ , స్కిల్ ఇండియా మిషన్, నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ₹వరంగల్ కౌశల్ మహోత్సవం- 2026₹జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ కార్యక్రమం జూన్ 27, 2026న వరంగల్లోని కాకతీయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ( కే ఐ టి ఎస్) ప్రాంగణంలో ఉదయం 8:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు నిర్వహించబడుతుందని, ఈ జాబ్ మేళాలో 50కి పైగా ప్రముఖ సంస్థలు పాల్గొంటున్నాయని, దీని ద్వారా సుమారు 5,000కు పైగా ఉద్యోగ ఖాళీలు, డ్యూయల్ స్కిల్లింగ్, అప్రెంటిస్షిప్ అవకాశాలు కెరీర్/నైపుణ్యాభివృద్ధి కోర్సుల మార్గదర్శకత్వం లభిస్తాయని, పదవ తరగతి, ఇంటర్మీడియట్, అంతకంటే ఎక్కువ విద్యార్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని,ఆసక్తి గల అభ్యర్థులు ఉచిత రిజిస్ట్రేషన్ కోసం 88000 55555 ,8001239626 నంబర్లను సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ప్రజాసేవతో వైద్యసేవ.. అచ్చంపేటలో నాలుగో విడత మెగా సర్జికల్ క్యాంపు ప్రారంభం

- **800 మంది రోగుల నమోదు.. తొలి రోజే 80 శస్త్రచికిత్సలు విజయవంతం**
- **పేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం : ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ**

**అచ్చంపేట, జూన్ 25 (మనం న్యూస్):** నాగర్కర్నూలు జిల్లా అచ్చంపేట నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ప్రజాసేవతో పాటు వైద్యసేవలను కొనసాగిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వృత్తిరీత్యా వైద్యుడైన ఆయన, ఎమ్మెల్యేగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూనే పేద రోగులకు స్వయంగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం అచ్చంపేట పట్టణంలోని 100 పడకల ఏరియా ఆసుపత్రిలో నాలుగో విడత మెగా సర్జికల్ క్యాంపును ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ప్రారంభించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఈ మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శస్త్రచికిత్సల శిబిరంలో నియోజకవర్గంలోని పలు గ్రామాలు, తండాలు, పట్టణ ప్రాంతాలకు చెందిన సుమారు 800 మంది రోగులు వివిధ రకాల శస్త్రచికిత్సల కోసం తమ పేర్లు నమోదు చేసుకున్నారు. వైద్య నిపుణుల పర్యవేక్షణలో రోగులకు ముందస్తు పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య పరిస్థితులను పరిశీలించిన అనంతరం శస్త్రచికిత్సలకు ఎంపిక చేస్తున్నారు. శిబిరం తొలి రోజునే దాదాపు 80 శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసినట్లు వైద్య అధికారులు తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం రోగులకు అవసరమైన మందులు, వైద్య సలహాలు, ప్రత్యేక పర్యవేక్షణ అందిస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ, నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం తన బాధ్యతగా భావిస్తున్నానన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా శస్త్రచికిత్సలు



చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు ఈ మెగా సర్జికల్ క్యాంపులు ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. పేర్లు నమోదు చేసుకున్న ప్రతి రోగికి దశలవారీగా శస్త్రచికిత్సలు నిర్వహించి, పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. శస్త్రచికిత్సల అనంతరం కూడా రోగుల ఆరోగ్య పరిస్థితిని స్వయంగా పర్యవేక్షిస్తూ అవసరమైన సూచనలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలు మెరుగైన వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. అచ్చంపేట ఏరియా ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఆధునిక వైద్య పరికరాలు, నిపుణుల సేవలు అందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందించే విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన రోగులు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. మెగా సర్జికల్ క్యాంపు ద్వారా పేద ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందుతుండటంపై రోగులు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

## జాతీయ ఆరోగ్య లక్ష్యాలు సాధించాలి



- డీఎంహెచ్ఓ డా. జె. వెంకటి.

**కామారెడ్డి, జూన్ 25 (మనం ప్రతినిధి):** జిల్లాలో అమలవుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. జె. వెంకటి గురువారం ఐడీఓసీ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. వైద్యాధికారులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, హెల్త్ సూపర్వైజర్లు, జిల్లా కార్యక్రమ అధికారులతో కలిసి వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలును పరిశీలించారు. ఈ సందర్భంగా క్షయ, కుష్ఠు నిర్మూలన, వెక్టర్ వ్యాధుల నియంత్రణ, టీకాల కార్యక్రమం, మాతా-శిశు ఆరోగ్య సేవలు, అసంక్రమిత వ్యాధుల నియంత్రణ, మానసిక ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. 100 శాతం టీకా కవరేజీ లక్ష్యం. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డెంగ్యూ, మలేరియా, చికున్గున్యా, అతిసార వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు 100 శాతం టీకా కవరేజీ సాధించాలని పేర్కొన్నారు. ఆరోగ్య, వెల్నెస్ కేంద్రాల సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని, అవసరమైన మందులు, పరీక్షలు అందుబాటులో ఉంచాలని సూచించారు. జిల్లాలో ఆరోగ్య సూచికలను మెరుగుపరిచి జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో కామారెడ్డిని ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.

## మత్తుకు బానిసలై జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

- యువత లక్ష్యా సాధనపై దృష్టి పెట్టాలి
- కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్
- మాదక ద్రవ్యాల నియంత్రణకు కఠిన చర్యలు
- ఎస్పీ రాజేష్ చంద్ర.



**కామారెడ్డి, జూన్ 25 (మనం ప్రతినిధి):** అంతర్జాతీయ మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, దుర్వినియోగ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం కామారెడ్డి జిల్లాలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా పరిపాలన, పోలీసు శాఖ, ఎక్సైజ్ శాఖ, జిల్లా సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నుంచి నిజాంసాగర్ చౌరస్తా వరకు భారీ అవగాహన ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో అధికారులు, పోలీసు సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొని మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల వినియోగాన్ని నిరసిస్తూ నినాదాలు చేస్తూ ప్రజలను చైతన్యపరిచారు. మాదక ద్రవ్యాల వినియోగం ఆరోగ్యానికి, కుటుంబ వ్యవస్థకు, సమాజానికి ఎంతటి ప్రమాదకరమో వివరిస్తూ ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. యువత లక్ష్యా సాధనపై దృష్టి సారించాలి. అనంతరం జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ., యువత దేశ భవిష్యత్తుకు మూలస్తంభమని, వారు మాదక ద్రవ్యాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా కుటుంబాల శాంతి, సమాజ అభివృద్ధి, దేశ పురోగతిని కూడా దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు, యువత తమ లక్ష్యాల సాధనపై దృష్టి సారించి క్రమశిక్షణతో కూడిన ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రాజేష్ చంద్ర మాట్లాడుతూ., జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు పోలీసు శాఖ ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోందన్నారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగాన్ని అరికట్టేందుకు నిరంతర నిఘా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే ప్రజలు పోలీసు శాఖకు అందించాలని కోరారు. ప్రజల సహకారంతోనే మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా కామారెడ్డిని తీర్చిదిద్దగలమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమం ముగింపులో మాదక ద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని, వాటి నిర్మూలనకు కృషి చేయాలని పాల్గొన్న వారందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్.వి. గిరి, జిల్లా సంక్షేమ అధికారి ఐ. ప్రసన్న, ఎక్సైజ్ సూపరింటెండెంట్ హనుమంతరావు, పోలీసు అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అందరం కృషి చేద్దాం

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్
- రాజ్యాంగం కల్పించిన వజ్రాయుధం ఓటు హక్కు
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్




**సంగారెడ్డి, జూన్ 25 మనం ప్రతినిధి:** ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు ఎంత ముఖ్యమో, యువత భవిష్యత్తుకు మాదకద్రవ్యాల రహిత సమాజం అంతే అవసరమని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితాల సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్-2026)పై ఓటర్లలో అవగాహన కల్పించడంతో పాటు మాదకద్రవ్యాలను నిర్మూలించాలన్న సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జిల్లా కలెక్టరేట్ నుంచి ఐబీ గెస్ట్ హౌస్ వరకు గురువారం నిర్వహించిన 2కె రన్ను వారు జెండా ఊపి ప్రారంభించారుఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరు జాబితాలో తన పేరు నమోదు చేసుకోవడం ప్రజాస్వామ్య బాధ్యత అని పేర్కొన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ద్వారా ఓటరు జాబితాలను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందిస్తున్నామని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువకుడు, యువతి ఓటరుగా నమోదు కావాలని, చిరునామా మార్పులు, పేరు సవరణలు, ఇతర వివరాల నవీకరణ కోసం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడంలో ఖచ్చితమైన ఓటరు జాబితా కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. నేటి నుంచి బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు) ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారని, ప్రజలు సరైన వివరాలను అందించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అలాగే మాదకద్రవ్యాల దుర్వినియోగం సమాజానికి, ముఖ్యంగా యువతకు తీవ్రమైన ముప్పుగా మారుతోందని పేర్కొంటూ, డ్రగ్స్కు దూరంగా ఉండటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, క్రీడలు, విద్య, సృజనాత్మక కార్యకలాపాల ద్వారా యువత తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణాను అరికట్టడంలో పోలీసు శాఖకు ప్రజల సహకారం ఎంతో అవసరమని అన్నారు. మాదకద్రవ్యాల విక్రయం లేదా వినియోగంపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. యువత చెడు అలవాట్ల బారిన పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్కు 'నో' చెప్పి ఆరోగ్యవంతమైన, బాధ్యతాయుతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ 2కె రన్లో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, అదనపు కలెక్టర్ పాండు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువత, సాంస్కృతిక సారథి కళాకారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రధాన జిల్లా న్యాయమూర్తిగా పి. ముక్తిద బాధ్యతల స్వీకరణ



**కామారెడ్డి, జూన్ 25 (మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర గౌరవ హైకోర్టు జారీ చేసిన బదిలీ, నియామక ఉత్తర్వుల మేరకు శ్రీమతి పి. ముక్తిద గురువారం కామారెడ్డి జిల్లా ప్రధాన న్యాయస్థానంలో ప్రధాన జిల్లా న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. ఇదే సందర్భంగా ఆమె కామారెడ్డి అదనపు జిల్లా న్యాయస్థానం న్యాయమూర్తిగా, పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తిగా అలాగే జిల్లా న్యాయ సేవా సంస్థ (డీఎల్ఎస్ఏ) చైర్పర్సన్గా కూడా బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించడానికి ముందు నూతన ప్రధాన జిల్లా న్యాయమూర్తి కామారెడ్డిలోని ప్రసిద్ధ శ్రీ కాలభైరవ స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. అనంతరం జిల్లా న్యాయస్థానానికి చేరుకుని అధికారికంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. యాదాద్రి భువనగిరి నుంచి కామారెడ్డికి బదిలీ. పి. ముక్తిద గతంలో యాదాద్రి భువనగిరి జిల్లాలో అదనపు జిల్లా న్యాయమూర్తిగా సేవలందించారు. అక్కడి నుంచి బదిలీపై కామారెడ్డి జిల్లాకు వచ్చి ప్రధాన జిల్లా న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయస్థాన ప్రాంగణంలో న్యాయాధికారులు, న్యాయవాదులు, సిబ్బంది ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. న్యాయాధికారులు డా. సూరా సుమలత, కె. సుధాకర్, బి. దీక్ష, ప్రధాన పరిపాలనా అధికారి పి. రాంచందర్ రావు, ఉషారాణి, సిబ్బంది సభ్యులు జె. భుజంగరావు, వెంకట్ రెడ్డి, చంద్రసేన్ రెడ్డి, నిఖిల్ రెడ్డి, కరుణ, మమత తదితరులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు నారాయణ, ప్రభుత్వ న్యాయవాది శ్యాం గోపాల్ రావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, జిల్లా బార్కు చెందిన పలువురు న్యాయవాదులు, జిల్లా న్యాయవ్యవస్థ సిబ్బంది నూతన ప్రధాన జిల్లా న్యాయమూర్తికి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమ విజయవంతానికి రాజకీయ పార్టీలు సహకరించాలి



- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి, జూన్ 25 మనం ప్రతినిధి:** జిల్లాలో చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) - 2026 కార్యక్రమాన్ని విజయవంతం చేసి, పారదర్శకమైన, తప్పులులేని ఓటరు జాబితాను రూపొందించేందుకు అన్ని రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు. గురువారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో అడిషనల్ కలెక్టర్ సంగీతతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ ఐ ఆర్ పై సమావేశం నిర్వహించారుఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు (బీఎల్వోలు) ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను ధృవీకరించడం, ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయడం జరుగుతుందని, జిల్లాలో నేటి నుండి ప్రారంభమైందని తెలిపారు. ఈ ప్రక్రియ సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి సహకరించాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు తెలిపారు. అనంతరం జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, సూచనల స్వీకరణ, జూలై 31 నుంచి సెప్టెంబర్ 28 వరకు వాటి పరిశీలన, పరిష్కారం చేపట్టి, అక్టోబర్ 1న తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు వివరించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు, నియమ నిబంధనల ప్రకారమే ఎస్ఐఆర్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, అదే సమయంలో ఒకే వ్యక్తికి రెండు లేదా అంతకంటే ఎక్కువ ప్రాంతాల్లో ఓటరు నమోదులు ఉండకుండా పరిశీలిస్తున్నామని తెలిపారు.ఓటర్ల వివరాల ధృవీకరణలో ప్రజలు బీఎల్వోలకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, ఇంటింటికి వచ్చే బీఎల్వోలకు అవసరమైన సమాచారం అందించేలా చూడాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ సంగీత, తహసీల్దార్ జయరాం, ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## డ్రగ్స్, చెడు వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి



- గజ్వేల్ సిఐ రవికుమార్

**గజ్వేల్, జూన్ 25 మనం న్యూస్:** డ్రగ్స్, చెడు వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి గజ్వేల్ సిఐ రవికుమార్ విద్యార్థులకు సూచించారు. సిద్దిపేట జిల్లా పోలీసు కమిషనర్ రశ్మి పెరుమాళ్ ఆదేశాల మేరకు గురువారం గజ్వేల్ సిఐ రవికుమార్,డ్రగ్స్ రహిత తెలంగాణ లీగల్ ఫోర్స్ కార్యక్రమం గజ్వేల్ లో సెయింట్ జోసెఫ్ , సాయి జిడిఆర్ పాఠశాలలు ,ప్రగతి కాలేజ్ విద్యార్థులతో కలిసి ర్యాలీగా బయలుదేరి అంబేద్కర్ చౌరస్తాలో డ్రగ్స్ రహిత తెలంగాణ కార్యక్రమం సిఐ రవికుమార్, పోలీసులు నిర్వహించారు. ఈ సందర్భంగా గజ్వేల్ సిఐ రవికుమార్ మాట్లాడుతూ డ్రగ్స్ గంజాయి మత్తు మాత్రలు వంటి మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదకరం అన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి విద్యభ్యాసం పై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. మాదకద్ర వ్యాల వినియోగం వల్ల ఆరోగ్య సమస్యలతో పాటు కుటుంబం సామాజిక ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. యువత తప్పుడు స్నేహితులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, గ్రామాలలో గ్రామీణ యువతలో అవగాహన పెంపొందించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణమే మా లక్ష్యం, యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడటంలో కుటుంబ సభ్యులు, మహిళలు మరియు సమాజంలోని ప్రతి ఒక్కరి పాత్ర ఎంతో కీలకమని అన్నారు. డ్రగ్స్కు సంబంధించిన సమాచారం తెలిసిన వారు 1908 హెల్ప్లైన్కు కాల్ చేసి తెలియజేయవచ్చు, సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని, కాల్ చేయడం సాధ్యం కాని పరిస్థితుల్లో సంబంధిత వాట్సాప్ నంబర్కు సందేశం పంపి సమాచారాన్ని అందించవచ్చని తెలిపారు అనుమానాస్పద వ్యక్తులు లేదా మాదకద్రవ్యాలు విక్రయాల గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై స్రవంతి , ట్రాఫిక్ ఎస్ఐ నిరేష్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణంపై ఆకస్మిక తనిఖీ



- యూరియా నిల్వలు, విక్రయాలపై ఆరా
- స్టాక్ వివరాలు యాప్లో నమోదు చేయాలని ఆదేశం.
- రైతులతో నేరుగా మాట్లాడి యూరియా లభ్యతపై ఆరా, ఎరువుల నిల్వల పరిశీలన.
- గోదాం తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ

కామారెడ్డి, జూన్ 25 (మనం జిల్లా ప్రతినిధి): రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందేలా జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షణ చేపడుతోందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. గురువారం జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఎన్.వి. గిరితో కలిసి కామారెడ్డి పట్టణంలోని కిసాన్ అగ్రి మార్ట్ ఎరువుల దుకాణం, గోదామును ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల సందర్భంగా దుకాణంలో ఉన్న యూరియా, ఇతర రకాల ఎరువుల నిల్వలను అధికారులు పరిశీలించారు. ఎరువుల పంపిణీ, విక్రయాల ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిబంధనల ఉల్లంఘనలు గుర్తిస్తే కఠిన చర్యలు. అనంతరం దుకాణం వద్ద ఉన్న రైతులతో జిల్లా కలెక్టర్ నేరుగా మాట్లాడి యూరియా లభ్యత, బుకింగ్ యాప్ వినియోగంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. యాప్ ద్వారా ఎరువుల బుకింగ్ చేసుకోవడం వల్ల పారదర్శకత పెరగడంతో పాటు రైతులకు అవసరమైన సమాచారం సులభంగా అందుబాటులో ఉంటుందని తెలిపారు. రైతులు ఈ సదుపాయాన్ని విస్తృతంగా వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో ఎరువుల నిల్వలు, సరఫరా, విక్రయాలపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు. రైతులకు ఎలాంటి కొరత తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, ఎరువుల పంపిణీ వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తారని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉండేలా ప్రత్యేక దృష్టి సారించామని, ఎక్కడైనా అక్రమ నిల్వలు లేదా నిబంధనల ఉల్లంఘనలు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

## ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన సంతోష్



**సిద్దిపేట జూన్ 25 ; మనం ప్రతినిధి:** సిద్దిపేట జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ గా బి సంతోష్ గురువారం బాధ్యతలు చేపట్టారు. సంతోష్ నల్గొండ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ గా బాధ్యత నిర్వహించి బదిలీపై సిద్దిపేటకు వచ్చారు. సిద్దిపేటలో పనిచేసిన శ్రీనివాసమూర్తి పెద్దపల్లికి బదిలీపై వెళ్లారు. జిల్లా కలెక్టర్ హైమావతిని గురువారం కలిసి మొక్కను అందజేశారు.

## డ్రగ్స్‌తో దుష్పరిణామాలు

- ఆరోగ్యకరమైన సిద్దిపేట జిల్లాను నిర్మిద్దాం- కలెక్టర్
- డ్రగ్స్ వినియోగం, విక్రయాలపై పటిష్టం నిఘా -సిపి



**సిద్దిపేట జూన్ 25;** మనం సిద్దిపేట పట్టణ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నివారణక ర్యాలీ, అవగాహన సదస్సు గురువారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ కే హైమావతి, సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ తో కలిసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె హైమావతి మాట్లాడుతూ యువత క్రమశిక్షణతో మెలుగుతూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండి విద్య, ఉపాధి, లక్ష్యసాధనపై దృష్టి సారించాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రయోజనాలను వివరించి మాదకద్రవ్యాల అలవాటు వల్ల ఏకాగ్రత మరియు క్రమశిక్షణ లోపించడం, ఆరోగ్య సమక్షలు, విద్యా ప్రగతిపై ప్రతికూల ప్రభావం నేరాలు మరియు హింసాత్మక సంఘటన పెరగడం కుటుంబ మరియు సామాజిక విలువలు దెబ్బ తినడం వల్ల దుష్పరిణామాలు ఏర్పడతాయని వివరించి యువత మాదపద్రవాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎవరైనా డ్రగ్స్ అమ్ముతున్నారని తెలిసినా, కొనుగోలుచేస్తున్నారని తెలిసినా వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. సిద్దిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డి అడిక్షన్ సెంటర్ కూడా అందుబాటులో ఉందని తెలిపారు. డ్రగ్స్ రహిత సిద్దిపేట జిల్లా నిర్మాణానికి అందరూ సహకరించాలని మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, డ్రగ్స్ రహిత సమాజం కోసం అందరు కృషి చేయాలని అన్నారు.

కమిషనర్ ఆఫ్ పోలీస్ సాధన రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం మరియు విక్రయాలు జరగకుండా పోలీస్ శాఖ నిఘా ఉంచిందని, మాదకద్రవ్యాలను తీసుకున్నా లేదా విక్రయించిన పోలీస్ శాఖ చట్టపరంగా చర్యలు తీసుకుంటుందని విద్యార్థులు మరియు యువత జాగ్రత్తగా ఉండి ఎలాంటి మాదకద్రవ్యాలకు అలవాటు పడరాదని, మాదకద్రవ్యాలకు సంబంధించి ఏదైనా సమాచారం అంటే పోలీస్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. నష ముక్త్ భారత్ సప్తహ్ - మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణాకు ను నిర్మూలించడంపై నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన మరియు ఇతర అవగాహన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మరియు పోలీస్ కమిషనర్ బహుమతులు ప్రధానం చేశారు. అంబేద్కర్ చౌరస్తాలో విద్యార్థులు మానవహారం ఏర్పడి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సామూహిక ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శారద, జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాము, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థినిలు మరియు బాలుర కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు

# ఎస్.ఐ.ఆర్. ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలి

**ఇంటింటికీ వెళ్ళి ప్రతి ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారాలు అందించాలి**

**కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బీఎల్ఓకు ఎన్యుమరేషన్ ఫారమ్ను అందజేసిన కలెక్టర్**



**ఖమ్మం, జూన్ 25(మనం బ్యూరో):** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా జూన్ 25 నుంచి జూలై 24 వరకు నిర్వహించే హౌస్-టు-హౌస్ ఎన్యుమరేషన్ ప్రక్రియ అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. గురువారం ప్రారంభమైన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఖమ్మం నగరం 46వ డివిజన్లోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బీఎల్ఓ జిల్లా కలెక్టర్కు వ్యక్తిగత ఎన్యుమరేషన్ ఫారమ్ను అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్వయంగా ఫారమ్లో వివరాలు నమోదు చేసి అధికారులకు తిరిగి సమర్పించారు. ఎస్ఐఆర్ కార్యక్రమ నిర్వహణ, ఫారమ్ల పంపిణీ, సేకరణ విధానాలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి అర్హత గల ఓటరును గుర్తించి, వారి వివరాలను సక్రమంగా నమోదు చేయడం ద్వారా పారదర్శకమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఎన్నికల సంఘానికి క్షేత్రస్థాయి ప్రతినిధులుగా వ్యవహరిస్తారని, వారి పని తీరుపైనే ఈ కార్యక్రమం విజయవంతం ఆధారపడి ఉంటుందని అన్నారు. ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసే సమయంలో ప్రజలకు తలెత్తే సందేహాలను నివృత్తి చేస్తూ, కార్యక్రమంపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు కొనసాగనున్న ఈ కార్యక్రమంలో మొదటి నాలుగు నుంచి ఐదు రోజులలోపు ప్రతి ఇంటికి ఎన్యుమరేషన్ ఫారమ్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఫారమ్లను అందజేసే సమయంలో వాటిని పూర్తి చేసి సిద్ధంగా ఉంచాలని కుటుంబ సభ్యులకు తెలియజేయాలని, తదుపరి సందర్శనలో వాటిని సేకరిస్తామని స్పష్టం చేయాలని చెప్పారు. ఫారమ్లు సమర్పించని పక్షంలో సంబంధిత వ్యక్తుల పేర్లు డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో కనిపించవని ప్రజలకు స్పష్టంగా వివరించాలని సూచించారు. నిరక్షరాస్యులు, వృద్ధులు, దివ్యాంగులు లేదా ఫారమ్లు స్వయంగా నింపలేని వారికి బీఎల్ఓలు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి ఓటరుకి తప్పని సరిగా ఎన్యుమరేషన్ ఫారమ్ అందేలా చూడాలని, ఇంట్లో లేని సందర్భాల్లో కనీసం మూడు సార్లు సందర్శించి ఫారమ్ అందించే ప్రయత్నం చేయాలని సూచించారు. ఫారమ్ పంపిణీ జరిగినట్లు రసీదు లేదా ఇతర ఆధారాలు భద్రపరచుకోవాలని తెలిపారు. 2002 ఓటరు జాబితాలో ఇప్పటికే పేరు ఉన్న అర్హులైన ఓటర్ల నుంచి ఈ దశలో ఎలాంటి సహాయక పత్రాలు తీసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ఓటరు జాబితాను 2002 జాబితాతో మ్యాపింగ్ చేసి, వివరాలు ధృవీకరించి సంతకం తీసుకుంటే సరిపోతుందని తెలిపారు. జూలై 31న ప్రచురించే డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో ఎన్యుమరేషన్ ఫారమ్లు సమర్పించిన వారి పేర్లు మాత్రమే ఉంటాయని, ఫారమ్లు ఇవ్వని వారి పేర్లు జాబితాలో కనిపించకపోవచ్చని అన్నారు. పట్టణ ప్రాంతాల్లో నివాసం మారిన వారు, అద్దె ఇళ్లలో నివసిస్తున్న వారు, కొత్తగా వచ్చిన నివాసితుల వివరాలను ప్రత్యేకంగా నమోదు చేయాలని సూచించారు. ఇతర నియోజక వర్గాల్లో ఓటర్లుగా ఉన్నవారిని ఫారమ్-8 ద్వారా ఓటు బదిలీ చేయించే చర్యలు చేపట్టాలని తెలిపారు. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి అర్హుడికి ఫారమ్-6 అందించి కొత్త ఓటరుగా నమోదు చేయాలని ఆదేశించారు. ఎవరైనా ఓటరు మరణించినట్లు, నివాసం మార్చుకున్నట్లు లేదా అక్కడ నివసించడం లేదని సమాచారం వచ్చినప్పుడు తగిన ఆధారాలు, స్థానికుల వాంగ్మూలాలు నమోదు చేయాలని, సరైన ధృవీకరణ లేకుండా ఏ ఓటరు పేరును తొలగించరాదని స్పష్టం చేశారు. ఓటరు జాబితా సవరణలో పారదర్శకత, నిష్పాక్షికత తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొంటున్న బీఎల్ఓలు, సూపర్వైజర్లు, ఏఈఆర్వోలు, ఈఆర్వోలు, రాజకీయ పార్టీల బీఎల్ఏలు రాబోయే మూడు నెలలపాటు ఈ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించి పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి అర్హుడైన ఓటరుని చేరుకుని వారి వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండేలా ఈఆర్వోలు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, ఫారమ్ల పంపిణీ నుంచి సేకరణ వరకు ప్రతి దశలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. బీఎల్ఓలు తమ సాధారణ విధులతో పాటు ఎన్నికల సంఘం నిర్దేశించిన ఎస్ఐఆర్ బాధ్యతలను కూడా సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్వోలు, బీఎల్ఓలు, బీఎల్ఏలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు
- ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి
- క్రిటికల్ కేర్ భవనం పనులు వేగవంతం చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలి
- రోగులకు మెరుగైన సేవలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు





**ఖమ్మం, జూన్ 25(మనం బ్యూరో):** ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించిన మంత్రి ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, వైద్య సదుపాయాలు, పరిశుభ్రత, ఔషధాల లభ్యత, వైద్యులు, సిబ్బంది పనితీరు, తదితర అంశాలపై వైద్య అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వారి సహాయకులతో నేరుగా మాట్లాడి అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ₹మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగి, వారి సహాయకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించేలా ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సూచించారు. ఖమ్మం జిల్లా ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ భవనం పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ను ఆదేశించారు. భవనం ప్రారంభోత్సవానికి ముందే ఆసుపత్రి ప్రాంగణంలో పారిశుధ్య నిర్వహణను మరింత పటిష్ఠం చేయాలని, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆసుపత్రికి వచ్చే ప్రధాన రహదారికి ఇరువైపులా ఆకర్షణీయమైన మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మంత్రి సూచించారు. ఆసుపత్రి ప్రాంగణంలో ఎక్కడా చెత్తాచెదారం లేకుండా పరిశుభ్ర వాతావరణం ఉండాలని, అంతర్గత రహదారులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచి గుంతలు లేకుండా అవసరమైన మరమ్మతులు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆసుపత్రుల్లో ప్రతి రోగి సంతృప్తి చెందే విధంగా సేవలు అందించాలని మంత్రి అన్నారు. అనంతరం ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఖమ్మం నియోజకవర్గంలోని విడివోస్ కాలనీలో కొనసాగుతున్న ఓటరు మ్యాపింగ్ ప్రక్రియను మంత్రి పరిశీలించారు. ఇంటింటి సర్వే, వివరాల నమోదు ప్రక్రియ పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకుని, బంధనలకు అనుగుణంగా పారదర్శకంగా, వేగవంతంగా కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు.అర్హులైన ప్రతి ఓటరు వివరాలు జాబితాలో నమోదయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీ సందర్భంగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాల్ల దుర్గాప్రసాద్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. నరేందర్, వైద్య శాఖ అధికారులు, వున్నారు.

# ఉద్యోగం ఇప్పిస్తానని మోసం
# ఆరు లక్షలు వసూలు




**న్యాయం చేసి డబ్బులిప్పించాలని బాధితుల వేడుకోలు**

**ఖమ్మం, జూన్ 25(మనం న్యూస్):** అబ్రాడ్లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి ఆరు లక్షల వరకు వసూలు చేసి, ఇప్పుడు ఇష్టం వచ్చినట్లు చేసుకోండంటూ బెదిరిస్తున్న సలీం అనే వ్యక్తిపై చర్యలు తీసుకుని డబ్బులు ఇప్పించాలని బాధితుడు సోందుమియా ఆవేదన వ్యక్తం చేశాడు. ఖమ్మం ప్రెస్క్లబ్లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖమ్మం దానవాయిగూడెంకు చెందిన ఇమామ్ కొడుకు సలీం కువైట్లో ఉద్యోగం చేస్తున్నాడని, తమకు తెలిసిన ఏజెన్సీకి డబ్బులు చెల్లిస్తే అబ్రాడ్ వెళ్లవచ్చని నమ్మబలికినట్లు తెలిపారు. తన అల్లుళ్లకు ఉద్యోగం వస్తుందనే ఆశతో సలీం చూపించిన కన్సల్టెన్సీ వారి ఖాతాకు తన సతీమణి పేరుతో ఎస్బిఐ బ్యాంక్ నుండి దఫాల వారీగా గబుదాబీ కమర్షియల్ బ్యాంక్ ఖాతా నెంబర్ ఏఇ310030000499477208001కు ఇద్దరికి చొప్పున ఆరు లక్షలు చెల్లించినట్లు తెలిపారు. ఆరు నెలలైనా ఉద్యోగం ఇవ్వక పోవడంతో తమ డబ్బులు ఇవ్వాలని అడుగగా తనకు ఇవ్వలేదు, కన్సల్టెన్సీ వారిని అడగండి అంటూ బెదిరిస్తున్నాడని తెలిపారు. కన్సల్టెన్సీ వారిని అడుగగా తమకేం సంబంధం లేదని, సలీంను అడగాలని చెప్పినట్లు తెలిపారు. ఇటీవలనే సలీమ్ ఖమ్మం వచ్చాడని, తాము నిలదీయగా మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండంటూ బెదిరింపు ధోరణితో మాట్లాడాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై అర్బన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తమను మోసం చేసిన సలీమ్తో పాటు అతని తండ్రి ఇమామ్పై చర్యలు తీసుకుని తమ డబ్బుల్ని తమకు ఇప్పించాలని వేడుకున్నాడు. లేకుంటే తనకు చావే గతి అని, తాను వడ్డీకి అప్పు తెచ్చి డబ్బులు ఇచ్చినట్లు వాపోయాడు. ఈ సమావేశంలో సోందుమియా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్కు రక్షణ పునరుద్ధరించాలి

**కోదాడ, జూన్ 25(మనం న్యూస్):** ప్రజల పక్షాన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రిటైర్డ్ అదనపు డీజీపీ, మాజీ గురుకులాల కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కు రక్షణ తొలగించడం బాధాకరమని కత్తి నాగబాబు అన్నారు. దేశ రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించిన మాజీ అదనపు డీజీపీకి రక్షణ తొలగించడం ప్రభుత్వాల కక్షపూరిత వైఖరికి నిదర్శనమని ఆయన అన్నారు. గురుకులాల కార్యదర్శిగా పనిచేసిన సమయంలో డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని కొనియాడారు. వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపారని తెలిపారు. ముఖ్యంగా గిరిజన విద్యార్థిని మాలావత్ పూర్ణను ఎవరెస్ట్ శిఖరం అధిరోహించేలా ప్రోత్సహించడం ద్వారా భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటారని పేర్కొన్నారు. అలాగే సాధన్పల్లి ఆనంద్ తో పాటు అనేక మంది విద్యార్థులు ఐఐటీలు, మెడిసిన్, ఇంజినీరింగ్, రక్షణ రంగాల్లో రాణించేలా మార్గనిర్దేశం చేశారని గుర్తుచేశారు. కరీంనగర్ జిల్లా రుక్మాపూర్ సైనిక్ స్కూల్ ద్వారా పలువురు విద్యార్థులు సైన్యం, వైద్య, సాంకేతిక రంగాల్లో ఉన్నత స్థానాలకు చేరుకున్నారని వివరించారు. ఇలాంటి గొప్ప సేవలు చేసిన నాయకుడికి రక్షణ తొలగించడం సరైన చర్య కాదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పునరాలోచించి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కు భద్రతను పునరుద్ధరించాలని కత్తి నాగబాబు డిమాండ్ చేశారు. ప్రజలు, విద్యార్థులు, మేధావులు, కార్మికులు, రైతుల ఆయనకు అండగా ఉంటారని ఆయన పేర్కొన్నారు.

# సర్పై కాంగ్రెస్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి



**దమ్మపేట, జూన్ 25(మనం న్యూస్) :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్ ప్రక్రియపై ప్రతి కాంగ్రెస్ బూత్ లెవల్ ఏజెంట్ బి ఎల్ ఏ.లు పూర్తి అవగాహనతో పనిచేయాలని అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా వారు ఒక ప్రకటనలో తెలియజేస్తూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, (బిఎల్ ఏ) లు అప్రమత్తంగా ఉండాలని (ఏఈ) సాంకేతికతతో భారీగా ఓట్ల చోరీకి పాల్పడే అవకాశం ఉందని ప్రతీ బూత్లో బి ఎల్ ఓ తో పాటుగా ముఖ్య నాయకులను అనుసంధానం చేసుకోవాలని ఓటరు జాబితాలో పేరు ఉందో లేదో క్షుణ్ణంగా పరిశీలించాలని. తప్పులు ఉంటే క్లెయిమ్ లేదా అభ్యంతరం దాఖలు చేయాలని ప్రతీ బూత్ నందు నిరంతర పర్యవేక్షణ అవసరం అని ఎన్యూమరేషన్ ఫారంను అత్యంత జాగ్రత్తగా పూర్తిచేసి సమర్పించాలని ఆయన పిలుపు నిచ్చారు.

# గ్రామ స్థాయి నుంచే అభివృద్ధికి నాణ్యమైన ప్రణాళికలు రూపొందించాలి: జిల్లా కలెక్టర్ అంకిత్

- సమగ్ర గ్రామాభివృద్ధికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలి



**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 25 (మనంప్రతినిధి):** గ్రామ స్థాయిలో ప్రజల అవసరాలు, మౌలిక సదుపాయాలు, స్థానిక సమస్యలను గుర్తించి నాణ్యమైన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని, గ్రామాల సమగ్రాభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. గురువారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విద్యచందన , జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి నాగలక్ష్మి, డి ఆర్ ఓ పద్మావతి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)పై ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లకు ఒక రోజు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రజా అవసరాలు, ప్రజా సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని అన్ని శాఖల సమన్వయంతో పనిచేస్తూ సమర్థవంతమైన అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. గ్రామసభల ద్వారా ప్రజల అవసరాలు, సమస్యలను గుర్తించి వాటికి ప్రాధాన్యతనిస్తూ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జి పి డి పి), పంచాయతీ అడ్వాన్స్ ఇండికేటర్స్ (పి ఎ ఐ), పీఏఐ సూచికలను జీపీడీపీతో అనుసంధానం చేయడం ద్వారా నాణ్యమైన గ్రామాభివృద్ధి ప్రణాళికలను రూపొందించే విధానంపై విస్తృతంగా అవగాహన కల్పించారు. అలాగే 16వ ఆర్థిక సంఘం మార్గదర్శకాలు, పెసా గ్రామ పంచాయతీలు, సభాసర్, నిర్ణయ్ యాప్, ఈ-గ్రామ స్వరాజ్ పోర్టల్ వినియోగంపై వివరించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, మౌలిక సదుపాయాల కల్పన, ప్రభుత్వ పథకాల సమర్థ అమలు, పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. గ్రామ పంచాయతీలు ఉత్తమ పనితీరు కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. ఈ ఓరియంటేషన్ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి విద్యచందన, పంచాయతీ కార్యదర్శి ఎం. సాయి, ఎంపీడీఓ సంకీర్త్, ఎంపీఓ వీరారెడ్డి, ఎంపీఓ సంధ్య శిక్షకులుగా పాల్గొని వివిధ అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో సంబంధిత జిల్లా అధికారులు, కొత్తగూడెం, భద్రాచలం డివిజన్ల డీఎల్పీఓలు, అన్ని మండలాల ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులను ఎదుర్కొనేదెలా ?



- వైద్యశాఖలో భారీగా సిబ్బంది కొరత
- రెండు పిహెచ్సిలలో 23 పోస్టులు ఖాళీ
- రెండవ ఏఎన్ఎంలతోనే సరి
- వ్యాదులు ప్రభలే వేళ.. ఇలా అయితే ఎలా ?

**చర్ల, జూన్ 25 (మనం న్యూస్) :** సీజనల్ వ్యాధుల మహమ్మరి ముంచుకొస్తున్న వేళ వైద్య ఆరోగ్య శాఖను సిబ్బంది కొరత వేధిస్తోంది. వైద్యుల నుండి కింది స్ధాయి సిబ్బంది వరకు భారీగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మండలంలోని చర్ల, సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో 23 పోస్టులు ఖాళీగా ఉండటంతో గ్రామీణులకు వైద్యం అందేనా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

గ్రామీణ ప్రాంతాల ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కీలకపాత్ర పోషిస్తున్న విషయం విదితమే. పిహెచ్సి వైద్యులు, సిబ్బంది నిత్యం గ్రామీణ ప్రాంతాలలో పర్యటనలు చేస్తూ వారి బాగోలు చూసుకుంటారు. ఇందుకు గాను చర్ల మండలంలో చర్ల(కొయ్యూరు), సత్యనారాయణపురం ప్రాదమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఈ వైద్య కేంద్రాల క్రింద 12 హెల్త్ సబ్ సెంటర్లను ఏర్పాటు చేసి సుమారు 45 వేల మందికి వైద్య సేవలను అందచేస్తున్నారు. ఇంతటి ప్రాదాన్యతగల ప్రాదమిక ఆరోగ్య కేంద్రాలను వైద్యులు, సిబ్బంది కొరత వేధిస్తోంది. రెండు వైద్యశాలలో నలుగురు వైద్యులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఒక్కొక్క వైద్యులతోనే నెట్టుకొస్తున్నారు. ఇటీవల పలువురు వైద్యులు ఇన్ సర్వీస్ లో ఉన్నత చదువులను వెళ్లడంతో వైద్యుల కొరత ఏర్పడింది. వైద్యశాఖలో కీలకపాత్ర పోషించే ఏఎన్ఎం ల కొరత మరింత కలవరపాటుకు గురిచేస్తోంది. రెండు వైద్యశాలలో కలపి 12 మంది మొదటి ఏఎన్ఎం లు ఉండాల్సి ఉండగా కేవలం ముగ్గురు మాత్రమే ఉన్నారంటే పరిస్దితి ఎంత దారుణంగా ఉందో అర్ధం చేసుకోవచ్చు. మిగిలిన తొమ్మిది సబ్ సెంటర్లను రెండవ ఏఎన్ఎం లతో నడిపిస్తున్నారు. ఏఎన్ఎం లు గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలను అందచేయడంతో పాటు ప్రతి బుధ, శనివారాలలో 13 రకాల వ్యాదులకు సంబంధించిన టీకాలను చిన్నారులకు వేయాల్సి ఉంటుంది. మరో వైపు ఎన్ హెచ్ ఎం, ఎన్ ఆర్ హెచ్ ఎం, లెప్రసీ, పల్స్ పోలియో వంటి కీలక జాతీయ కార్యక్రమాలతో వీరు తీరిక లేకుండా ఉంటున్నారు. ఈ కార్యక్రమాలను ఆన్ లైన్ ద్వారా ఉన్నతాధికారులకు పంపాల్సి ఉంటుంది. గర్భిణి స్త్రీల నమోదు, వారికి ప్రతి నెల సబ్ సెంటర్, వైద్యశాలలో క్లినిక్ లను నిర్వహించి సేవలందించాల్సి ఉంటుంది. జ్వరాల విజృంభన సమయంలో ర్యాపిడ్ ఫీవర్ ఇంటింటి సర్వేలు, డ్రైడే ఫ్రైడే, గ్రామాలలో అవగాహనా సదస్సులు, వైద్యశిభిరరాలను నిర్వహించాల్సి ఉంటుంది. ఇంతటి పనిభారం ఉండటంతో ప్రతి సబ్ సెంటర్ లో తప్పనిసరిగా ఇద్దరు ఏఎన్ఎం లు ఉండాలి. కాని దానికి విరుద్దంగా ఒక్కరేసి ఉండటం అందునా రెండవ ఏఎన్ఎం ఎక్కువగా ఉండడంతో పనిభారం పెరిగి గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అంతంత మాత్రంగానే సేవలు అందుతున్నాయి. కొయ్యూరులో వీరిని పర్యవేక్షించే ఒక ఫిమేల్ సూపర్ వైజర్ పోస్టు ఖాళీగా ఉంది. ఏఎన్ఎం ల కొతర కారణంగా భారమంతా ఆశా కార్యకర్తలపైనే పడుతోంది. ఏ కార్యక్రమం చేపట్టినా ఆశాల ద్వారానే చేయాల్సి వస్తోంది. ఒక విదంగా చెప్పాలంటే నేడు వైద్యశాఖను ఆశా కార్యకర్తలే నడిపిస్తున్నారన్నది నిజం. మలేరియా జ్వరాలను అదుపు చేయడంతో కీలకపాత్ర పోషించే మేల్ హెల్త్ అసిస్టెంట్ పోస్టుల పరిస్దితి కూడా ఇదే విదంగా ఉంది. చర్ల పి హెచ్ సి పరిదిలో నాలుగు పోస్టులకు గాను చర్ల అర్బన్, రైస్ పేట సెంటర్లు, సత్యనారాయణపురం వైద్యశాల పరిదిలో నాలుగు సెంటర్లకు గాను తేగడ పోస్ట్ తో పాటు వీరిని పర్యవేక్షించే మేల్ సూపర్ వైజర్ పోస్ట్ ఖాళీగా ఉంది. వీటితో పాటు చర్ల (కొయ్యూరు) పి హెచ్ సి లో ఒక స్టాఫ్ నర్స్, హెచ్ ఈ వో, డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులు, సత్యనారాయణపురం వైద్యశాలలో డిపిఎంవో, పిహెచ్ఎన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గత కొంత కాలంగా ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖలోని పోస్ట్ లను భర్తీ చేయకపోవడంతో ఈ పరిస్దితి తలెత్తింది. మారుమూల అటవీప్రాంత గ్రామాలలో అంతంత మాత్రంగానే అందే వైద్యసేవలు భారీ ఖాళీల కారణంగా మరింత దారుణంగా మారే పరిస్దితులు ఆందోళన కలిగిస్తోంది. వర్షాలు అదికంగా కురిసి వ్యాదులు ముసురుకునే సమయంలో ఇదే విదంగా ఖాళీలు ఉంటే సాదారణ జనం భారీ మూల్యం చెల్లించక తప్పదు. ఇటువంటి పరిస్దితులు తకెత్తకముందే ప్రభుత్వం ఖాళీగా ఉన్న వైద్యులు, ఇతర పోస్టులను భర్తీ చేసి గ్రామీణుల ప్రాణాలను కాపాడాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం వెంటనే ఖాళీ పోస్టులను భర్తీచేసి తమ ప్రాణాలను రక్షణ కల్పించాలని ఏజెన్సీ ప్రజానీకం కోరుకుంటోంది.

**వ్యాధులను సమర్ధవంతంగా ఎదుర్కొంటాము: డాక్టర్ హారిక, చర్ల పి హెచ్ సి వైద్యురాలు**

సిబ్బంది కొరత ఉన్నమాట వాస్తవమే. సిబ్బంది కొరత అధిగమించేందుకు ప్రణాళికలు రూపొందించాము. వ్యాదులను సమర్థవంతంగా ఎదుర్కొంటామనే నమ్మకం ఉంది. సిబ్బందిని మూడు విభాగాలుగా విభజించాము. ఏఎన్ఎం లు ఇమ్మ్యునైజేషన్ లేని రోజులలో ఆశా కార్యకర్తలతో కలసి గ్రామాలలో వైద్యశిభిరాలను నిర్వహిస్తారు. ఎంఎల్ హెచ్పి లు కూడా ఆశా కార్యర్తల సహకారంతో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తారు. మేల్ హెల్త్ అసిస్టెంట్ ఆశాల సహకారంతో క్యాంపులు నిర్వహిస్తారు. ఇందుకు గాను రోస్టర్ విధానంలో డ్యూటీలు వేసాము. వ్యాదుల తీవ్రత ఎక్కువగా ఉన్న గ్రామాలను గుర్తించి వెంటనే వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తాము. సబ్ సెంటర్ కు ఒక వాట్సాఫ్ గ్రూపును రూపొందించి రోజువారీ చేసిన కార్యక్రమం వివరాలను గ్రూపులో పెట్టేలా చర్యలు చేపట్టాము.

# ప్రతి ఓటు పదిలం..ప్రతి గడప సందర్శనం!!

- **ప్రజాస్వామ్య పవిత్ర ఓటు పర్యవేక్షణలో...పరుగులు పెట్టింది!!**
- **మహబూబ్నగర్ జిల్లా అడిషనల్ కలెక్టర్ జెఎల్.బి.హరి ప్రియ.**



**ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 25 (మనం బ్యూరో):** స్థానిక మండల పరిధిలోని ముచ్చర్లపల్లి గ్రామంలో గురువారం స్థానిక తహసిల్దారు యూసఫ్ అలీ అధ్యక్షతన సర్ ఓటరు నమోదు కార్యక్రమం లాంఛనప్రాయంగా నిర్వహించుకోవడం ప్రత్యేక విశేషం.ఈ సర్ ఓటరు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మహబూబ్నగర్ అడిషనల్ జిల్లా కలెక్టర్ హరిప్రియ పర్యవేక్షణ చేస్తూ,సంబంధిత అధికారులను అప్రమత్తం చేస్తూ దిశా నిర్దేశం చేశారు.ఈ నేపథ్యంలో వ్యాఖ్యానిస్తూ...75 జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి అదనపు కలెక్టర్ ముచ్చర్లపల్లి గ్రామాలో డోర్..టు..డోర్ ఎనిమరేషన్ ఫామ్ ఈ ఎఫ్ పంపిణీ కార్యక్రమాన్ని స్వయంగా పరిశీలించారు.ప్రతి గడపగడపకు గురువుగా,ఏ ఈ ఆర్ ఓ,బి ఎల్ ఓ లు,బి ఎల్ ఈ,లతో కలిసి,ఇంటింటికి వెళ్లి ఫారంల పంపిణీ తీరును క్షుణ్ణంగా పరిశీలించారు.'ప్రతి పేరు పదిలం ప్రతి ఓటు పకడ్బందీ.'అనే సిద్ధాంతంతో పనిచేయాలని,బూత్ లెవెల్ అధికారులకు మార్గ నిర్దేశం చేశారు.ఓటర్ జాబితా అంటే,ఆ గ్రామ అభివృద్ధికి పునాది అని,అందులో చిన్న పొరపాటు కూడా చోటు చేసుకోకూడదని,ప్రతి బిఎల్వోలు శ్రద్ధగా శ్రమించి,ప్రతి గడపను తట్టి,ప్రతి పౌరుడు వివరాలు సేకరించాలని అన్ని నదించారు.ఫారాలను నింపే విధానం.ప్రజలకు ఇస్తున్న అవగాహన చూసి,అడిషనల్ కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.చిత్తశుద్ధితో చేసే చిన్న పనికి చిరస్థాయి కీర్తి అంటూ,అధికారుల చిత్తశుద్ధిని అభినందించడం జరిగింది.ఓటరు జాబితా నిర్దోషంగా రూపొందించేలా అందరూ అంకితభావంతో కృషి చేయాలని ఆకాంక్షించారు.బూతు లెవల్ అధికారులను ఉద్దేశించి అడిషనల్ కలెక్టర్ ప్రస్తావించిన తీరు అధికారులకు మణిహారాలుగా మారాయి.మీ చేతిలో ఉన్నది చిన్న కాగితం కాదు,అది ఒక పౌరుడి గళం,ఓటు లేనిదే గతి లేదు,ఓటు లేనిదే గొంతు లేదు,శ్రద్ధగా శ్రమించి సరిగ్గా నమోదు చేయండి అంటూ,ప్రతి పేరు పదిలంగా ప్రతి వివరం పకడ్బందీగా ఉండాలి అని,చిన్న పొరపాటు,చిరకాల దోషం అవుతుందని అధికారుల్లో చైతన్యా నింపారు.మీరు రాస్తున్నది,అక్షరాల సమూహం కాదు,ఓ గ్రామ భవిత అని అభివర్ణించారు.అధికారుల అంకితభావం,ప్రజల అవగాహన రెండు కలిస్తేనే,సంపూర్ణ సవరణ సాధ్యమైతదని కీర్తికరించారు.ఈ సర్ శుభదినాన్ని, సద్వినియోగం చేసుకొని ముచ్చర్లపల్లి గ్రామాన్ని మోడల్ గ్రామంగా తీర్చిదిద్దుకుందామంటూ పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వినిత ధర్మేంద్ర రెడ్డి,గ్రామ ప్రజలు,పంచాయతీ అధికారి బాలస్వామి,ఎమ్మార్పీఎస్ మండల అధ్య క్షుడు రాధాకృష్ణ,ఆలకుంట లక్ష్మణ్, జంగయ్య, యువకులు, వృద్ధులు, పాల్గొనడం జరిగింది.

# జడ్చర్ల యువత భవిష్యత్తుకు బంగారు బాట..!

**రూ.42 కోట్ల అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్కు శంకుస్థాపన**

**ఉపాధి విప్లవానికి నాంది పలికిన మంత్రి వివేక్ వెంకటస్వామి - ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**



**ఉమ్మడి మహబూబ్నగర్ నగర్ జూన్ 25 (మనం బ్యూరో):** మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గ అభివృద్ధి చరిత్రలో మరో స్వర్ణాధ్యాయం ఆరంభమైంది. వేలాది మంది యువత భవిష్యత్తును తీర్చిదిద్దే అత్యంత ప్రతిష్ఠాత్మక అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (అఠీఇ) నిర్మాణానికి రాజాపూర్ మండలం రంగారెడ్డిగూడలో రూ.42 కోట్ల వ్యయంతో శంకుస్థాపన జరిగింది. రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు మరియు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి కలిసి ఈ భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, 'తెలంగాణ యువతను ప్రపంచ స్థాయి పోటీతత్వానికి సిద్ధం చేయడమే ప్రభుత్వ లక్ష్యం. నేటి ఉద్యోగ ప్రపంచంలో డిగ్రీల కంటే నైపుణ్యాలకే అధిక ప్రాధాన్యత ఉంది. అందుకే యువతకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు అందించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం' అని పేర్కొన్నారు. నిరుద్యోగ సమస్యకు శాశ్వత పరిష్కారం వైపు అడుగు నైపుణ్యాభివృద్ధి ద్వారానే నిరుద్యోగ సమస్యకు శాశ్వత పరిష్కారం సాధ్యమని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఆధునిక శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేస్తూ యువతకు ఉద్యోగాలు, స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. జడ్చర్లలో నిర్మించనున్న ఈ అఠీఇ భవిష్యత్తులో వేలాది మంది యువతకు అత్యాధునిక శిక్షణ అందించి ఉపాధి అవకాశాలకు వారధిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జడ్చర్లకు కొత్త గుర్తింపు ఇప్పటివరకు పరిశ్రమలు, జాతీయ రహదారులతో గుర్తింపు పొందిన జడ్చర్ల, ఇకపై నైపుణ్యాభివృద్ధి మరియు సాంకేతిక శిక్షణకు కేంద్రబిందువుగా మారనుంది. రూ.42 కోట్లతో నిర్మితమవుతున్న ఈ ఆధునిక కేంద్రం పూర్తయితే జడ్చర్ల యువతకు ప్రపంచ స్థాయి శిక్షణ, అంతర్జాతీయ ప్రమాణాల ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. యువతలో భారీ ఉత్సాహం శంకుస్థాపన అనంతరం మంత్రి, ఎమ్మెల్యే ప్రాజెక్టు నమూనాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. సభా ప్రాంగణం జనసంద్రంగా మారగా, యువతలో ఈ ప్రాజెక్టుపై విశేష ఉత్సాహం కనిపించింది. ఉపాధి విప్లవానికి నాంది 'జడ్చర్ల యువతకు ఇక ప్రపంచ స్థాయి అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. రూ.42 కోట్ల అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ఉపాధి విప్లవానికి నాంది పలుకుతోంది' అంటూ స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. యువత భవిష్యత్తును మలిచే ఈ భారీ ప్రాజెక్టు జడ్చర్ల అభివృద్ధి గాథలో చిరస్థాయిగా నిలిచే మైలురాయిగా మారనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# మాచాపురంలో మొహరం వేడుకలు



- **గంగేసి వేషంలో చిన్నార్రి**

**నందవరం జూన్ 25 మనం న్యూస్:** నందవరం మండల పరిధిలోనే మాచాపురం గ్రామంలో మొహరం వేడుకలు సందర్భంగా గంగేశాల ప్రదర్శన కనపరిచారు. గ్రామస్తులు మతాలకు అతీతంగా ప్రశాంత వాతావరణంలో మొహరం పండుగలు గంగివేషాలతో ప్రజలను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ మాకు మొహరం అంటే ఎంతో ప్రీతికా నిదర్శనమైన పండగ చాలా బాగా జరుపుకుంటామని గ్రామస్తులు తెలిపారు.

# ఎస్టీల జాబితాలో లంబాడీ, ఎరుకల, యానాది తెగల చేరికకు 50 ఏళ్లు పూర్తయింది

- **తెలంగాణ ఆదివాసి కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా బస్సు యాత్ర ప్రారంభం**
- **గిరిజనుల అభ్యున్నతి, హక్కుల పరిరక్షణ, సంక్షేమమే ప్రధాన లక్ష్యంమని నాయకుల వెల్లడి**
- **అచ్చంపేట పట్టణంలో ఎన్టీఆర్ స్టేడియం నుండి జయం జె స్కూల్ వరకు భారీ ర్యాలీ**



**ఉమ్మడి మహబూబ్ నగర్ (అచ్చంపేట), జూన్ 25 (మనం బ్యూరో):** రాష్ట్రంలో లంబాడీ, ఎరుకల, యానాది తెగలను షెడ్యూల్ ట్రైబ్స్ (ఎస్టీ) జాబితాలో చేర్చి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా తెలంగాణ ఆదివాసి కాంగ్రెస్ ఆధ్వర్యంలో గాంధీభవన్ నుంచి రాష్ట్రవ్యాప్త బస్సు యాత్రను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, గిరిజన ప్రజాప్రతినిధులు పాల్గొని గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం, రాజ్యాంగ హక్కుల పరిరక్షణపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

**అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ**

గిరిజనుల సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం, ఇందిరమ్మ రాజ్యంలో గిరిజన సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గిరిజన కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు, విద్యార్థులకు గురుకుల విద్య, హాస్టళ్లలో మెరుగైన సౌకర్యాలు, తండాలకు రహదారులు, తాగునీటి సదుపాయాలు, వైద్య సేవలు, విద్యుత్ సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. నల్లమల ప్రాంతంలోని గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని, మారుమూల తండాలకు కూడా ప్రభుత్వ సేవలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గిరిజన యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందించి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని, మహిళల ఆర్థిక సాధికారత కోసం స్వయం సహాయక సంఘాలకు చేయూత అందిస్తున్నామని తెలిపారు.

**మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ**

గిరిజన సమాజ అభ్యున్నతికి రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవడం అత్యంత ముఖ్యమన్నారు. ఎస్టీ హోదా ద్వారా వచ్చిన అవకాశాలను గిరిజన యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు.జ గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. భూమి, అడవి, నీటి హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాటం కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు.

**ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ...**

గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, భాషలు తెలంగాణ సాంస్కృతిక సంపదలో భాగమన్నారు. అభివృద్ధి ఎంత ముఖ్యమో, సంస్కృతి పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని తెలిపారు. గిరిజన యువత ఆధునిక విద్యతో పాటు తమ మూలాలను మరవకుండా ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, విద్య ద్వారా సమాజంలో శాశ్వత మార్పు తీసుకురావచ్చని పేర్కొన్నారు.

# అంతర్జాతీయ స్థాయి గ్రీన్ పోస్టర్ చిత్రలేఖన పోటీల తేదీ మార్పు



**కర్నూలు జూన్ 25మనం న్యూస్ :** జులై 21 న అసోసియేషన్ ఆఫ్ ఆలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్,నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ ల సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయి గ్రీన్ పోస్టర్ చిత్రలేఖన పోటీలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా 117 మాజీ గవర్నర్, మాజీ ఇంటర్నేషనల్ కౌన్సిల్ చైర్ పర్సన్ అల్లీ అండ్ లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు నుంచి ఎనిమిది సంవత్సరాల లోపు వారిని జూనియర్స్ గానూ తొమ్మిది నుంచి పదమూడు సంవత్సరాల వారిని సీనియర్స్ గాను పరిగణిస్తారని జిల్లా స్థాయి విజేతలకు మొదటి బహుమతి 1500 ల రూపాయలు,రెండవ బహుమతి వెయ్యి రూపాయలు మూడవ బహుమతి 700 రూపాయల తో పాటు 10 మందికి కన్సోలేషన్ బహుమతులు, పాల్గొన్న ప్రతి వక్కరికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్స్ అందజేయబడతాయన్నారు. జిల్లా స్థాయిలో ఎంపిక కాబడిన వారికి అంతర్జాతీయ స్థాయి పోటీలకు పంపించనున్నామన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఎంపిక కాబడిన వారికి ప్రథమ బహుమతి 50వేల రూపాయలు రెండవ బహుమతి 25వేల రూపాయలు మూడవ బహుమతి 5000 తో పాటు కన్సోలేషన్ బహుమతులు అంతర్జాతీయ స్థాయి గ్రీన్ అవార్డులు అందజేయబడతాయన్నారు. జిల్లాస్థాయి పోటీలు 25న ఉదయం 11 గంటలకు నిర్వహించబడతాయని ఆసక్తిగలవారు తమ పేర్లను జులై 15 వ వ తేదీలోగా వెంక టరమణ కాలనీ మొదటి లైన్ లో ఉన్న నైస్ కంప్యూటర్స్ కార్యాలయంలో నమోదు చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు 9396861308 నంబర్ ను సంప్రదించవచ్చన్నారు.

# బంగారు తాళిబొట్టు అప్పగింత



**మహానంది, జూన్25,మనంన్యూస్:** స్వామివారి దర్శనార్థమై వచ్చి ఆలయ ప్రాంగణంలో జారవిడుచుకున్న బంగారు తాళిబొట్టు చైన్ ను దేవస్థానం ఉద్యోగులు తిరిగి అప్పగించారు. గురువారం ఎమ్మిగనూరు కు చెందిన నిహారిక అనే మహిళ క్షేత్రంలో జరిగే బంధువుల వివాహానికి హాజరైంది.వినాయక నంది ఆలయ ప్రాంతంలో ఒక భక్తుడు గమనించి దేవస్థానం కార్యాలయంలో సిబ్బందికి అప్పగించారు. వెంటనే మైకులో చెప్పడంతో ఆ మహిళ టెంపుల్ కార్యాలయంలో వివరాలు తెలపడంతో సూపర్డెంట్ శశిధర్ రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ నాగ మల్లయ్య లు అప్పగించారు. భక్తురాలు, వారి బంధువులు దేవస్థానం ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రికార్డ్ అసిస్టెంట్ ఈశ్వర్,నాగరాజు తదితరులు ఉన్నారు.

# 'సీతారామ' పూర్తి చేస్తారా? లేదా?

- **గడువు పూర్తయిన నేపథ్యంలో సీఎం స్పష్టత ఇవ్వాలి**
- **2024, 2025 సంవత్సరాల రబీ రైతుభరోసా సంగతేంటి?**
- **కాంగ్రెసును ఆదరించినా ఖమ్మం జిల్లాపై నిరాదరణ**
- **8 నెలలైనా 'సామినేని' హత్యకేసు తేల్చలే..!**
- **ఖమ్మం జిల్లా విద్యారంగం ఖాళీలమయం**
- **ఏమి చేశారని రైతు, ప్రజా ఆశీర్వాదం**
- **సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు**



**ఖమ్మం, జూన్ 25(మనం బ్యూరో):** ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాబాద్ జిల్లాలోని ఏడు లక్షల ఎకరాలను సస్యశ్యామలం చేసే సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు విమర్శించారు. నిధులను వరదలా పారించి ప్రాజెక్టును 2026 పంద్రాగష్టు లోగా అందుబాటులోకి తీసుకొస్తామని 2024 వైరా సభ, సీతారామ పంప్ హౌస్ ల ప్రారంభం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చి దానిని తుంగలో తొక్కారన్నారు. ఈ నెల 30న చింతకాని మండలంలో నిర్వహించే రైతు, ప్రజా ఆశీర్వాద సభకు హాజరవుతున్న సీఎం సీతారామ ప్రాజెక్టును పూర్తిచేస్తారో లేదో? స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) పోరాట ఫలితంగానే దుమ్ముగూడెం (సీతారామ) ప్రాజెక్టు సిద్ధించిందన్నారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎంపీ తమ్మినేని వీరభద్రంతో పాటు తానూ ఈ ప్రాజెక్టు సాధనకు పాదయాత్ర చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోతినేని మాట్లాడారు. కాంగ్రెస్‌ను ఆదరించిన ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా ప్రభుత్వం జిల్లాను నిరాదరణకు గురిచేస్తోందని పోతినేని అన్నారు. రూ.18వేల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు కోసం రూ.8వేల కోట్లు ఇప్పటికే ఖర్చుపెట్టామని, ఇంకా రూ.10వేల కోట్లతో ప్రాజెక్టు రెండేండ్లలో పూర్తవుతుందని 2024లో సీఎం చెప్పిన మాటను వీడియో రూపంలో ప్రదర్శించారు. సీఎం పెట్టిన 2026 పంద్రాగష్టు గడువుకు ఇంకా నెలన్నర రోజులు మాత్రమే ఉంది... చేయగలరా? అని ప్రశ్నించారు. 2003లో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని దుమ్ముగూడెం ప్రాజెక్టు కోసం 2,600 కి.మీ పాదయాత్ర చేశారని తెలిపారు. 2012లో తాను జిల్లా కార్యదర్శిగా ఉన్నప్పుడు దుమ్ముగూడెం నుంచి పాలేరు వరకూ వెయ్యి మంది రైతులతో తాను పాదయాత్ర చేసిన విషయాన్ని ప్రస్తావించారు. కృష్ణా గోదావరి అనుసంధానం కోసం ఉద్దేశించిన సీతారామ ప్రాజెక్టు విషయంలో కృష్ణా పరివాహక ప్రాంతంలో మంత్రులు కెనాల్స్ తీస్తూ పోతే ఉపయోగం ఏంటని ప్రశ్నించారు. 124 కి.మీ పొడవున్న సీతారామ ప్రాజెక్టు కెనాల్స్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేనాటికి 104 కి.మీ పూర్తయ్యాయని చెప్పారు. 104 కి. మీ వద్ద జూలూరుపాడు, దమ్మాయిగూడెం టన్నెల్స్ పూర్తి చేస్తే గోదావరి నీళ్లు పాలేరు రిజర్వాయర్ లో కలుస్తాయన్నారు. సీతారామ ప్రాజెక్టును పూర్తి చేస్తారా? లేదా? స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ను ఆదరించిన ఖమ్మం జిల్లాలో ఓ ప్రాజెక్టు పూర్తి చేశారా? ఓ పరిశ్రమ, ఓ యూనివర్శిటీ స్థాపించారా? అని నిలదీశారు. ఏమి చేశారని రైతులు, ప్రజలు ఆశీర్వదించాలని ప్రశ్నించారు. ఎల్ నినో ఎఫెక్ట్ నేపథ్యంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్న దృష్ట్యా వేసిన పంటల్లో 30శాతం విత్తనాలు మొలకెత్తలేదన్నారు. ఈ నేపథ్యంలో గోదావరి నీళ్లు రాకపోతే ఏంటి పరిస్థితి? అని సీఎంను ప్రశ్నించారు. ఈ ఏడాది బడ్జెట్లో రూ.22వేల కోట్లు నీటిపారుదల ప్రాజెక్టులకు కేటాయిస్తే దీనిలో కేవలం రూ.360 కోట్లు సీతారామకు కేటాయించటం సిగ్గు చేటన్నారు. 2026 ఖరీఫ్ రైతుభరోసా నిధుల విడుదల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లాకు రావడాన్ని స్వాగతిస్తున్నామని పోతినేని తెలిపారు. కానీ 2024, 2025 రబీ రైతుభరోసా నిధులు ఇస్తారో... లేదో స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మరీ ముఖ్యంగా ఖమ్మం జిల్లాలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని పోతినేని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్ర రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి సామినేని రామారావు హత్య జరిగి 8 నెలలవుతున్నా ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. రామారావు హత్య జరిగిన చింతకాని మండలంలోని సభకే సీఎం హాజరవుతున్న నేపథ్యంలో ఈ సభా వేదికపై నుంచే దీనికి సమాధానం చెప్పాలని కోరారు. హత్య, దొంతనం, రేప్ ఏది జరిగినా హోంశాఖ మంత్రిగానూ ఉన్న సీఎం పట్టించుకోరా? అని ప్రశ్నించారు. ఖమ్మం జిల్లా విద్యారంగానికి ప్రభుత్వం చేసిందేంటని సుదర్శన్ నిలదీశారు. ఓ యూనివర్శిటీ నిర్మించారా? అని అడిగారు. ఖమ్మం జిల్లాలో 21 ఎంఈవో పోస్టులుంటే 19, డైట్ కళాశాలలో 13కు 13 పోస్టులు రెగ్యులర్ ఉద్యోగులు లేకుండా ఉన్నాయని తెలిపారు. ఖమ్మం జిల్లా వ్యవసాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించేలా ఆచరణయోగ్యమైన దిశగా చర్యలు ఉండాలన్నారు. జిల్లా సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమిస్తామని ముఖ్యమంత్రి, మంత్రులను హెచ్చరించారు. జవాబుదారీ ఉండేలా సీఎం ప్రకటనలు ఉండాలని కోరారు.

# ఉద్యాన పంటలపై రైతులు దృష్టి సారించాలి



**తుగ్గలి జూన్ 25(మనం న్యూస్ ):** వ్యవసాయంతో పాటు ఉద్యాన పంటలపై రైతులు దృష్టి సారించాలని ఈసీ రాజశేఖర్ అన్నారు.వీబీ జీ రామ్ జీ కార్యక్రమంలో భాగంగా రాంపల్లి గ్రామ పొలాల్లో పండ్ల మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్య అతిథి తెదేపా టిడిపి మండల అధ్యక్షులు తిరుపాల్ నాయుడు హాజరై ప్రారంభించారు.రైతులు ఉద్యాన పంటల సాగుపై ఆసక్తి చూపేలా అవగాహన కల్పిస్తూ, వారి పొలాల్లో పండ్ల మొక్కలను వారు నాటారు.ఈ సందర్భంగా ఈసీ రాజశేఖర్ మాట్లాడుతూ పండ్ల తోటల పెంపకం ద్వారా రైతులకు దీర్ఘకాలికంగా ఆదాయం లభిస్తుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకొని ఉద్యాన పంటల వైపు దృష్టి సారించాలని సూచించారు. వీబీ జీ రామ్ జీ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పచ్చదనం పెంపొందించడంతో పాటు రైతుల ఆర్థిక అభివృద్ధికి తోడ్పడేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

# ఆర్యవైశ్యులకు కూటమి ప్రభుత్వంతోనే న్యాయం

**తాడిపత్రిలో అనంతపురం జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం**

**కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి టీజీ భరత్ గుప్తా, సీనియర్ నాయకులు జె.సి ప్రభాకర్ రెడ్డి**



**కర్నూలు జూన్ 25మనం న్యూస్ :** ఆర్యవైశ్యులకు కూటమి ప్రభుత్వంలోనే పూర్తి న్యాయం జరుగుతోందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా అన్నారు. తాడిపత్రిలో అనంతపురం జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి టీజీ భరత్ గుప్తాతో పాటు మాజీ మున్సిపల్ ఛైర్మన్ జె.సి ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరి సమక్షంలో నూతన కమిటీల ప్రమాణ స్వీకారం జరిగింది. అనంతరం మంత్రి టీజీ భరత్ గుప్తా మాట్లాడుతూ నూతనంగా ఏర్పడ్డ కమిటీలు పదవులకు న్యాయం చేయాలని సూచించారు. ఇక కర్నూలు జిల్లాలో సీఎం చంద్రబాబు నాయుడు పర్యటన ఉన్నప్పటికీ ఆర్యవైశ్యుల కార్యక్రమానికి హాజరయ్యేందుకు అనుమతి తీసుకొని వచ్చినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమం గురించి చెప్పగానే సీఎం చంద్రబాబు ఆర్యవైశ్యుల కార్యక్రమానికి తప్పకుండా హాజరవ్వాలని తనతో చెప్పినట్లు మంత్రి చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్.. ఆర్యవైశ్యుల తరుపున సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.ఇక ఆర్యవైశ్యులందరూ కలిసికట్టుగా ఉండి ఐక్యత చాటుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్యవైశ్య సంస్థలన్నీ కలిసి కార్తీక వనభోజన కార్యక్రమాన్ని కలిసి కట్టుగా నిర్వహించాలన్నారు. ఐక్యంగా ఉంటే సమాజంలో గౌరవం దక్కుతుందన్నారు. తన తండ్రి టీజీ వెంకటేష్ ఆర్యవైశ్యులకు అండగా ఉంటున్నారన్నారు. వందల కోట్లు విలువ చేసే ఆస్తులు కాపాడటంలో ఆయన కీలక పాత్ర పోషించినట్లు గుర్తు చేశారు. డిసెంబర్ నెలలో బెంగుళూరులో గ్లోబల్ యాక్సిలరేటర్ విజన్ సమ్మిట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆర్యవైశ్యులందరూ ఈ సమావేశంలో పాల్గొని ఆలోచనలు పంచుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఇల్లూరు లక్ష్మయ్య, గౌరవాధ్యక్షులు చిన్ని రామ సత్యనారాయణ, ఆర్యవైశ్య సంఘం అనంతపురం జిల్లా అధ్యక్షులు సురేంద్రనాథ్ గుప్తా, తాడిపత్రి మార్కెట్ యార్డు ఛైర్మన్ భూమా నాగరాగిణి, ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి రంగనాథ్, పోతుల సురేష్, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ సిద్దా సూర్య ప్రకాష్, వాసవి సేవాదళ్ అధ్యక్షుడు శబరి వరప్రసాద్, వాసవి సత్ర సముదాయాల గౌరవాధ్యక్షులు సిద్దా నాగేశ్వరరావు, మహిళా విభాగ్ అధ్యక్షురాలు రజిని, తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచంలో ఒకేరోజు వేర్వేరు చోట్ల భూకంపాలు..



**● శాస్త్రవేత్తలు ఏమన్నారంటే..?**

**కారకస్, జూన్ 25 :** వెనెజువెలా దేశం శతాబ్దకాలంలో ఎన్నడూ చూడని ప్రకృతి విపత్తును చవిచూసింది. వెనువెంటనే రెండు శక్తిమంతమైన భూకంపాలతో ఉక్కిరిబిక్కిరైంది. తొలి భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.1గా నమోదు కాగా, రెండోది మరింత తీవ్రత (7.5)తో వచ్చింది. అదే సమయంలో కొంచెం అటూఇటుగా అమెరికాలోని కాలిఫోర్నియాలో (5.6), జపాన్ (7.2)లోనూ భూకంపాలు వచ్చాయి. ప్రపంచంలో ఒకే రోజు ఇలా వేర్వేరు చోట్ల పుడమి ఉగ్రరూపం దాల్చడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

ఈ భూకంపాల మధ్య ఏమైనా సంబంధం ఉందా..? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అయితే, దీనికి 'కాదు' అనే సమాధానం ఇస్తున్నారు కాలిఫోర్నియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన భూకంప శాస్త్రవేత్త డాక్టర్ లూసీ జోన్స్. ఈ భూకంపాలు వేర్వేరు ఫాల్ట్ సిస్టమ్స్ (ఫలకాలు కలిసే సరిహద్దులు, పగుళ్లు), ప్లేట్ బౌండరీల్లో సంభవించాయి. అంటే వాటి మధ్య సంబంధం లేదని అర్థం. ఒకదానిని మరొకటి ప్రేరేపించలేదు. ఒక చోట సంభవించే భారీ భూకంపాలు.. వేల మైళ్ల దూరంలో మరో భూకంపానికి దారితీసే అవకాశం చాలా తక్కువగా ఉంటుందని జోన్స్ వెల్లడించారు. ఇలా ఒకే సమయంలో వేర్వేరు చోట్ల భూమి కంపించడం అనేది యాదృచ్ఛికమేనని చెబుతున్నారు.

ఒక ప్రాంతంలో భూకంపం రావడమనేది అనూహ్యంగా జరిగే సంఘటన కాదు. కొన్ని దశాబ్దాలు, శతాబ్దాలుగా భూగర్భంలో ఒత్తిడి పేరుకుపోయి.. ఫలకాలు ఒకదానికొకటి రాసుకోవడం వల్ల ఇవి సంభవిస్తుంటాయి. అయితే భూకంపాలు సరిగ్గా ఎప్పుడు వస్తాయనేది అంచనా వేయడం అసాధ్యమే అయినా.. ఇలా ఒక్కసారిగా భూమి కంపించడం ఒక చక్రంలా జరిగే ప్రక్రియేనని జోన్స్ పేర్కొన్నారు.

**పుల్వామాలోనూ భూ ప్రకంపనలు..**

కాగా.. జమ్మూకశ్మీర్‌లోని పుల్వామాలో 3.5 తీవ్రతతో భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. బుధవారం సాయంత్రం నుంచి ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో భూకంపాలు రాగా గురువారం తెల్లవారుజామున పుల్వామాలో భూమి కంపించిందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ వెల్లడించింది. భూకంప కేంద్రం నేపాల్లో 15 కిలోమీటర్ల లోతున ఉన్నట్లు పేర్కొన్నారు. ఇక, జపాన్‌లో తొలుత భూకంప తీవ్రత 6.9 అని రాగా.. తర్వాత దానిని 7.2గా సవరించారు.

**వెనెజువెలాలో 'ఎర్త్‌క్వేక్ డబ్లెట్'..?**

చాలా తక్కువ వ్యవధిలో అంటే కొన్ని సెకన్ల నుంచి నిమిషాల తేడాతో దాదాపు ఒకే తీవ్రత గల రెండు భూకంపాలు ఒకే ప్రాంతంలో సంభవించడాన్ని 'ఎర్త్‌క్వేక్ డబ్లెట్' అంటారు. ఒకసారి భూకంపం వచ్చిన తర్వాత తక్కువ తీవ్రతతో చిన్న చిన్న ప్రకంపనలు రావడం సహజమే. కానీ డబ్లెట్ విషయానికొస్తే.. రెండోసారి వచ్చే భూకంపం కూడా దాదాపు మొదటిదానంత తీవ్రంగా ఉంటుంది.

ఇప్పుడు వెనెజువెలాలో 39 సెకన్ల వ్యవధిలో వరుస భూకంపాలు వచ్చాయి. దీంతో ఇప్పుడు ఈ దేశ పరిస్థితిని శాస్త్రవేత్తలు 'ఎర్త్‌క్వేక్ డబ్లెట్'గా పిలుస్తున్నారు.

**శతాబ్దం క్రితం 7.7 తీవ్రతతో..**

వెనెజువెలాలో ఈస్థాయిలో భూకంపం 1900 సంవత్సరంలో వచ్చింది. అప్పుడు దాని తీవ్రత 7.7గా నమోదైంది. దాంతో రాజధాని సమీప ప్రాంతాలు ప్రభావితమయ్యాయి. మళ్లీ 2018లో 7.3 తీవ్రతతో భూమి కంపించినప్పటికీ.. ఆస్తి, ప్రాణనష్టం ఇప్పటితో పోలిస్తే తక్కువగానే సంభవించింది.

## లక్ష వరకు మరణాలు ఉండొచ్చు

### వెనెజువెలా భూకంపాల తీవ్రతపై యూఎస్‌జీఎస్ హెచ్చరిక

**లక్ష వరకు మరణాలు ఉండొచ్చు**



**కారకస్, జూన్ 25:** వెనెజువెలా దేశాన్ని వరుసగా రెండు భూకంపాలు వణికించాయి. ఈ ప్రకృతి విపత్తు తీవ్రతకు దేశ రాజధాని కరకస్‌లోలో భారీనష్టం వాటిల్లింది. పలు బహుళ అంతస్తు భవనాలు కూలిపోయాయి. శిథిలాల కింద ప్రజలు చిక్కుకుపోయి ఉండొచ్చని, దాంతో భారీ సంఖ్యలో ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ''ఈ భూకంపాల తర్వాత బలమైన ప్రకంపనలు రావొచ్చు. దాంతో ఈ విపత్తు విధ్వంసకరంగా ఉండొచ్చు. భారీగా ప్రాణ, ఆస్తినష్టం సంభవించే అవకాశం ఉంది. మృతుల సంఖ్య 10వేల నుంచి లక్ష వరకు ఉండవచ్చు'' అని యూఎస్ జియోలాజికల్ సర్వే వెల్లడించింది. ప్రస్తుతానికి వెనెజువెలా ప్రభుత్వం మృతుల సంఖ్యపై ఎలాంటి ప్రకటనా చేయలేదు. భూకంపాల ధాటికి గాయపడిన వారి సంఖ్య పెరుగుతూనే ఉందని స్థానిక అధికారులు, ప్రత్యక్ష సాక్షులు చెప్తున్నారు.



**ఇళ్ల నుంచి బయటకు వచ్చేయండి..**

ఇళ్లను వదిలి బయటకు వచ్చేయాలంటూ భూకంపాల ప్రభావిత ప్రాంతాల ప్రజలకు వెనెజువెలా ప్రభుత్వం సూచించింది. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా ఇళ్లకున్న పెట్రోల్ సరఫరాను కట్ చేసినట్లు వెల్లడించింది. కొన్ని భవనాలు కూలిపోయాయని, మరింత నష్టం వాటిల్లకుండా ఈ చర్యలని పేర్కొంది.

**జాతీయ సెలవుదినం కావడంతో..**

జూన్ 24.. వెనెజువెలాలో నేషనల్ హాలిడే. దాంతో మిగతా రోజులతో పోలిస్తే.. ఎక్కువమంది ఇళ్లలోనే ఉన్నారు. నిన్నసాయంత్రం ఆరుగంటల సమయంలో తొలి భూకంపం వచ్చింది. దాంతో భూమి కంపించినప్పుడు భారీగా ప్రజలు బయటకు పరిగెత్తిన దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. ప్రాణనష్టం తీవ్రత పెరగడానికి ఈ హాలిడే కూడా ఒక బలమైన కారణం కావొచ్చని అధికారులు చెప్తున్నారు. ఈ విపత్తులో భారీగా మరణాల సంఖ్య ఉండొచ్చని వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ కూడా తన సందేశంలో పేర్కొన్నారు.

**20 ప్రకంపనలు.. దేశంలో ఎమర్జెన్సీ**

రెండు భారీ భూకంపాల తర్వాత 20 వరకు ప్రకంపనలు వచ్చాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో వెనెజువెలాలో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. భూకంపం ధాటికి మెక్వెషియా అంతర్జాతీయ విమానాశ్రయం దెబ్బతిన్న దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. దాంతో దానిని మూసివేశారు. పలు విమానాల రాకపోకలను నిలిపివేశారు. రాజధానితో పాటు భూకంప ప్రభావిత ప్రాంతాల్లో పాఠశాలలు మూసివేశారు.

## వెనెజువెలాలో భూకంపాలు.. క్షణాల ముందే గూగుల్ అలర్ట్



కారకస్, జూన్ 25: వందేళ్లలోనే ఎన్నడూ చూడని ప్రకృతి విపత్తుతో వెనెజువెలా దేశం అల్లాడిపోతోంది. వరుసగా రెండు శక్తిమంతమైన భూకంపాల ధాటికి అనేక భవనాలు నేలమట్టమై లక్షలాది మంది ప్రజలు వీధినపడ్డారు. కాగా.. ఈ భూకంపాలు సంభవించడానికి కొన్ని క్షణాల ముందు గూగుల్ పలు స్మార్ట్‌ఫోన్‌లకు దీని గురించి అలర్ట్‌లు పంపించినట్లు తాజాగా తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన కొన్ని స్క్రీన్‌షాట్లను నెటిజన్లు సోషల్ మీడియాలో పంచుకుంటున్నారు. బుధవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఈ అలర్ట్‌లు వచ్చినట్లు సమాచారం. ఆ తర్వాత కాసేపటికే భూకంపాలు సంభవించాయి. ఇంతకీ గూగుల్ వీటిని ఎలా గుర్తించిందంటే..?

**యాక్సిలరోమీటర్‌తో..**

అధునాతన స్మార్ట్‌ఫోన్‌లో యాక్సిలరోమీటర్ అనే పరికరం ఉంది. సాధారణంగా ఇది ఒక సెన్సార్. మీరు ఫోన్‌ను అడ్డంగా పట్టుకున్నప్పుడు స్క్రీన్‌ను ఆటోమేటిక్గా తిప్పుతుంది. అయితే, దీని వల్ల మరో ఉపయోగం కూడా ఉంది. ఈ సెన్సార్ కంపనాలను కూడా గుర్తించి కొలవగలదు. మనం ఉంటున్న ప్రాంతంలో భూమి నుంచి వెలువడే వైబ్రేషన్‌లను ఇది సేకరిస్తుంది. ఇవి భూకంపానికి దారితీసేంత బలంగా ఉంటే.. వెంటనే గూగుల్ ఆండ్రాయిడ్ ఎర్త్‌క్వేక్ అలర్ట్ సిస్టమ్‌కు సిగ్నల్ పంపిస్తుంది. సుమారుగా ఏ ప్రాంతంలో భూకంపం వచ్చే అవకాశం ఉందో కూడా చెబుతుంది.

ఒక స్మార్ట్‌ఫోన్ నుంచి ఈ సిగ్నల్ అందిన వెంటనే.. గూగుల్ సర్వర్ ఆ ప్రాంతంలోని మిగతా ఫోన్లలోని యాక్సిలరోమీటర్లను పరిశీలిస్తుంది. అత్యధిక ఫోన్లు ఇలాంటి ప్రకంపనలే గుర్తిస్తే.. వెంటనే భూకంపం వస్తుందని అంచనా వేసి ఆ ప్రాంతానికి అలర్ట్స్‌ను. ఈ ప్రక్రియ శరవేగంగా జరుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 200 కోట్ల ఆండ్రాయిడ్ ఫోన్లలో ఈ ఫీచర్ ఉన్నట్లు గూగుల్ తెలిపింది.

**భూకంపం రావడానికి ముందే..**

సాధారణంగా భూకంపం అనేది ఒక్కసారిగా వచ్చే కుదుపు కాదు. తరంగాల రూపంలో సంభవిస్తుంది. తొలుత ప్రైమరీ వేవ్స్ వస్తాయి. ఇవి సెకనుకు ఆరు కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. ఆ తర్వాత సెకండరీ వేవ్స్ వస్తాయి. ఇవి సెకనుకు 3-4 కిలోమీటర్ల వేగంతో పయనిస్తాయి. భూకంపం వల్ల జరిగే అత్యధిక నష్టానికి ఈ తరంగాలే కారణం. ఇక, మన స్మార్ట్‌ఫోన్‌లు గుర్తించేవి ప్రైమరీ వేవ్‌లను మాత్రమే. ఇవి రాగానే సర్వర్‌కు సిగ్నల్ ఇస్తాయి. అందువల్ల.. సెకండరీ వేవ్స్ రావడానికి ముందే గూగుల్ సర్వర్లు సమాచారాన్ని సేకరించి అలర్ట్ ఇవ్వడానికి సమయం లభిస్తుందని టెక్ నిపుణులు పేర్కొంటున్నారు.

**రెండు రకాల అలర్టు..**

భూకంప తీవ్రతను అంచనా వేసినదాని బట్టి.. ఆండ్రాయిడ్ ఫోన్లు రెండు రకాల అలర్ట్‌లు ఇస్తుంటాయి. ఒకటి 'బి అవేర్ అలర్ట్'. ఇది తక్కువ తీవ్రతతో ప్రకంపనలు వచ్చే అవకాశం ఉన్నప్పుడు ఇచ్చే సిగ్నల్. ఇక రెండోది 'టేక్ యాక్షన్ అలర్ట్'. మధ్యస్త, తీవ్ర స్థాయి భూకంపాల సమయంలో దీనిని జారీ చేస్తుంటుంది. దీన్ని టచ్ చేయగా.. భూకంపం వచ్చే అవకాశం ఉన్న పరిధిని చూపిస్తుంది. దీంతో పాటు విపత్తు సమయంలో సురక్షితంగా ఎలా బయటపడాలో తెలిపే కొన్ని సూచనలు చేస్తుంది.

భారత దేశంలోనూ 2023 నుంచి ఆండ్రాయిడ్ ఎర్త్‌క్వేక్ అలర్ట్ సిస్టమ్ యాక్టివ్‌లో ఉంది. ఆండ్రాయిడ్ 5 అంతకంటే ఆధునిక వెర్షన్లలో ఈ ఫీచర్ ఉంది. అయితే, అలర్ట్‌లు రావాలంటే తప్పనిసరిగా ఫోన్‌లో మొబైల్ డేటా లేదా వైఫై ఆన్ చేసి ఉండాలి. ఒకవేళ ఈ అలర్ట్‌లు వద్దనుకునేవారు.. డివైజ్ సెట్టింగ్స్‌లో ఎర్త్‌క్వేక్/ఎమర్జెన్సీ అలర్ట్‌ను ఆఫ్ చేసుకోవచ్చు.

## అమెరికా రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనండి



**వాషింగ్టన్, జూన్ 25 :** భారత సంతతికి చెందినవారు ప్రజా జీవనంలో మరింత క్రియాశీల పాత్ర పోషించాలని, చట్టసభలకు జరిగే ఎన్నికల్లో పాల్గొని తమ వాణిని వినిపించాలని అమెరికా పార్లమెంటులోని భారతీయ అమెరికన్ సభ్యులు పిలుపునిచ్చారు. అమెరికాలోని కొన్ని ప్రాంతాల్లో భారతప్పట్ల ద్వేషభావం పెరుగుతున్న నేపథ్యంలో ఇది తప్పదని వారు అభిప్రాయపడ్డారు. ఫౌండేషన్ ఫర్ ఇండియా అండ్ ఇండియన్ డయాస్పోరా (ఎఫ్ఐఐడీఎస్) అమెరికా పార్లమెంటు భవన సముదాయం తదితరాలు ఉన్న క్యాపిటల్ హిల్ ప్రాంతంలో నిర్వహించిన సదస్సులో వక్తలు ఈ అభిప్రాయాన్ని వ్యక్తీకరించారు. భారతీయ అమెరికన్లు బాగా చదువుకున్న సంపన్న వర్గమైనప్పటికీ అమెరికాలో అనేక కొత్త సవాళ్లను ఎదుర్కొంటున్నారని కాంగ్రెస్ (పార్లమెంటు) సభ్యుడు రాజా కృష్ణమూర్తి తెలిపారు. 'భారతీయులపట్ల, హిందువులపట్ల ద్వేషం ప్రబలిపోతోంది' అని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భారత సంతతికి చెందినవారు అమెరికా రాజకీయాల్లో మరింత చురుగ్గా పాల్గొనాలని రాజా కృష్ణమూర్తి అభిప్రాయపడ్డారు.

## గుప్తుల కాలం నాటి స్నానఘట్టం

**నలంద, జూన్ 25 :** బీహార్‌లోని నలంద విశ్వవిద్యాలయం సమీపంలోని ఒక జలాశయంవద్ద కాల్చిన ఇటుకలు, సున్నపు పూతతో నిర్మించిన 1,600 ఏళ్ల నాటి స్నానఘట్టం బయటపడింది. నలంద విశ్వవిద్యాలయం శిథిలాలకు వాయవ్యంగా ఉన్న హ్యూన్‌త్సాంగ్ స్మారక చిహ్నం సమీపంలోని సూరజ్‌పూర్ గ్రామంలో గల పన్సోఖర్ పోఖర్ (జలాశయం)లో నలంద జిల్లా యంత్రాంగం ఎర్త్ మూవర్లు , పొక్లెయిన్ల సహాయంతో పూడికతీత పనులు చేపడుతున్నప్పుడు ఈ స్నానఘట్టం బయటపడింది. పన్సోఖర్ పోఖర్ జలాశయం సుమారు 850 మీటర్ల పొడవు, 175 మీటర్ల వెడల్పుతో ఉంది. ఈ జలాశయంలో అనేక మట్టిపాత్రల శకలాలు, గుప్తుల కాలానికి చెందినదిగా భావిస్తున్న ఒక రాగి నాణెం, సుమారు 25 మిల్లీమీటర్ల వ్యాసం గల ఒక లోహ మిశ్రమ కాయిల్ లభించాయి.



## రిజర్వేషన్ల అంతమే బీజేపీ లక్ష్యం: కాంగ్రెస్ ఆరోపణ



**ఢిల్లీ, జూన్ 25:** రిజర్వేషన్లను అంతం చేసేందుకు వీలుగా రాజ్యాంగాన్ని సవరించే లక్ష్యంతోనే బీజేపీ వివిధ పార్టీల్లో చీలికలు తెచ్చి లోక్‌సభలో మూడింట రెండొంతుల మెజారిటీ సాధించేందుకు ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ బుధవారం ఆరోపించింది. మహిళా రిజర్వేషన్ల పట్ల ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే 543 మంది సభ్యులున్న లోక్‌సభలో నారీ శక్తి వందన్ అధినియమ్ పేరుతో తెచ్చిన మహిళా రిజర్వేషన్ చట్టాన్ని వెంటనే అమల్లోకి తెచ్చి వచ్చే ఎన్నికల్ని అదే సంఖ్య ప్రాతిపదికన నిర్వహించాలని సవాలు విసిరారు. టీఎంసీ, శివసేన (యూబీటీ)లను చీల్చడానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన ప్రయత్నాలు 2024 ఎన్నికల్లో తాము చేసిన ఆరోపణలను నిజం చేస్తున్నాయన్నారు. కాగా...రిజర్వేషన్లకు బీజేపీ చరమగీతం పాడబోతోందన్న కాంగ్రెస్ ఆరోపణలను ఆ పార్టీ బుధవారం ఖండించింది. కాంగ్రెస్ ఆరోపణల్ని బీజేపీ అధికార ప్రతినిధి షానవాజ్ హుసేన్ తిప్పి కొట్టారు. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో దేశం ప్రగతి సాధిస్తోందని, కాంగ్రెస్ విమర్శించడం తప్ప మరేమీ చేయలేని స్థితిలో ఉందని ఆయన వ్యాఖ్యానించారు.

## ఢిల్లీలో ఆ పోస్టర్లు చూసి.. 10 లక్షల ఓట్లు వస్తాయన్నారు

### ఇటలీ ప్రధాని జార్జియా మెలోని



**రోమ్, జూన్ 25:** ఇటలీ ప్రధాని జార్జియా మెలోనికి భారత్‌పై ప్రత్యేక అభిమానం. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలే అందుకు నిదర్శనం. ఇటీవల ఆ దేశ పర్యటనకు వెళ్లిన ప్రధాని మోడీ ఆమెకు 'మెలోడీ' చాక్లెట్లు కానుకగా ఇచ్చిన దృశ్యాలు వైరల్గా మారాయి. తాజాగా తన పుస్తకంలో భారత్ పర్యటన గురించి ప్రస్తావించి మన దేశంపై తన అభిమానాన్ని చాటుకున్నారు.

మెలోని తన కొత్త పుస్తకం ' జార్జియా విజన్'లో భారత్ పర్యటన గురించి రాసుకొచ్చారు. పర్యటన సందర్భంగా ఆమెకు స్వాగతం పలుకుతూ రోడ్డుకు ఇరువైపులా భారీగా పోస్టర్లు ఏర్పాటు చేశారు. ఢిల్లీలో ప్రయాణిస్తుండగా పక్కనే ఉన్న ఉప ప్రధాని ఆంటోనియో తజని ఓ సరదా వ్యాఖ్య చేశారట. ఈ పోస్టర్లు చూస్తుంటే.. ఢిల్లీ నియోజకవర్గం నుంచి మీరు పోటీ చేస్తే కనీసం 10 లక్షల ఓట్లు వచ్చేలా ఉన్నాయని ఆయన చమత్కరించారట. ఈ విషయాన్ని మెలోని పుస్తకంలో ప్రస్తావించారు.

''నేను ఢిల్లీలో అడుగుపెట్టగానే.. స్వాగతం పలుకుతూ పోస్టర్లు వెలిశాయి. అలా రోడ్డు మీద వెళ్తున్న కొద్దీ అడుగడుగునా కనిపించాయి. అన్ని పోస్టర్లలోనూ ఒకటే ఫొటో. చాలా అనందంగా అనిపించింది. థ్యాంక్స్ టు భారత్'' అంటూ రాసుకొచ్చారు.

మెలోని ఇప్పటి వరకు భారత్‌లో రెండుసార్లు పర్యటించారు. 2023 మార్చిలో 'రైసినా డైలాగ్' పేరిట నిర్వహించిన అంతర్జాతీయ సదస్సుకు హాజరైన ఆమె.. అదే ఏడాది సెప్టెంబర్‌లో నిర్వహించిన జీ 20 సదస్సుకు హాజరయ్యారు.

## విమానాశ్రయాల్లో హబ్ అండ్ స్పోక్ సేవలు

### ప్రారంభించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



**ఢిల్లీ, జూన్ 25:** రానున్న ఆరు వారాల్లో దేశవ్యాప్తంగా ఆరు విమానాశ్రయాల్లో హబ్ అండ్ స్పోక్ సేవలు ప్రారంభం కానున్నట్లు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు ప్రకటించారు. నేడు వారణాసిలో హబ్ అండ్ స్పోక్ సేవలను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం కేంద్రమంత్రి మాట్లాడుతూ.. తొలుత వారణాసి నుంచి ఎయిరిండియా ఈ సేవలను అందిస్తుందని పేర్కొన్నారు. ఈ మోడల్‌తో భారత్ గ్లోబల్ ఏవియేషన్ హబ్‌గా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. చిన్న నగరాల నుంచి అంతర్జాతీయ గమ్యస్థానాలకు వెళ్లే ప్రయాణికులు ఢిల్లీ వంటి పెద్ద ఎయిర్‌పోర్టుల మీదుగా ప్రయాణించే అవకాశం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రయాణికులకు ఆయన స్వయంగా బోర్డింగ్ పాస్‌లు ఇచ్చారు. ఈజీ కనెక్ట్ సర్వీసు కింద తొలి ఏఐ1111 విమానం వారణాసి నుంచి ఉదయం 9.30 గంటలకు ఢిల్లీకి బయల్దేరింది.

**హైదరాబాద్‌లో కూడా ఈ సేవలు..**

ఎయిరిండియా సీఈవో, ఎండీ క్యాంప్‌బెల్ విల్సన్ మాట్లాడుతూ.. ఈజీ కనెక్ట్ ఫ్లైట్ సేవలను త్వరలోనే హైదరాబాద్, చెన్నై, అమృత్సర్, కొచ్చి, గోవాకు విస్తరించనున్నట్లు వెల్లడించారు. ఈ సేవలతో ప్రయాణికులు తమ తొలి ఎయిర్పోర్టులోనే బ్యాగేజీ, ఇమిగ్రేషన్ ప్రాసెస్ పూర్తి చేసుకోవచ్చన్నారు.

**ప్రపంచ దేశాలకు భారత్‌లోని ప్రాంతాలు మరింత చేరువ: ప్రధాని నరేంద్ర మోడీ**

హబ్ అండ్ స్పోక్ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ ఓ సందేశం పంపారు. చిన్న నగరాల ప్రజలకు ప్రపంచ వ్యాప్త గమ్యస్థానాలు మరింత దగ్గరవుతాయని అభిప్రాయపడ్డారు. అది ప్రాంతీయ అభివృద్ధితోపాటు భారత ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి సాయం చేస్తుందన్నారు.

## కన్నడ నటి ఇంట్లో విగతజీవిగా వ్యాపారవేత్త



**బెంగళూరు, జూన్ 25 :** కన్నడ సినీ రంగానికి చెందిన నటి కృషి తాపండా నివాసంలో ఓ వ్యాపారవేత్త విగతజీవిగా కన్పించడం సంచలనం రేపింది. నటి స్నేహితుడైన 33 ఏళ్ల వైశాఖ్.. ఆమె నివాసంలో ఉరివేసుకున్నట్టు సమాచారం. బుధవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. గదిలో ఎలాంటి సూసైడ్ నోట్ లభించలేదు. అతడు ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధరించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఘటన సమయంలో నటి కృషి ఇంట్లో లేరని పోలీసులు వెల్లడించారు. వివాదాల కారణంగా నెల క్రితం భార్య నుంచి వేరుపడి నటి ఇంట్లోనే ఉంటున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.ఓ దోపిడీ కేసులో గతంలో వైశాఖ్‌పై కేసు నమోదైంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో పారిశ్రామికవేత్త అరవింద రెడ్డి నుంచి రూ.7కోట్లు డిమాండ్ చేస్తూ బెదిరింపు లేఖ పంపాడు. సదరు పారిశ్రామికవేత్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు అరెస్ట్ చేశారు. కొంతకాలం జైల్లో ఉన్న అతడు.. అనంతరం బెయిల్‌పై విడుదలయ్యాడు. అతడి మృతిపై కుటుంబసభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. 2014లో మిస్ కర్ణాటకగా గెలిచిన కృషి తాపండ 'అకీరా' చిత్రంతో వెండితెరపై అడుగుపెట్టారు. పలు కన్నడ సినిమాల్లో నటించి ప్రేక్షకాదరణ పొందారు. కన్నడ బిగ్ బాస్ సీజన్ 5లో పాల్గొన్నారు.

# ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌కి శ్రీకారం చుట్టిన కలెక్టర్



యాదాద్రి భువనగిరి జిల్లా జూన్ 25 (మనం ప్రతినిధి): యాదాద్రి భువనగిరి జిల్లాలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏ బి డి ఎం) కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి శ్రీకారం చుట్టారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏ బి డి ఎం) అమలులో మోడల్ డిస్ట్రిక్ట్గా ఎంపికైన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధ్యక్షతన జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించబడింది.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆరోగ్య రంగాన్ని పూర్తిస్థాయిలో డిజిటలైజ్ చేయడం, ప్రతి పౌరుడి ఆరోగ్య సమాచారాన్ని ఒకే వేదికపై అందుబాటులో ఉంచడం ఏబిడీఎం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా హెల్త్ ఫెసిలిటీ రిజిస్ట్రీ ( హెచ్ ఎఫ్ ఆర్) మరియు హెల్త్ ప్రొఫెషనల్ రిజిస్ట్రీ (హెచ్ బి ఆర్) నమోదులను వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, ల్యాబొరేటరీలు, ఫార్మసీలు మరియు వైద్య నిపుణులందరూ ఈ డిజిటల్ ప్లాట్ఫారమ్లో నమోదు కావాల్సి ఉంటుందని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య సంస్థలు మరియు ఆరోగ్య సిబ్బంది తప్పనిసరిగా హెచ్ ఎఫ్ ఆర్, హెచ్ పి ఆర్ నమోదులు పూర్తి చేయాలని సూచించారు. వైద్యులచే జారీ చేయబడే డిజిటల్ ప్రిస్క్రిప్షన్లు, ఆరోగ్య రికార్డుల డిజిటల్ నిర్వహణ ద్వారా ప్రజలకు మెరుగైన, పారదర్శకమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. ఏ బి డి ఎం అమలును పర్యవేక్షించేందుకు జిల్లాలో ప్రత్యేక కమిటీలు, ఫీల్ బృందాలు ఏర్పాటు చేయబడినట్లు కలెక్టర్ తెలిపారు. వచ్చే రెండు వారాల్లో జిల్లాలోని అన్ని అర్హత కలిగిన ఆరోగ్య సంస్థలు, వైద్య నిపుణుల నమోదులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం దేశంలోనే అతిపెద్ద డిజిటల్ ఆరోగ్య సంస్కరణల్లో ఒకటిగా నిలుస్తుందని, యాదాద్రి భువనగిరి జిల్లాను రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఏ బి డి ఎం ద్వారా పౌరుల ఆరోగ్య రికార్డులు సురక్షితంగా, సులభంగా అందుబాటులో ఉండే డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ ఏర్పడుతుందని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబిడిఎం) కింద ప్రతి పౌరునికి ఏ బి హెచ్ ఏ ఐ డి రూపొందించడం ద్వారా వారి ఆరోగ్య రికార్డులను డిజిటల్ రూపంలో అనుసంధానం చేయవచ్చు. రోగి అనుమతితో దేశంలోని ఏ ప్రభుత్వ లేదా ప్రైవేటు ఏ బి డి ఎం-నమోదిత ఆసుపత్రిలోనైనా గత వైద్య చరిత్ర, పరీక్షా నివేదికలు, ప్రిస్క్రిప్షన్లు మరియు ఇతర ఆరోగ్య వివరాలను పరిశీలించి, వేగవంతమైన మరియు నాణ్యమైన వైద్య సేవలు అందించవచ్చు. దీంతో కాగితపు రికార్డుల అవసరం తగ్గి, అత్యవసర పరిస్థితుల్లో కూడా చికిత్స మరింత సమర్థవంతంగా అందుతుంది. రోగి అనుమతి లేకుండా ఆరోగ్య వివరాలను ఎవరూ చూడలేరు; గోప్యతకు పూర్తి రక్షణ ఉంటుంది. ఈ సమావేశంలో డాక్టర్ మనోహర్ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి జెడ్.పి.సి.ఇ.ఓ. శోభరాణి ఏ బి డి ఎం నోడల్ అధికారి డాక్టర్ సుమన్ కళ్యాణ్, ఏ బి బి ఎం స్టేట్ ట్రైనర్ సాయి కుమార్, మున్సిపల్, పంచాయతీ రాజ్ శాఖల ప్రతినిధులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## వ్యాపారంలో నాణ్యత, నమ్మకమే విజయానికి పునాది

సూర్యాపేట టౌన్, జూన్ 25, మనం న్యూస్: వ్యాపారంలో నాణ్యత, నమ్మకమే విజయానికి పునాది అని ఫ్లెక్సీ, ప్రింటింగ్ పట్టణ అధ్యక్షులు ఖదీర్ అన్నారు. గురువారం పట్టణంలోని పోస్ట్ ఆఫీస్, జిల్లా గ్రంథాలయానికి ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ రామలక్ష్మణ్ ఫ్లెక్సీ ప్రింటింగ్ సంస్థను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘం ఆయన మాట్లాడుతూ.... నేటి పోటీ ప్రపంచంలో వినియోగదారులకు నాణ్యమైన సేవలు, సమయపాలన, సరసమైన ధరలు అందించే సంస్థలకే మంచి గుర్తింపు లభిస్తుందని అన్నారు. ఆధునిక సాంకేతికతతో ఫ్లెక్సీలు, ఫ్లెక్స్ బ్యానర్లు, వినైల్ ప్రింట్లు, స్టిక్కర్లు, హోర్డింగులు, డిజిటల్ ప్రచార సామగ్రిని అత్యుత్తమ నాణ్యతతో అందిస్తూ ఈ సంస్థ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో షారూఖ్, నిర్వాహకులు లోనావత్ లక్ష్మణ్, రాము, లక్ష్మి, బాలాజీ, కవిత, రవి, శేఖర్ బైక్ మెకానిక్, శ్రీపాద జానకీ రాములు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



చిలుకూరు జూన్25(మనం న్యూస్): చిలుకూరు మండల కేంద్రంలోని గ్లోబల్ స్కూల్ యందు చిలుకూరు పోలీస్ వారి ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ యాంటీ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవ దినం సందర్భంగా విద్యార్థులకు డ్రగ్స్ గురించి వాటి యొక్క వాడకం వలన కలిగే నష్టాల గురించి వివరించి వారిచే వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో చిలుకూరు ఎస్ఐ బి హనుమాన్ నాయక్ మాట్లాడుతూ మారక ద్రవ్యాలు రవాణా చేసిన వాటిని ఉపయోగించిన చట్టప్రకారముగా చర్యలు ఉంటాయని వాటి వాడకం వలన కలిగే నష్టాల గురించి తెలియపరిచినారు ఇట్టి కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ రాజశేఖర్ వారి ఉపాధ్యాయ బృందం మరియు చిలుకూరు పోలీస్ స్టేషన్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ పుల్లారావు, కానిస్టేబుళ్లు తిరుపతి, వీరబాబు పాల్గొన్నారు.

## 'ఇండియన్ ఇన్నోవేషన్ ఐకాన్స్ 2027' కోసం దరఖాస్తుల

హైదరాబాద్, జూన్ 25(మనంన్యూస్)ః హైదరాబాద్, జూన్ 22, 2026-మారికోఇన్నోవేషన్ ఫౌండేషన్ , ప్రభావవంతమైన ఆవిష్కరణలకు వేదిక గానిలిచినతన ప్రధానద్వైవార్షిక కార్యక్రమం 'ఇండియన్ ఇన్నోవేషన్ ఐకాన్స్' 11వఎడిషన్‌కు దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించింది. 2006లో ప్రారంభమైన ఇండియన్ ఇన్నోవేషన్ ఐకాన్స్, దేశంలోని ప్రధాన ఆవిష్కరణ గుర్తింపు వేదికల్లో ఒకటిగా ఎదిగింది. ఇది సామాజిక-ఆర్థిక మరియు పర్యావరణ ప్రభావాన్ని సృష్టించే సామర్థ్యం ఉన్న, ఇప్పటికీ విస్తృత గుర్తింపు పొందని కానీ భవిష్యత్తులో గణనీయమైన మార్పును తీసుకురాగల భారతీయ ఆవిష్కరణలను వెలుగులోకి తీసుకురావడమేదీని లక్ష్యం. సంవత్సరాలుగా, ఈ వేదిక అనేకమంది రాబోయే ఆవిష్కర్తలను హైలైట్చేసింది, వారిపరిష్కారాలు దేశవ్యాప్తంగా కమ్యూనిటీలు మరియు పరిశ్రమలను మార్చాయి. 11వ ఎడిషన్లోవ్యాపార (లాభాపేక్ష) మరియుసామాజిక (లాభాపేక్షలేని) విభాగాలకు చెందిన ఆవిష్కరణలను గుర్తించి సత్కరించ నున్నారు. ఈ కార్యక్రమానికి దరఖాస్తుల ప్రక్రియ 2026 జూన్ 22 నుంచిజూలై 22 వరకుకొనసాగనుంది.

ఆసక్తిగలఆవిష్కర్తలుఇండియన్ఇన్నోవేషన్ఐకాన్స్ 2027 వేదిక ద్వారా తమ దరఖాస్తులను సమర్పించవచ్చు. మారికోఇన్నోవేషన్ ఫౌండేషన్ హెడ్ రంజనాఘోష్, , మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగామా 'ఇండియన్ఇన్నోవేషన్ఐకాన్స్' విజేతలప్రగతినిగమనించడం, అలాగే భారతదేశ ఆవిష్కరణ పర్యావరణ వ్యవస్థఎలా పరిణామం చెందుతోందో చూడటం ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంది. 11వ ఎడిషన్ను ప్రారంభిస్తున్న ఈసందర్భంగా, గత ఎడిషన్ల ద్వారా వెలుగులోకి వచ్చిన ఆలోచనలు, ఆవిష్కర్తలు, ప్రభావవంతమైన విజయ గాథలమాదిరిగానే కొత్త కథనాలను కనుగొనడానికి మేము ఆసక్తిగా ఎదురు చూస్తున్నాము. మారికోఇన్నోవేషన్ఫౌండేషన్లో, దీనిని కేవలం ఆవిష్కరణలను సత్కరించే వేదికగా మాత్రమే కాకుండా, భారతదేశ భవిష్యత్తును రూపుదిద్దుతున్న వ్యక్తులు మరియు సంస్థల నుంచి నేర్చుకునే అవకాశం గాకూడామేము భావిస్తున్నాము. తదు పరితరం పరివర్తనాత్మక ఆవిష్కరణలను వెలుగులోకి తీసుకురావడానికిమేముఎదురుచూస్తున్నాము.

దేశవ్యాప్తంగా ఉన్నఆవిష్కర్తలుతమఆలోచనలు, అనుభవాలుమరియువిజయగాథలనుమాతోపంచుకోవడానికి, అలాగే ఈ కార్యక్రమానికి దరఖాస్తుచేసుకోవడానికిమేముహృదయపూర్వకంగాఆహ్వానిస్తున్నాము అనిఆయనఅన్నారు.

## డంపింగ్ యార్డులో వ్యర్థాల శుద్ధి పరిశీలించిన కలెక్టర్



సూర్యాపేట, జూన్ 25 (మనం ప్రతినిధి): సూర్యాపేట మండలం బాలెంల గ్రామ పరిధిలోని మున్సిపల్ డంపింగ్ యార్డును గురువారం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సందర్శించి తనిఖీ చేశారు. డంపింగ్ యార్డులో తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి ఏ విధంగా శుద్ధి చేస్తున్నారో సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇటీవల ఏర్పాటు చేసిన బయో మైనింగ్ యంత్రం పనితీరు, దాని ద్వారా తడి, పొడి వ్యర్థాలను ఎలా శుద్ధి చేస్తున్నారనే అంశాల పై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. డంపింగ్ యార్డు పరిసరాల్లో పేరుకుపోయిన తడి చెత్తను త్వరగా శుద్ధి చేయాలని, ఎటువంటి చెత్త నిల్వ ఉండకుండా పరిశుభ్రతను నిరంతరం నిర్వహించాలని అధికారులకు సూచించారు.ప్రజారోగ్య పరిరక్షణకు పరిశుభ్రమైన వాతావరణం అత్యంత అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి సోమయ్య, శానిటేషన్ ఇన్స్పెక్టర్ యాదగిరి, మున్సిపల్ మరియు ఇంజినీరింగ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### ఓటర్ జాబితా ప్రత్యేక సర్వే పరిశీలన

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్ కార్యక్రమంలో భాగంగా గురువారం నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు బి ఎల్ వో లు.

ఇంటింటి సర్వే ప్రక్రియను సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో నిర్వహిస్తున్న సర్వే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఇంటి ఇంటికి వెళ్లి నిర్వహిస్తున్న సర్వే ప్రక్రియ తీరును ప్రతి ఓటరుకు రెండు ఫారాలు అందజేయడంతో పాటు బీఎల్ఓలకు అవసరమైన సమాచారాన్ని స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. ఓటరు వివరాల్లో ఏవైనా తప్పులు ఉన్నట్లయితే సంబంధిత బీఎల్ఓకు తెలియజేసి సరిచేసుకోవాలని ప్రజలకు సూచించారు. అలాగే, కావాలని తప్పుడు సమాచారం అందించిన వారి విషయంలో ఫారంలో పొందుపరిచిన నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోబడతాయని కలెక్టర్ స్పష్టం చేశారు. ఓటరు జాబితా పారదర్శకంగా, ఖచ్చితత్వంతో రూపొందేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవరావు, డిప్యూటీ తహసీల్దార్ లాలు, బీఎల్ఓ బంగారు పద్మ, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## 28న నల్గొండకు రానున్నసీఎం రేవంత్ రెడ్డి



- జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్లగొండ-- జోన్ 20 ( మనం ప్రతినిధి ): రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి రాక సందర్భంగా ఈ నెల 28 న నల్గొండ జిల్లా కేంద్రం లోని ఎన్. జి కళాశాల మైదానంలో నిర్వహించనున్న బహిరంగ సభకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన నల్గొండ పట్టణం లోని ఎన్ జీ కళాశాల మైదానంలో బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. సభా వేదిక, గ్యాలరీలు, వాహన పార్కింగ్, రాకపోకల మార్గాలు, భద్రతా ఏర్పాట్లు, విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం తదితర అంశాలను సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సభా ప్రాంగణం చుట్టూ బలమైన బ్యారికేడింగ్ ఏర్పాటు చేయాలని, ఇరువైపులా ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. కళాకారుల కోసం ప్రత్యేక వేదికను ఏర్పాటు చేయాలని, గ్రౌండ్ మొత్తాన్ని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పూర్తిగా శుభ్రం చేయాలని ఆదేశించారు. మైదానంలో ఎక్కడా ఎత్తుపల్లాలు లేకుండా సమానంగా మొరం వేసి లెవలింగ్ చేయాలని, వర్షం వచ్చినా నీరు నిలిచిపోకుండా డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని చెప్పారు. గ్రౌండ్ మొత్తాన్ని రోలింగ్ చేసి తీర్చిదిద్దాలని, పరిసర ప్రాంతాల్లో గుంతలు లేకుండా చూడాలని సూచించారు. ముఖ్యమంత్రి ప్రసంగించే ప్రధాన వేదికను ఎత్తుగా, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఏర్పాటు చేయాలని, సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై .అశోక్ రెడ్డి, తహసిల్దార్ పరశురాం, ఇతర అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## జిల్లా డీ - అడిక్షన్ సెంటర్‌ను సందర్శించిన ఐపీఎస్ ఆకాంక్ష యాదవ్




యాదాద్రి భువనగిరి,జూన్ 25 (మనం ప్రతినిధి )ః యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపిఎస్ భువనగిరి పట్టణంలోని న్యూ హోప్ అసోసియేషన్ జిల్లా డీ-అడిక్షన్ సెంటర్ (డి డి ఏ సి) ను సందర్శించారు. గురువారం పునరావాస కేంద్రంలో చికిత్స పొందుతున్న వ్యక్తులతో ముఖాముఖి మాట్లాడి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. చెడు అలవాట్లను పూర్తిగా విడిచిపెట్టి, పునరావాస అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రోత్సహించారు. మత్తు పదార్థాలకు ఎలా బానిసలయ్యారు, వాటిని ఎక్కడి నుండి కొనుగోలు చేశారనే అంశాలపై వారితో చర్చించారు, వారి కుటుంబాల పరిస్థితి గురించి ఆరా తీసి, మత్తు వ్యసనం కుటుంబాలపై చూపే ప్రభావాన్ని వివరించారు. క్రీడలు, ఆటలు, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు, విద్య మరియు ఉపాధిపై దృష్టి పెట్టాలని సూచించారు. క్రమశిక్షణ, సానుకూల ఆలోచనలు మరియు ఆత్మవిశ్వాసంతో కొత్త జీవితాన్ని ప్రారంభించాలని ప్రేరేపించారు.

సమాజంలో గౌరవప్రదమైన జీవితం గడపడానికి పోలీసు శాఖ తరపున అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. మత్తు పదార్థాల నిర్మూలనకు యాదాద్రి భువనగిరి పోలీస్ శాఖ కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమం లో భువనగిరి సీఐలు రమేష్ , చంద్రబాబు మరియు ఎస్ఐలు అనిల్ కుమార్, నరేష్ మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి



చింతలపాలెం జూన్ 25 (మనం న్యూస్): మండల పరిధిలోని దొండపాడు గ్రామంలో మండల ఐ ఎన్ టి యు సి అధ్యక్షుడు చింతిర్యాల రవీంద్ర కుమార్తె కళ్యాణి వివాహ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర ఐ ఎన్ టి యు సి ప్రధాన కార్యదర్శి ఎర్రగాని నాగన్న గౌడ్, మరియు కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నంది రెడ్డి ఇంద్రారెడ్డి చింతలపాలెం మండల పార్టీ అధ్యక్షుడు నరాల కొండారెడ్డి, చెన్నకేసి వెంకయ్య, ఉప సర్పంచ్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, లిఫ్ట్ చైర్మన్ మల్లెల వెంకటరెడ్డి ,సోషల్ మీడియా కన్వీనర్ దొంగల కార్తీక్, పిట్టల కాశయ్య, రవికుమార్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి



- పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలి
- ఏమైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలి
- అవసరమైతే ఇతర శాఖల సిబ్బంది సేవలను వినియోగించుకుంటాం
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా..
- కరీంనగర్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ పర్యవేక్షణ

కరీంనగర్, జూన్ 25(మనం బ్యూరో ): ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా, వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. బీఎల్వోలు, సూపర్వైజర్లు ఏమైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ ప్రక్రియ పకడ్బందీగా పారదర్శకంగా నిర్వహించాలని ఎలాంటి తప్పిదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. గురువారం సాయంత్రం కరీంనగర్ నగరంలోని 46వ డివిజన్ ప్రగతినగర్ ప్రాంతంలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్తో కలిసి పరిశీలించారు. బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, ఓటర్ల వివరాల సేకరణ చేపడుతున్న తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ఏ విధంగా నిర్వహిస్తున్నారు.. ఎన్ని గంటలకు ప్రారంభించారు. కార్యాచరణ ప్రణాళిక ఎలా రూపొందించుకుంటు న్నారు. త్వరగా పూర్తి చేయడానికి ఏం చర్యలు తీసుకుంటున్నారు అని జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. ప్రజలకు తగిన అవగాహన కల్పిస్తూ ప్రణాళిక ప్రకారం ముందుకు సాగితే ప్రక్రియ వేగంగా పూర్తవుతుందని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ ఓటర్లతోనూ మాట్లాడారు. బీఎల్వోలు, సూపర్వైజర్లు విధుల నిర్వహణలో ఎదురయ్యే ఇబ్బందులను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించుకుంటే కార్యక్రమం సాఫీగా, ప్రశాంతంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. అవసరమైతే ఇతర శాఖల సిబ్బందిని కూడా ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేస్తామని కలెక్టర్ తెలిపారు. మహిళా సంక్షేమ, రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు, సిబ్బంది సేవలను కూడా వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఒక నిర్దిష్ట షెడ్యూల్, ప్రణాళిక ప్రకారం ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలను అందజేయాలని, అర్హులైన ప్రతి ఓటరుకు సమాచారం చేరేలా చూడాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తోందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ అర్బన్ తహసిల్దార్ రాజేష్, సంబంధిత అధికారులు, సూపర్వైజర్లు, బీఎల్వోలు పాల్గొన్నారు.

## శ్రీ షిర్డి సాయి టెంపుల్ 27వ వార్షిక మహోత్సవం



హైదరాబాద్, మనం న్యూస్ః శ్రీ షిర్డి సాయి టెంపుల్ ఆలయ ధర్మకర్త మాణిక్ పవర్ బాబా ఆధ్వర్యంలో ఆలయ 27వ వార్షిక మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వేద పండితులు ఎమ్మెల్యే గారికి వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాట్లాడుతూ, 'నేను చిన్న వయసులో ఈ ఆలయంలో శ్రీ షిర్డి సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరయ్యాను. ఈరోజు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా మళ్లీ ఈ ఆలయానికి రావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఇది అంతా శ్రీ షిర్డి సాయిబాబా ఆశీస్సుల వల్లే సాధ్యమైంది. అలాగే ఈ కాలనీతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా, ఎల్లప్పుడూ మీకు అండగా, తోడుగా ఉండి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు భీముడు నాయక్ వెంకట నాయక్ లక్ష్మణ్ నాయక్ కాలనీవాసులు ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## సర్ కార్యక్రమం ప్రారంభం



తిరుమలగిరిజూన్ 25. (మనం న్యూస్): తిరుమలగిరి మున్సిపాలిటీ కేంద్ర ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) సర్వే కార్యక్రమాన్ని గురువారం డిప్యూటీ తహసిల్దార్ జాన్ మొహమ్మద్, రెవెన్యూ సిబ్బంది, పి ఎల్ వాళ్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుమలగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎల్సోజు నరేష్ పలు సూచనలు చేశారు. సర్ కార్యక్రమంలో బి ఎల్ ఓ లు ప్రధాన భూమిక పోషించాలని, కాంగ్రెస్ పార్టీ బి ఎల్ ఓ లు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. పోలింగ్ బూత్ కు సంభందించిన బి ఎల్ ఓ ను సంప్రదించాలని, అవసరమైన విషయాలపై స్పందించాలని చెప్పారు. ఇంటింటికీ తిరిగే బి ఎల్ ఓ లతో సమన్వయం చేసుకుంటూ, పూర్తి సహకారం అందించాలని సూచించారు. ప్రతి ఇంటికీ, ప్రతి ఓటర్ కు బి ఎల్ ఓ లు రెండు, రెండు ఎన్యుమరేషన్ ఫారాలు ఇస్తారని అవి ప్రతి ఓటరు కు అందే విధంగా చూడాలని, బూత్ పరిధి లోని ఓటర్ల పేరు, చిరునామా తదితర వివరాలు సక్రమంగా నమోదై ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని సరిగా లేకపోతే సరిచేయడం లో సహాయం చేయాలని చెప్పారు. కొత్త ఓటర్లు నమోదు చేయించాలని, ఓటర్ల వివరాలలో మార్పులు ఉంటే తెలియజేయాలని, మరణించిన వారి ఓటు ను జాబితా నుండి తొలగించే విధంగా బి ఎల్ ఓ కు సరియైన సమాచారం ఇవ్వాలని, ఓటర్ల జాబితాను ఖచ్చితంగా రూపొందించడంలో భాగస్వాములు కావాలని, రెండు ఓట్లు ఉన్న వారిని గుర్తించి బి ఎల్ ఓ కు తెలియచేయాలని చెప్పారు. మన ఓటు - మన హక్కు - మన బాధ్యత అర్హులైన వారి ప్రతి ఓటు జాబితాలో ఉండాలని, అనర్హుల ఓటును జాబితాలో తొలగించాలని, ఓటుహక్కును కాపాడి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని చెప్పారు. బి ఎల్ ఓ గా పూర్తి భాధ్యతలను నెరవేర్చలని కాంగ్రెస్ పార్టీ అప్పచెప్పిన పనిని సక్రమంగా సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.

# ప్రజల వద్దకే సుపరిపాలన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రజా దర్బార్

- మహిళా సంఘాల ఆర్థిక స్వావలంబనకు వడ్డీలేని రుణాలతో ప్రభుత్వ అండ
- అర్హులైన ప్రతి పేద కుటుంబానికి పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు



మంత్రి సీతక్క ములుగు, జూన్ 25, మనం ప్రతినిధి: ప్రజల సమస్యలను గ్రామస్థాయిలోనే తెలుసుకొని వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమాలను నిర్వహిస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. గురువారం ములుగు జిల్లా మంగపేట మండలం రాజుపేట గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమంలో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మంగపేట మండల పరిధిలోని అక్కినేపల్లి మల్లారం, బ్రాహ్మణపల్లి, రాజుపేట, కత్తిగూడెం, నిమ్మగూడెం, దోమెడ, రామచంద్రునిపేట, వాడేగూడెం, రమణక్కపేట, చుంచుపల్లి, వాగుడుగూడెం గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రజలు తమ సమస్యలు, వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల ఆర్థిక బలోపేతానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇప్పటివరకు మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల రూపంలో రూ.61 వేల కోట్లకు పైగా సహాయం అందించామని తెలిపారు. గతంలో మహిళా సంఘాలకు రూ.5 లక్షల వరకు మాత్రమే అందిన వడ్డీలేని రుణ పరిమితిని ప్రస్తుతం రూ.10 లక్షలకు పెంచామని పేర్కొన్నారు. మహిళా సంఘాల ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతోందని, పాడి కేంద్రాలు, కొనుగోలు కేంద్రాల నిర్వహణలో మహిళా సంఘాలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని తెలిపారు. గ్రామీణ మహిళలు సంఘాలుగా ఏర్పడి కలిసి పనిచేస్తే కుటుంబాల ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రజలు జిల్లా కేంద్రాలకు తిరగాల్సిన అవసరం లేకుండా గ్రామాల వద్దకే పరిపాలనను తీసుకువెళ్లడం ప్రత్యేక ప్రజా దర్బార్ లక్ష్యమని మంత్రి తెలిపారు. ప్రజలు అందించే ప్రతి దరఖాస్తును పరిశీలించి, వాటి సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసి నిర్ణీత వ్యవధిలో పరిష్కరించే విధంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని, ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు ప్రాధాన్యత క్రమంలో ఇండ్లను అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ ప్రజలకు సులభంగా దరఖాస్తులు అందించే విధంగా ప్రత్యేక ఫార్మాట్ రూపొందించామని తెలిపారు. గ్రామాల వారీగా అందుతున్న దరఖాస్తుల ద్వారా స్థానిక సమస్యలపై స్పష్టమైన అవగాహన ఏర్పడి, పరిష్కార చర్యలు మరింత వేగవంతం అవుతాయని తెలిపారు. ప్రతి దరఖాస్తును నమోదు చేసి సంబంధిత శాఖలకు పంపించి, పరిష్కార స్థితిపై నిరంతర పర్యవేక్షణ నిర్వహిస్తామని, సమస్య పరిష్కారం కాకపోతే కారణాలను కూడా ప్రజలకు స్పష్టంగా తెలియజేసే విధంగా వ్యవస్థను రూపొందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. అంతకుముందు మంగపేట మండల కేంద్రంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఆఫీస్ భవనాల నిధుల కింద రూ.150 లక్షల వ్యయంతో నిర్మించనున్న మండల ప్రజా పరిషత్ భవన నిర్మాణ పనులకు మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం రాజుపేట గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నూతనంగా నిర్మించిన సైన్స్ ల్యాబ్ భవనాన్ని మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, ఏటూరు నాగారం ఏ ఎస్ పి మనన్ భట్, అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి., సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డీవో కృష్ణవేణి, పంచాయతీ రాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, తహసీల్దార్, ఎంపీడీవో, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలు ఆకస్మిక తనిఖీ

భీమదేవరపల్లి, జూన్ 25 మనం న్యూస్: ఎరువుల దుకాణాలపై మండల వ్యవసాయ అధికారి పద్మ తనిఖీ చేశారు. గురువారం రోజున మండల పరిధిలోని గ్రామాలైన ముల్కనూర్, కొత్తకొండ లోని ఎరువు దుకాణాలగ్రోమోర్ సెంటర్లో బిల్ బుక్కులు, స్టాక్ రిజిస్టర్, క్రిమిసంహారక మందుల తయారీ తేదీలు, వివిధ పంటల విత్తనాల నాణ్యతను వ్యవసాయ అధికారి పరిశీలించారు. అనంతరంవారు మాట్లాడుతూ విత్తనాలు ,పెస్టిసైడ్స్, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని, బోగస్ విత్తనాల కంపెనీలను విక్రయం చేయొద్దని హెచ్చరించారు.



## మాజీ మంత్రిని కలిసిన టిక్కి రాష్ట్ర నాయకులు



హైదరాబాద్, జూన్ 25(మనంన్యూస్): ట్రైబల్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ తెలంగాణ చాప్టర్ రాష్ట్ర నాయకులు మాజీ మంత్రి అమర్ సింగ్ తిలావత్ ని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా గిరిజన పారిశ్రామికవేత్తలు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లను వివరించి, వారి అభివృద్ధి మరియు సాధికారత కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించడం జరిగింది ఈ సమావేశంలో ట్రైబల్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ తెలంగాణ చాప్టర్ రాష్ట్ర అధ్యక్షులు ధారావత్ శ్రీనివాస్ నాయక్ మరియు కోఆర్డినేటర్ సంతోష్ నాయక్ మరియు యూత్ ఎంటర్ ప్రేన్యూర్ సెల్ రాష్ట్ర కార్యదర్శి అశోక్ నాయక్ తదితరులు పాల్గొన్నారు

## మహదేవపూర్ పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్



మహదేవపూర్, జూన్ 25మనం న్యూస్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మహదేవపూర్ మండలం లోని అంబటిపల్లి గ్రామంలో అక్రమ కార్యకలాపాలనియంత్రణ,శాంతిభద్రతల పరిరక్షణ మరియు నేరాల నివారణ లక్ష్యంగా ఈరోజు తెల్లవారుజామున పోలీసులు విస్తృతంగా కార్డన్ అండ్సెర్చ్ఆపరేషన్నిర్వహించారు. కాటారండీఎస్పీ సూర్యనారాయణ ఆదేశాల మేరకు మహదేవ్పూర్ సీఐవెంకటేశ్వర్లు పర్యవేక్షణలో, మహదేవపూర్ ఎస్హెచ్ ఓ సాంబమూర్తిమహదేవ్పూర్ ఎస్ఐ,జె. రమేష్ , కాళేశ్వరం ఎస్ఐ బాగావత్ ఎస్సై పాలిమేలా ఎస్సైసాయి శశాంక్ మరియు పోలీసు సిబ్బంది గ్రామాన్నిపూర్తిగాతమఆధీనంలోకి తీసుకుని ఇంటింటి తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా అనుమానితవ్యక్తులు, నేరచరిత్ర కలిగినవ్యక్తుల వివరాలనుసేకరించి ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలో భాగంగా 30 లీటర్ల గుడుంబాను సీజ్ చేసారు, మొత్తం65వాహనాలనుతనిఖీచేయగానంబర్ప్లేట్లులేని6వాహనాలను గుర్తించి పోలీస్ స్టేషన్కు తరలించారు. వాహనాల పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు మరియు ఇతర రికార్డులను పరిశీలించారు. డిక్యుమెంట్ లేని వాటికీజరిమానా వేయడంజరిగింది, అలాగేగ్రామంలో గుడుంబా వినియోగంవల్లకలిగేదుష్పరిణామాలపైప్రజలకుఅవగాహనకల్పించారు. గుడుంబా సేవించడంవల్ల ఆరోగ్యసమస్యలుకుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు, నేరాలపెరుగుదలమరియుసామాజిక సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వివరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనుమానాస్పదవ్యక్తులు లేదా సంఘటనల గురించివెంటనే పోలీసులకు సమాచారం అందించాలని గ్రామస్తులను కోరారు. ప్రజలసహకారంతో గ్రామంలో శాంతిభద్రతలను మరింత బలోపేతం చేస్తామని, ఇటువంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మరియు గ్రామస్తులు గ్రామ ప్రజలు నాయకులు పాల్గొన్నారు

## విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించే లక్ష్యం



- కలెక్టర్ సత్యశారద

వరంగల్, జూన్ 25(మనంన్యూస్): ప్రభుత్వ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'తెలంగాణ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ - టీఐఆర్ఎస్ నిర్మాణ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం వరంగల్ మండలం పైడిపల్లి గ్రామంలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నిర్మాణ పనులను కూలంకషంగా పరిశీలిస్తూ నిర్మాణంలో వాడుతున్న సిమెంట్ గ్రేడ్, ఇనుము నాణ్యత, ఇటుకల దృఢత్వం గురించి ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను, కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనులు వివరాలను, ఎంత శాతం పూర్తయ్యాయి, మిగిలిన పనులు ఎప్పటిలోగా పూర్తవుతాయి అనే అంశంపై కాంట్రాక్టర్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ వర్షాకాల పరిస్థితుల వల్ల నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న ఇబ్బందులు, సిమెంట్ సెట్టింగ్, కురిసే వర్షం వల్ల మట్టి పని ఆలస్యం వంటి అంశాలను కూడా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అధికారులు, కాంట్రాక్టర్ సమన్వయంతో పని చేయాలి అని వారు అన్నారు. గడువులోగా నాణ్యమైన భవనం నిర్మించి విద్యార్థులకు అందజేయాలి అని కలెక్టర్ అధికారులను కోరారు. ఈ తనిఖీలో జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, జిల్లా విద్యాధికారి రంగయ్య నాయుడు, వరంగల్ తహసీల్దార్ శ్రీకాంత్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్, తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ సవరణ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా గ్రంథాలయ చైర్మన్

మహదేవ్పూర్, జూన్ 25(మనం న్యూస్): ఎస్ఐఆర్-2026 ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 ఏళ్లునిండినప్రతిఒక్కరూఓటరుగా నమోదు చేసుకోవాలి. కొత్త ఓటర్ల నమోదు మనందరి బాధ్యత. అర్హులైన వారి పేర్లు జాబితాలో ఉండేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలిఅని గ్రంథాలయ చైర్మన్ రాజబాబుకోరారు.ఇంటింటి పర్యటనలో కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, మార్పులపై ప్రజలకు వివరించారు.

ఈ కార్యక్రమం లో పాల్గొన్న జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోటరాజబాబు మరియు మహాదేవపూర్ తాసిల్దార్ సత్యనారాయణస్వామి మరియు సర్పంచ్ హసీనాబాను 175 బూత్ బిఎల్ ఎఉస్మాన్ ఖాన్ మరియు బిఎల్ ఓరాజ శేఖర్ బూత్ 176బిఎల్ ఓ రూహియా సూపర్ వైజర్ రాజాబాపు ఎన్ఎస్ యుఐటౌన్ ప్రెసిడెంట్ శ్రవణ్ కుమార్ తో పాటువివిధ నాయకులు పాల్గొన్నారు..



## వధూవరులని ఆశీర్వదించిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి



మాహదేవపూర్ జూన్ 25మనం న్యూస్: మహాదేవపూర్ మండలం ఎడపల్లి గ్రామంలో మోతే పవన్ కళ్యాణ్ అంజలి గార్ల వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు. కుమ్మరి రజిని కుమార్ మల్లీశ్వరి గార్ల వివాహా ఇటీవల కాగా వారి ఇంటికి వెళ్ళి నూతనవధూవరులనుఆశీర్వదించిన టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు వారి వెంట జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబుసర్పంచ్ మోతే నీలరాణి సాంబయ్యకాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కట్కూ అశోక్ మాజీ ఎంపీపీ రాణి బాయి రామారావు, ఏఎంసి చైర్మన్ పంతకాని తిరుమల సమ్మయ్య ఎస్ సి సెల్ మండల అధ్యక్షులు లేతకారి రాజబాబు,బుర్రి శివరాజ్,బేగ్లూర్ ఉపసర్పంచ్ చల్లూరి సదానంద చారి,చేకూర్తి శంకర్,కాట్రేవుల నవీన్ యాదవ్,కోట సమ్మయ్య, వార్డు మెంబర్లు మోతే నాగమణి సమ్మయ్య, కన్నూరి పద్మ రవి కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

## సర్ సర్వేను పరిశీలించిన కలెక్టర్

వరంగల్, జూన్ 25(మనంన్యూస్): బుధవారం ప్రారంభమైన ఇంటింటి ఎస్ఐఆర్ సర్వేను కొత్తవాడ లో జరుగుతున్న ఇంటింటి సర్వే ను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పరిశీలించారు. సర్వే నిర్వహిస్తున్న ఒక ఇంటిని సందర్శించి బూత్ లెవల్ అధికారి (బీఎల్వో)ను అడిగి సర్వే విధానం, వివరాలను తెలుసుకున్నారు. సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరిని గుర్తించాలని సూచించారు. ఎస్ఐఆర్ సర్వే విజయవంతం కావడానికి ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ తహసీల్దార్ శ్రీకాంత్, బీఎల్వోలు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## పాఠశాల భవనాన్ని ప్రారంభించిన మంత్రి

ములుగు, జూన్ 25(మనంన్యూస్): గురువారం ములుగు జిల్లా మంగపేట మండలం రాజుపేట గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నూతనంగా నిర్మించిన భవనం సైన్స్ ల్యాబ్ ను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా,శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, ఏటూరు నాగారం ఏ ఎస్ పి మనన్ భట్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, డి ఈ ఓ సిద్ధార్థ రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## వధూవరులను ఆశీర్వదించిన విఎన్ నాయక్



హనుమకొండ, జూన్ 25 (మనం న్యూస్): హనుమకొండ జిల్లా అలకనంద ఏసీ ఫంక్షన్ హాల్ లో మ్యారేజ్ రిసెప్షన్ లో పాల్గొన్న ముఖ్య నాయకులు అక్షయ లాల్ నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి ఎన్ నాయక్, టి ఎన్ జి ఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాము నాయక్, మాజీ ఎంపీటీసీ సోము నాయక్, ఫారెస్ట్ డిప్యూటీ రేంజర్ సాంబు నాయక్, రిటైర్డ్ జీసిసి మేనేజర్ హరిలాల్ నాయక్, ఫారెస్ట్ ఆఫీసర్ సూరి దాస్ సింగ్, బంధుమిత్రులు ముఖ్య నాయకులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపినారు

# విద్యార్థులకు నాణ్యమైన వసతి, భోజనం, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి

- గోదావరి వరదల నివారణకు శాశ్వత రక్షణ చర్యలు.
- ఆధునిక సాంకేతికతతో జియో ట్యూబ్స్ ద్వారా కరకట్టకు పటిష్ట భద్రత.
- ప్రజలు, రైతులకు వరదల నుంచి దీర్ఘకాలిక రక్షణ కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం.
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క.



ఏటూర్ నాగారం జూన్ 25 మనం ప్రతినిధి, ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన వసతి, భోజనం, మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, గోదావరి పరివాహక ప్రాంతాల్లో ప్రతి ఏటా సంభవించే వరదల కారణంగా ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను శాశ్వతంగా నివారించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. ప్రజల భద్రత, విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. గురువారం ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఆకులవారి ఘనపూర్ ప్రభుత్వ గిరిజన బాలికల వసతి గృహాన్ని మంత్రి అనసూయ సీతక్క జిల్లా కలెక్టర్తో కలిసి సందర్శించి, రామన్నగూడెం వద్ద గోదావరి నది కరకట్ట భద్రత కోసం నూతన సాంకేతికతతో ఏర్పాటు చేస్తున్న జియో ట్యూబ్స్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో హాస్టల్కు నూతనంగా చేరిన విద్యార్థినుల పరిస్థితులను పరిశీలించి, వసతి గృహంలోని మరుగుదొడ్లు, వంటశాల, తరగతి గదులు, విద్యార్థులకు అందుతున్న మౌలిక సదుపాయాలను పరిశీలించారు. గోదావరి నది ప్రవాహ పరిస్థితులు, కరకట్ట భద్రత, వరదల సమయంలో నది కరకట్ట దెబ్బతినకుండా చేపడుతున్న రక్షణ చర్యలను మంత్రి ప్రత్యక్షంగా పరిశీలించారు. సంబంధిత అధికారులను అడిగి, మ్యాప్ ఆధారంగా గోదావరి ప్రవాహ తీరు, కరకట్ట పరిస్థితులు, జియో ట్యూబ్స్ ఏర్పాటు విధానం, చేపడుతున్న రక్షణ చర్యలపై పూర్తి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, వర్షాకాలం ప్రారంభమైన ప్రతి సంవత్సరం గోదావరి వరదల ప్రభావంతో ఏటూరునాగారం, రామన్నగూడెం, మంగపేట, అకినేపల్లి మల్లారం, ఓడగూడెం తదితర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ముందస్తు చర్యలపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గత 10 నుండి 15 సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న గోదావరి రక్షణ పనులను ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యతగా తీసుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచనలతో నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. మంగపేట, రామన్నగూడెం ప్రాంతాల్లో వరద ఉధృతి గ్రామాలపై ప్రభావం చూపకుండా దేశంలోనే అత్యాధునిక సాంకేతికతతో జియో ట్యూబ్స్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిమిత ప్రాంతాల్లో అమలు చేస్తున్న తరుణంలో తొలిసారిగా ములుగు నియోజకవర్గంలో అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. పతి సంవత్సరం వరదల సమయంలో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవించే పరిస్థితి రాకుండా దీర్ఘకాలిక, శాశ్వత రక్షణ చర్యలు చేపడుతున్నామని, కరకట్టల వద్ద ఎక్కడైనా బలహీన ప్రాంతాలు గుర్తించిన వెంటనే తాత్కాలిక మరమ్మత్తులతో పాటు శాశ్వత నిర్మాణ పనులు కొనసాగిస్తున్నామని తెలిపారు. మంగపేట ప్రాంతంలో కరకట్ట నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయని, రామన్నగూడెం వద్ద కూడా అదే తరహాలో పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండి వరద పరిస్థితులపై పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు నాణ్యంగా ఉండేలా చూడాలని, ప్రభుత్వ వసతి గృహాల్లో పరిశుభ్రత, భోజన నాణ్యత, మరుగుదొడ్లు, తరగతి గదులు వంటి మౌలిక సదుపాయాల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్తో కలిసి విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం చేసి, అందిస్తున్న ఆహారం నాణ్యతను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు అందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు పిరంగి, జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి, ఐబీ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కమిటీల చైర్మన్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాజేశ్వరరావును పరామర్శించిన గుత్తుల

కాట్రేనికోన జూన్ 25 మనం ప్రతినిధి: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం కాట్రేనికోన మండలం కాట్రేనికోనలో కాట్రేనికోన మండలం వాటర్ డిస్ట్రిబ్యూషన్ కమిటీ ఉపాధ్యక్షులు వాసంశెట్టి రాజేశ్వరరావు మాతృమూర్తి ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి గురువారం పరామర్శించారు ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి బిసి సెల్ అధికార ప్రతినిధి విత్తనాల వెంకటరమణ ,గుత్తుల బుజ్జి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## బాలయ్య-కొరటాల సినిమా షురూ

కొరటాల శివ దర్శకత్వంలో బాలకృష్ణ హీరోగా ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. 'NBK 112' వర్కింగ్ టైటిల్ తో తెరకెక్కబోతున్న ఈ చిత్రం పూజా కార్యక్రమం అమరావతిలో ఘనంగా జరిగింది. బాలకృష్ణ అల్లుడు, ఏపీ మంత్రి నారా లోకేష్ ముఖ్యఅతిథిగా హాజరరై క్లాప్ కొట్టగా.. బాలయ్య చిన్న కూతురు తేజస్విని కెమెరా స్విచ్ ఆన్ చేశారు. బాలయ్య ఓ డైలాగ్ చెప్పి అలరించాడు. ఈ కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేశ్, నిర్మాత సురేశ్ బాబుతోపాటు మరికొందరు సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. ఆగస్ట్ నుంచి ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానున్నట్లు మేకర్స్ తెలిపారు. 2027లో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

## శర్వాకి హీరోయిన్ ఫిక్స్.. ఫస్ట్ షెడ్యూల్ అప్పుడే !





దర్శకుడు శ్రీను వైట్ల - హీరో శర్వానంద్ కాంబినేషన్ లో రాబోతున్న సినిమా 'జార్జ్ క్రిష్'. ఈ సినిమాలో నటించే హీరోయిన్ గురించి ఇప్పటికే చాలా రూమర్స్ వచ్చాయి. ఐతే, తాజాగా వినిపిస్తున్న అప్ డేట్ ప్రకారం.. భాగ్యశ్రీ బోర్సే ను హీరోయిన్ గా ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. కానీ, ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. ఇక ఆగస్టు మొదటి వారం నుంచి ఈ సినిమా ఫస్ట్ షెడ్యూల్ లో ఓపెనింగ్ సన్నివేశాలను చిత్రీకరిస్తారని, అనంతరం జరగబోయే రెండో షెడ్యూల్ లో హీరో - హీరోయిన్ల పై లవ్ సీన్స్ ను షూట్ చేస్తారని తెలుస్తోంది. అన్నట్టు ఈ సినిమాను సంక్రాంతి బరిలో దించాలని గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఐతే, గోపీచంద్ హీరోగా శ్రీను వైట్ల దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ కామెడీ 'విశ్వం' ఏవరేజ్ గా నిలిచింది. దీంతో, ఎలాగైనా మళ్ళీ టాలీవుడ్ లో తన తర్వాత సినిమాతో బిజీ అయ్యేందుకు శ్రీనువైట్ల తెగ కష్ట పడుతున్నాడట. ఈ క్రమంలోనే శర్వాకి కథ చెప్పాడు. కాగా తెలియని వయసులో ఆవేశంలో చేసిన ఓ పని కారణంగా హీరో లైఫ్ లో జరిగే డ్రామా చాలా బాగుంటుందట. మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాను నిర్మించనుంది.

# తొలి వన్డే ప్రపంచ కప్ గెలిచి 43 ఏళ్లు!

**వివ్ రిచర్డ్స్, క్లైవ్ లాయిడ్, గ్రీనిడ్జ్, డెస్మండ్ హైన్స్.. క్రీజ్ లోకి వచ్చారంటే టాప్ బౌలరైనా ఖంగు తినాల్సిందే..**

**మాల్కమ్ మార్షల్, ఆండీ రాబర్ట్స్, మైకెల్ హోల్డింగ్.. ఈ పేర్లు వింటే అప్పట్లో ఎంతటి బ్యాటర్లకైనా వెన్నులో వణుకే.**

**హ్యాట్రిక్ వరల్ కప్ పై గురి పెట్టిన వెస్టిండీస్ అనే భయంకరమైన జట్టు బరిలోకి దిగింది. అనుకున్నట్లుగానే ఫైనల్ కు చేరుకుంది.. కానీ, ఓ అనామక (అప్పటికి) జట్టు చేతిలో ఓటమిపాలై వెళ్తామని కనీసం ఎవరూ ఊహించి ఉండరు. ప్రపంచ క్రికెట్ లో 'టీమ్ఇండియా'తో జాగ్రత్తగా ఉండాలని ప్రత్యర్థులు అనుకొనే రోజుకు నాంది పడి ఇప్పటికి 43 ఏళ్లు.**

అది 1983 జూన్ 25.. వన్డే ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ జరిగిన రోజు ఇది. టీమ్ఇండియా చరిత్రలో తొలిసారి ఐసీసీ కప్పును సగర్వంగా అందుకొన్నది ఆరోజే. కపిల్ దేవ్ సారథ్యంలోని భారత్ ఫైనల్ లో వెస్టిండీస్ ను చిత్తు చేసి మరీ లారడ్స్ లో టైటిల్ ను సొంతం చేసుకుంది. ఈ ప్రపంచ కప్ లో టీమ్ఇండియా ప్రయాణమే సంచలన విజయంతో ఆరంభమైంది. ఆ తర్వాత కెప్టెన్ కపిల్ దేవ్ సూపర్ ఇన్నింగ్సోపాటు మిగతా ప్లేయర్ల సహకారంతో ఫైనల్ కు చేరుకుంది. అక్కడా బలమైన విండీస్ ను సమష్టిగా ఓడించింది.

ఈ వరల్ కప్ లో తొలి మ్యాచ్నే వెస్టిండీస్ తో భారత్ ఆడాల్సి వచ్చింది. హేమాహేమీ బౌలర్లను ఎదుర్కొని మరీ 60 ఓవర్లలో 262/8 స్కోరు చేసింది. అనంతరం స్టార్ బ్యాటర్లను త్వరగా పెవిలియన్ కు చేర్చి విండీస్ ను 228 పరుగులకే ఆలౌట్ చేసింది.


విండీస్ తో మ్యాచ్ తర్వాత.. జింబాబ్వేపైనా భారత్ గెలిచింది. వరుసగా రెండు మ్యాచుల్లో గెలిచి ఊపు మీదున్న టీమ్ఇండియాకు ఆస్ట్రేలియా రూపంలో తొలి ఓటమి ఎదురైంది. ఆ తర్వాత విండీస్ తోనూ పరాజయం తప్పలేదు.

ఆ తర్వాత జింబాబ్వేతో కీలక పోరులో కెప్టెన్ కపిల్ దేవ్ (175*) సూపర్ ఇన్నింగ్స్ తో భారత్ గట్టెక్కింది. ఈ మ్యాచ్ లైవ్ కవరేజీ లేకపోవడం ఇప్పటికీ భారత అభిమానులను బాధపెట్టించే అంశమే. ఆ ఊపుతో ఆస్ట్రేలియానూ సెకండ్ రౌండ్ మ్యాచ్ లో టీమ్ఇండియా చిత్తు చేసింది. లీగ్ స్టేజ్ లో రెండు మ్యాచుల్లోనే ఓడి సెమీస్ కు దూసుకొచ్చింది. ఇక సెమీస్ లోనూ ఇంగ్లాండ్ అద్భుత విజయం నమోదు చేసింది.

మళ్లీ ఫైనల్ కు డిఫెండింగ్ ఛాంపియన్ వెస్టిండీస్ వచ్చింది. భారత్ తొలుత బ్యాటింగ్ చేసింది. కేవలం 183 పరుగులకే ఆలౌటైంది. దీంతో హ్యాట్రిక్ కప్పు విండీస్ సొంతమని చాలా మంది భావించారు. కామెంటేటర్లు కూడా ఇదే మాట చెప్పారు. కానీ, మ్యాచ్ జరిగే కొద్దీ విండీస్ ఫ్యాన్స్ నీరుగారిపోయారు. వెస్టిండీస్ కేవలం 140 పరుగులకే కుప్పకూలడంతో భారత్ తొలి కప్పును ముద్దాడింది.

జింబాబ్వేపై కపిల్ ఆడిన 175 ఇన్నింగ్స్ ఎంత విలువైందో.. ఫైనల్ లో కపిల్ దేవ్ వెనక్కి పరుగెడుతూ రిచర్డ్స్ ఇచ్చిన క్యాచ్ ను అందుకోవడమే టర్నింగ్ పాయింట్.

లారడ్స్ లో కపిల్ దేవ్ తన చేతులతో కప్పు అందుకొన్న క్షణం కేవలం అతడికే కాదు.. యావత్ భారతావనికి మరిచిపోలేని సన్నివేశం. అన్నట్లు.. ఫైనల్ లో వెస్టిండీస్ పై టీమ్ఇండియా చేసిన పరుగులు 183.. అందులోనే ఉంది కదా.. ఇది భారత్కు '1'వ కప్.. '83'లో సాధించామనే గుర్తు..





# టీ20 కెప్టెన్సీ.. ఇన్స్టా బయో మార్చిన శ్రేయస్ అయ్యర్

ఐర్లాండ్తో రెండు టీ20 సిరీస్ తో శ్రేయస్ అయ్యర్ కెప్టెన్ గా బాధ్యతలు చేపట్టనున్నాడు. ఈ క్రమంలో తన ఇన్స్టాగ్రామ్ బయోను మార్చడం ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారింది. తన రెండో పుట్టిన తేదీ అంటూ అందులో మెన్షన్ చేయడం గమనార్హం. 1994 డిసెంబర్ 6న శ్రేయస్ అయ్యర్ జన్మించాడు. అయితే, క్రికెట్ కెరీర్ పరంగా తనకు గతేడాది డిసెంబర్ 25న రెండో లైఫ్ వచ్చినట్లు రాసుకొచ్చాడు. దీంతో సోషల్ మీడియాలో అతడి అభిమానులు కామెంట్లతో ముంచెత్తారు.

''శ్రేయస్ అయ్యర్ 25.12.2025నాడు గాయం నుంచి కోలుకుని బ్యాట్ ను అందుకొన్నాడు. ప్రాణం పోయే పరిస్థితి నుంచి బయటపడ్డాడు. ఇది కేవలం క్రికెట్ లోకి పునరాగమనం చేసిన రోజే కాదు.. తన జీవితంలో కొత్త జీవితానికి నాంది పలికాడు. అందుకే అతడికి ఇది స్పెషల్. అక్కడ్నుంచి తన ప్రయాణం ఫ్రెష్ గా మొదలుపెట్టాడు. క్రమశిక్షణతో చాలా కష్టపడ్డాడు'' అని ఓ అభిమాని తన సోషల్ మీడియా ఖాతాలో రాసుకొచ్చాడు.




# ఓజీ 2
## నుంచి బ్లాక్ బస్టర్ అప్డేట్

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ కు అదిరిపోయే గుడ్ న్యూస్ అందింది. ఏపీ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా, యంగ్ డైరెక్టర్ సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కిన గ్యాంగ్ స్టర్ డ్రామా 'ఓజీ'. బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించిన ఈ మూవీకి సీక్వెల్ గా 'ఓజీ 2' రానున్నట్లు ఇప్పటికే అఫీషియల్ అనౌన్స్ మెంట్ వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా ఆ సినిమా పనులు అధికారికంగా ప్రారంభమయినట్లు తెలుపుతూ చిత్రబృందం ఓ స్పెషల్ వీడియోను షేర్ చేశారు. అనే హ్యాష్ ట్యాగ్ తో 'గంభీర కథ సిద్ధమవుతోంది.. తుపాను రావడానికి ముందు నిశ్శబ్దం ఉంటుంది' అనే పవర్ ఫుల్ క్యాప్షన్ తో షేర్ చేసిన ఈ వీడియో ప్రజెంట్ నెట్టింట వైరల్ అవుతూ పవర్ స్టార్ ఫ్యాన్స్ తో పాటు మూవీ లవర్స్ ను సైతం ఆకట్టుకుంటోంది.

ఇక విడుదలైన వీడియోలో డైరెక్టర్ సుజీత్ తో కలిసి పవన్ కల్యాణ్ స్క్రిప్ట్ పై చర్చిస్తున్నట్లు చూపించారు. మొత్తం స్క్రిప్ట్ చర్చించుకున్న తర్వాత పవన్ కల్యాణ్ చివరిలో 'నేను రెడీ' అని చెప్పడం మెగా అభిమానులను విపరీతంగా ఆకర్షిస్తోంది. దీంతో 'ఓజీ 2' షూటింగ్ త్వరలోనే సెట్స్ మీదకు వెళ్లనుందని స్పష్టమవుతుండగా.. ఫ్యాన్స్ పండుగ చేసుకుంటున్నారు. 'ఓజీ'కి మ్యూజిక్ అందించిన థమన్.. ఈ సీక్వెల్ కు కూడా సంగీతం అందించనున్నారు. డీవీవీ ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు.





# 'మీ దుస్తులు మీ ఇష్టం.. వాడి కళ్లు వాడి ఇష్టం'



ప్రముఖ టాలీవుడ్ సింగర్ సునీత మహిళలపై ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూకు హాజరైన ముఖ్యంగా మహిళల వస్త్రధారణపై ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె ఫెమినిజం గురించి షాకింగ్ కామెంట్స్ చేశారు. నా బాడీ.. నా హక్కు అన్నప్పుడు మీ ఇష్టమైన దుస్తులు ధరించవచ్చని సునీత తెలిపింది. మిమ్మల్ని ఎవరు చూడలేదని మీకు అనిపించినప్పుడు ఎలాంటి బట్టలు వేసుకున్న తప్పులేదన్నారు. అదే సమయంలో అవతలి వ్యక్తి కళ్లు.. అతని ఇష్టమని పేర్కొన్నారు. అవతలివాళ్లు మిమ్మల్ని చూడడంలో ఎలాంటి తప్పులేదని సునీత అన్నారు. ఈ సందర్భంగా ఇండస్ట్రీలో మహిళలు ఎదుర్కొనే సమస్యల గురించి కూడా ఆమె ఇంటర్వ్యూలో చర్చించారు. సునీత మాట్లాడుతూ..' సినీ ఇండస్ట్రీలో నో చెప్పడం అనేది మామూలు విషయం కాదు. అలా చెబితే ఇక్కడ అవకాశాలు రావడం చాలా అరుదు. ఈ విషయంలో ఎవరు కూడా అతీతులు కాదు. ఇండస్ట్రీలో నాకు వచ్చిన అవకాశాలు నన్ను ఓ స్థాయిలో నిలబెట్టాయి. ఇంతకుమించి నేను ఎక్కువ ఆశించలేదు. ఇదే మన లైఫ్ అనుకుంటే సమస్యలు వస్తాయి. సింగర్ అవకాశాలు రాకపోతే వెళ్లి వ్యవసాయం చేసుకుంటా. మహిళలు వాళ్లకు ఇష్టం వచ్చినట్లు బట్టలు వేసుకోవచ్చు. తప్పులేదు.. కానీ అవతలి వ్యక్తులను నువ్వు ఎంతమందిని మారుస్తారు. మీకు నచ్చిన దుస్తులు ధరించండి.. కానీ దానిని స్వేచ్ఛ.. హక్కు అని పిలవకండి. అవతలి వ్యక్తులను మార్చడం కంటే మనల్ని మార్చుకోవడం చాలా సులభం. సమాజంలో మహిళను చూసే పరిస్థితి చాలా దారుణం. ఇక్కడ మాటలు, చూపులతోనే హర్ట్ చేస్తారు. ఎవరు కూడా ఇక్కడ మహిళల మాటకు విలువ ఇచ్చిన సందర్భాలు నేను చూడలేదు' అని అన్నారు. మహిళలు ధరించే దుస్తులకు, ఫెమినిజంకు ఎలాంటి సంబంధం లేదని సింగర్ సునీత అన్నారు. ఇక్కడ మన సమాజంలో ఆడ, మగ రెండు పూర్తిగా విభిన్నమైన జాతులని ఆమె తెలిపారు. సినీ ఇండస్ట్రీ మహిళలకు పూర్తిగా సురక్షితమైన ప్రదేశం కాదని.. తాను 18 ఏళ్లకే అసౌకర్యకర పరిస్థితిని ఎదుర్కొన్నానని వెల్లడించారు.

# ఎవరితోనూ రిలేషన్ షిప్‌లో లేను: శ్రుతి హాసన్

సంచలన నటీమణుల్లో శ్రుతి హాసన్ ఒకరిని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. అంతే కాదు చాలా బోల్ నటి కూడా. ప్రేమ, పెళ్లి విషయంలో చాలా స్పష్టమైన అభిప్రాయాలను వ్యక్తం చేసే నటి.ప్రఖ్యాత నటుడు, సినీ వికీపీడియా కమలహాసన్ వారసురాలు అయిన శ్రుతి హాసన్ స్వతంత్ర భావాలు కలిగిన నటి. ఆ మధ్య ప్రేమించిన వ్యక్తిని తన తండ్రికి పరిచయం చేసిన గట్స్ ఉన్న నటి ఈ భామ.

హిందీ చిత్ర పరిశ్రమలో కథానాయకిగా ఎంట్రీ ఇచ్చి, ఆ తరువాత తెలుగు, తమిళం భాషల్లో నటిస్తూ క్రేజీ కథానాయకిగా రాణిస్తున్న విషయం తెలిసిందే. అంతే కాకుండా సంగీత దర్శకులు,గాయని అంటూ పలు శాఖల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు. ఇటీవల ఈమె నటుడు రజనీకాంత్ తో కలిసి కూలీ చిత్రంలో నటించి మంచి పేరు తెచ్చుకున్నారు.

తమిళంలో విజయ్ సేతుపతి కి జంటగా నటించిన ట్రైన్ చిత్రం త్వరలో తెరపైకి రావడానికి సిద్ధమవుతోంది. ఇటీవల కథానాయకిగా బిజీగా లేకున్నా అభిమానులతో తరచూ సోషల్ మీడియా ఇంటరాక్టివ్ అవుతూ తమ భావాలను పెంచుకుంటూ వార్తల్లో ఉంటున్నారు. అలా తాజాగా అభిమానులతో ముచ్చటించారు. అందులో ఒకరు మీరు రిలేషన్ షిప్ లో ఉన్నారా అని అడగ్గా '' నేను రిలేషన్ షిప్ లో లేనని స్పష్టం చేశారు. అదేవిధంగా మీరు సినీ రంగంలో లేకుంటే ఏం చేసేవారు అన్న ప్రశ్నకు పిల్లల మనోతత్వ వైద్యురాలినన్నే దానిని పేర్కొన్నారు. ఈమె వ్యాఖ్యలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.